ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 27.05.2026 | సంపుటి : 12 | సంచిక : 307 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### ఐఏఎస్ అధికారుల మాదిరి.. పంచాయతీ సిబ్బందికీ

# ఒకటో తేదీనే జీతాలు

**వేతనాల కోసం నెలకు రూ.50 కోట్లు విడుదల చేస్తాం**



- ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ఠంఛనుగా జీతాలు ఇవ్వాలి
- ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకోను
- పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- కొత్తగా అందించే వాటిలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందివ్వాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందాలన్నారు. ఆ సిబ్బంది వేతనాల కోసం నెలకు రూ.50 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. "ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకోను. పంచాయతీల ఆదాయాన్ని ట్రెజరీలో కాకుండా బ్యాంకులో జమ చేయాలి. దీనికోసం చట్టసవరణ చేయాలి. పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసేలా ఓటర్ ఐడీ, ఆధార్, ఎస్ఈఈపీసీ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు.

## అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి




**అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే**

**'సర్' ప్రక్రియపై ఎస్ఈసీ సుదర్శన్ రెడ్డి ఆదేశాలు**

**హైదరాబాద్,మే26(జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో మిగతా 2లో..


### శాంతి చర్చల వేళ..

# ఇరాన్‌పై అమెరికా భీకరదాడి

**దీటుగా తిప్పికొట్టిన ఇరాన్**



- ఆత్మరక్షణ కోసమే టెహ్రాన్‌పై దాడులు చేశాం
- యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి టిమోతీ హాకిన్స్ ప్రకటన
- యురేనియంను మాకు ఇవ్వండి.. లేదంటే నాశనం చేయండి
- ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ పోస్ట్



**టెహ్రాన్(జనంసాక్షి):** నేడో, రేపో ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదరొచ్చని ప్రచారం జరుగుతున్న వేళ అమెరికా మరోసారి తన ఆయుధాలకు పని చెప్పింది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలపై తీవ్రమైన దాడులు చేసింది. బందర్ అబ్బాస్ సహా పలు ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది. ఆత్మరక్షణ కోసమే తాము ఇరాన్ క్షిపణి ప్రయోగ లాంచ్‌ప్యాడ్లు, సముద్రంలో మందుపాతరలు పరిచే బోట్లను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి టిమోతీ హాకిన్స్ పేర్కొన్నారు. సముద్రంలో మందుపాతరలు పరిచేందుకు యత్నిస్తున్న బోట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. తమ దేశానికి చెందిన రెండు విమాన వాహక నౌకలు, రెండు డజన్లకు పైగా యుద్ధ నౌకలకు తీరం వెంట ఉన్న ఇరాన్ క్షిపణి స్థావరాలు ముప్పుగా పరిణమించినట్లు వెల్లడించారు. తమ దాడిలో బందర్ అబ్బాస్ పోర్టులోని నేవీ బేస్ కూడా ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. ఇరాన్ వైపు లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. యుద్ధం ముగింపుపై నేడు ఖతార్ రాజధాని దోహాలో మిగతా 2లో..



### అమెరికాకు ఇక ఏ ప్రదేశమూ

# సురక్షితం కాదు

- అమెరికా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చేశాం
- ఆర్‌క్యూ-4 డ్రోన్, ఈ-35 యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపాం
- ట్రంప్ సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. అమెరికా సైనిక బలగాలపై
- మరిన్ని ఆశ్చర్యకరమైన దాడులు చేస్తాం.. ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికాకు చెందిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా ఆర్‌క్యూ-4 డ్రోన్, ఈ-35 యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు తెలిపింది. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా తీవ్రమైన దాడులు చేసిన నేపథ్యంలో ఈ తరహాలో తిప్పికొట్టినట్లు పేర్కొంది. అమెరికా చేసే ఏ కాల్పుల విరమణ ఉల్లంఘనకైనా ప్రతీకారం తీర్చుకునే చట్టబద్ధమైన హక్కు తమకు ఉందని ఐఆర్‌జీసీ వెల్లడించింది. ట్రంప్ సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, సైనిక బలగాలపై మరిన్ని ఆశ్చర్యకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. శాంతి ఒప్పందంపై చర్చలు జరుగుతుండగా.. అమెరికా దాడులు చేయడాన్ని ఏ మాత్రం సహించబోమని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని.. ఇకపై పశ్చిమాసియాలో అమెరికా బేస్‌లకు ఎక్కడా సురక్షిత మిగతా 2లో..

# హైదరాబాద్‌కు మరో జీసీసీ



**ఏర్పాటుకు ముందుకొచ్చిన రీజెనరాన్**

**ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఎంఓయూ**

**హైదరాబాద్(జనంసాక్షి):** అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్ ను ఎంపిక చేసుకుంటున్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారున్యూయార్క్ లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు. రీజనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారీ కోవల్ ఆధ్వర్యంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం నాడు డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించి బ్యారీ కోవల్. తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ లు అవగాహన పత్రాల (ఎంఓయు)ను మార్చుకున్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెజెనరాన్‌కు ఐర్లాండ్, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నజిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని తెలిపారు.. ఇది ప్రపంచవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి అత్యున్నత స్థాయి మిగతా 2లో..




## మావోయిస్టు కీలకసభ్యుడు నరహరి లొంగుబాటు

- ఆయన భార్య కూడా..
- డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి ఇరువురు

**హైదరాబాద్(జనంసాక్షి):** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి.. తన భార్య దానమ్మతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈమేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పసునూరి నరహరిని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సందర్భంగా డీజీపీ మాట్లాడారు. నరహరి లొంగుబాటుతో మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలిందన్నారు. "పసునూరి నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా సోమిడి. డిగ్రీ చదువుతున్న సమయంలో మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిపోయారు. 1982లో అజ్ఞాత దళ సభ్యుడిగా చేరారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్ల తయారీలో ఆయన నిపుణుడు. సాంకేతిక, సంస్థాగత బాధ్యతలను ఏకకాలంలో నిర్వర్తిస్తూనే.. ఆయుధాల ఉత్పత్తి, మరమ్మతు, నిర్వహణకు సంబంధించి మావోయిస్టు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేవారు.మావోయిస్టు కార్యకలాపాలను మిగతా 2లో..

### ఇంటింటి సర్వేతో

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'




- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
- అధికారులను ఆదేశించిన కేబినెట్ సబ్‌కమిటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', మిగతా 2లో..



## సింగరేణి బొగ్గు మాయం

**లెక్కలు చెప్పండి**

**రూ.వెయ్యి కోట్ల భూమిని అప్పనంగా అప్పగించేశారు**

**170 ఎకరాల భూమిని ప్రభుత్వ భూమిని ప్రైవేటుకు కట్టబెట్టారు: హరీశ్‌రావు**


**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకుపడ్డారు. మిగతా 2లో..

### బండి భగీరథ్‌కు మూడు రోజుల

## పోలీసు కస్టడీ

**మల్కాజిగిరి కోర్టు అనుమతి**

**హైదరాబాద్(జనంసాక్షి):** పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. అతడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు విచారించనున్నారు. వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరగా.. కోర్టు మూడు రోజులకే అనుమతించింది. ఈనెల 16న అరెస్టైన బండి సంజయ్ తనయుడు భగీరథ్.. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.




### వాహనదారులపై

## సీఎన్‌జీ పిడుగు

**కేజీకి రూ.2 పెంచిన కేంద్రం**

**వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు**

**న్యూఢిల్లీ,మే26(జనంసాక్షి):** కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మిగతా 2లో..

**ప్రొ॥ నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు మా బలగాలు**

## తెలంగాణకు వెళ్లలేదు

**ఖండించిన ఏపీ పోలీసులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏపీలో పలు చోట్ల కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు చేరుకున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' మిగతా 2లో..

### చొరబాట్లపై

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన**

# ఉన్నతస్థాయి కమిటీ




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసు కుంటున్న అసహజ జనాభా మార్పులను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. జనాభా మార్పు సమస్య భారతదేశ మిగతా 2లో..

## తెలంగాణలో ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

**అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్,మే26(జనంసాక్షి):** ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. మిగతా 2లో..

# భారత్-అమెరికా మరో కీలక ఒప్పందం

**క్రిటికల్ మినరల్స్ సరఫరాకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరు దేశాలు సంతకాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సాంకేతికత రంగంలో కీలకమైన క్రిటికల్ మినరల్స్ సరఫరా గొలుసులో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకునే దిశగా భారత్-అమెరికా కీలక ముందడుగు వేశాయి. క్రిటికల్ మినరల్స్ సరఫరాకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. ఢిల్లీ వేదికగా జరుగుతున్న క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం అనుబంధంగా ఈ ఒప్పందం కుదిరింది.ప్రస్తుత వాణిజ్య పరిస్థితుల్లో ఈ ఫ్రేమ్‌వర్క్ అత్యంత కీలకమైనదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని అమెరికా విదేశీ మిగతా 2లో..



# సింగరేణి బొగ్గు మాయం

శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

రూ.వెయ్యి కోట్ల భూమిని అప్పనంగా అప్పగించేశారు

రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 170 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదని ఆర్డీవో పేర్కొన్న నాలుగు రోజుల వ్యవధిలో అక్కడి తహసీల్దార్ పట్టా భూమిగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రూ.వెయ్యి కోట్ల స్కామ్ జరిగితే.. తహసీల్దార్‌ను బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, నేతలు ఎల్.రమణ, ముఠా గోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు.

అంత ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది?

"పెద్దషాపూర్‌లో 170 ఎకరాలు ప్రభుత్వ భూమి అని ఆర్డీవో స్పష్టంగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దానికి భిన్నంగా పట్టా భూమిగా పేర్కొంటూ రాత్రికి రాత్రే భూభారతిలో ప్రైవేటు భూమిగా చేర్చారు. ఆర్డీవో ఆదేశాలను ధిక్కరించి ఆర్డర్ ఇచ్చే ధైర్యం తహసీల్దార్‌కు ఎక్కడిది? ప్రైవేటు వ్యక్తులకు భూములను ధారాదత్తం చేస్తే ఆయన్ను కాపాడుతోంది ఎవరు? తహసీల్దార్‌పై గతంలో ఏసీబీ దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి ఉన్నారు. భూభారతిలో ఎంట్రీ జరగాలంటే కలెక్టర్, సీసీఎల్ఏ అనుమతి ఉండాలి. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు ఎవరున్నారు? ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా శంషాబాద్‌లో రూ.కోట్ల విలువైన 170 ఎకరాల భూమిని కట్టబెట్టే చేసే ధైర్యం తహసీల్దార్‌కు ఉంటుందా? ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరిపించాలి. తహసీల్దార్‌ను డిస్మిస్ చేయాలి. ఆ భూములను వెంటనే భూభారతిలో నిషేధిత జాబితాలో చేర్చాలి" అని డిమాండ్ చేశారు.

# పాక్-చైనా ప్రకటనలో 'కశ్మీర్' ప్రస్తావన సరికాదు

**తిప్పికొట్టిన భారత్**

**న్యూఢిల్లీ:**పాకిస్థాన్, చైనా జారీ చేసిన ఉమ్మడి ప్రకటనలో జమ్మూకశ్మీర్ ప్రస్తావనను తీసుకురావడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని స్పష్టం చేసింది. ఈ అంశంపై వ్యాఖ్యానించే హక్కు వేరే ఏ దేశానికీ లేదని పేర్కొంది. 'చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' ప్రాజెక్టులు కొన్ని భారత భూభాగంలో ఉన్నాయని.. అక్కడ పాక్ చేసిన ఆక్రమణలను బలపరిచేందుకు ఏ దేశమైనా చేసే ప్రయత్నాలను తిరస్కరిస్తామని తెలిపింది.పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల చైనా లో పర్యటించారు. ఆ క్రమంలో చైనా, పాకిస్థాన్‌లో ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నలకు భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ దీటుగా స్పందించారు. ఈ రెండు దేశాల మధ్య సరిహద్దు జలవనరుల సహకారం అనే ప్రస్తావననూ చూశామన్నారు. ఆ రెండు దేశాల మధ్య ఎలాంటి సరిహద్దు లేనందున.. అసలు ఆ అంశమే తలెత్తదన్నారు. పాకిస్థాన్– చైనా మధ్య 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని భారత్ ఎప్పటికీ గుర్తించబోదని స్పష్టం చేశారు.

# వెంటనే కీవ్‌ను వీడండి

**విదేశీయులకు రష్యా హెచ్చరికలు జారీ**

**మాస్కో:**రష్యా–ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఉక్రెయిన్‌పై శక్తిమంతమైన హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్' సహా పలు క్షిపణులు, వందల డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా.. రాజధాని నగరం కీవ్‌పై ముమ్మందు భారీ దాడులు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. అధ్యక్షుడు జెలెన్స్కీ విధాన నిర్ణయాల్లో కీలకమైన భవనాలు, రక్షణరంగ పరిశ్రమలు, కమాండ్ సెంటర్లు, డ్రోన్ తయారీ కేంద్రాలు లక్ష్యంగా దాడులు ఉధృతం చేస్తామని హెచ్చరించింది. వెంటనే విదేశీ దౌత్యవేత్తలు, పౌరులు నగరాన్ని వీడాలని రష్యా తన హెచ్చరికల్లో పేర్కొంది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని దాడులకు అవకాశం ఉన్నందున కీవ్‌లోని అమెరికా దౌత్య సిబ్బందిని ఖాళీ చేయించాలని రూబియోకు లావ్రోవ్ సూచించారు. "దౌత్యవేత్తలు, పలు అంతర్జాతీయ సంస్థల సిబ్బంది, విదేశీయులు సాధ్యమైనంత త్వరగా కీవ్‌ను వీడండి. మిలిటరీ, పరిపాలనా భవనాలకు సాధారణ పౌరులు దూరంగా ఉండాలి" అని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ తన ప్రకటనలో పేర్కొంది.అయితే రష్యా ఈ తరహా ప్రకటన చేయడం ఇదే తొలిసారి కాదు. తమ రెడ్ స్క్వేర్ వద్ద మిలిటరీ పరేడ్‌కు ఏవైనా అంతరాయాలు కలిగించాలని యత్నిస్తే.. కీవ్‌పై భారీ దాడులు ఉంటాయని మే నెల ప్రారంభంలోనూ పుతిన్ ప్రభుత్వం హెచ్చరించింది. ఇలాంటి బెదిరింపులకు తాము తలొగ్గబోమని ఉక్రెయిన్ ఆ ప్రకటనలను ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతోంది.

# శాంతి చర్చల వేళ.. ఇరాన్‌పై అమెరికా భీకరదాడి

ఇరాన్–అమెరికా దూతలు చర్చలు జరపనున్నారు. కొన్నాళ్లక్రితం ఇరాన్ తమ క్షిపణి ప్రయోగకేంద్రాలు, అండర్‌గ్రౌండ్ ఫెసి లిటీలను పునరుద్ధరించిందని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు తమ నాయకులకు వెల్లడించాయి. మొత్తం 33 మిసైల్ సైట్లలో 30 వరకు తిరిగి పనిచేయడం మొదలుపెట్టినట్లు గుర్తించాయి. దీంతోపాటు దేశవ్యాప్తంగా 70శాతం మొబైల్ మిసైల్ లాంచర్లను మోహరించినట్లు గుర్తించాయి.అమెరికాతో పరోక్ష చర్చల్లో భాగంగా పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని ఇరాన్ బృందం సోమవారం ఖతార్‌కు వెళ్లింది. అక్కడ కీలక సంప్రదింపులు జరిపింది. ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విలేకర్లతో మాట్లాడుతూ.. అమెరికాతో అత్యధిక అంశాలపై అవగాహన కుదిరిందన్నారు. అయితే చేయాల్సిన పని ఇంకొంత మిగిలేఉందని పేర్కొన్నారు. చర్చల్లో యుద్ధాన్ని పూర్తిగా (లెబనాన్‌లోనూ) ముగించడం పైనే తాము దృష్టిపెట్టినట్లు చెప్పారు. అణ్వస్త్రాల గురించి ప్రస్తుతం మాట్లాడటం లేదన్నారు. యుద్ధం ముగిం పుపై అవగాహన ఒప్పందం కుదిరితే.. ఆపై 60 రోజుల వ్యవధిలో అణు సంబంధిత అంశాలపై చర్చలు జరుపుతామని చెప్పారు.

**మాకు ఇవ్వండి.. లేదంటే నాశనం చేయండి**

**ఇరాన్ యురేనియంపై ట్రంప్ పోస్ట్**

అమెరికా–ఇరాన్ మధ్య శాంతిఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చల్లో కీలకాంశం యురేనియం. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. "శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలి" అని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడటం లేదని ప్రపంచానికి భరోసా ఇచ్చేందుకు సిద్ధమంటూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

## అమెరికాకు ఇక ఏ ప్రదేశమూ సురక్షితం కాదు

ప్రదేశం ఉండదని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను నాశనం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

తన తండ్రి, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా ఖమేనీ మరణం తర్వాత కూడా తాము ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దేశం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌పై తాము ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదని.. ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామని అమెరికా అధికారులు పేర్కొన్నారు. సముద్రంలో మందుపాతరలు పరిచేందుకు యత్నిస్తున్న బోట్లను, ఇరాన్ క్షిపణి ప్రయోగ లాంచ్‌ప్యాడ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని తెలిపారు. తమ దాడిలో బందర్ అబ్బాస్ పోర్టులోని నేవీ బేస్ కూడా ధ్వంసమైనట్లు వెల్లడించారు.

# తెలంగాణలో ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ఉదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

# వాహనదారులపై సీఎన్‌జీ పిడుగు

మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదారులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

# అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి

- అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే
- సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఎఫ్ఏసీ జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ ప్రక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్ట్‌మెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ ప్రక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహిం చేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రకటించారు.

# భారత్ - అమెరికా మధ్య.. మరో కీలక ఒప్పందం

వ్యవహారాల మంత్రి మార్కో రూబియో తెలిపారు. బలవంతపు మార్కెట్ పద్ధతుల నుంచి సున్నితమైన క్రిటికల్ మినరల్స్ సరఫరా గొలుసులను రక్షించడం, గుత్తాధిపత్యాలను తగ్గించడానికి ఈ ఫ్రేమ్ వర్క్ కింద అమెరికా, భారత్ కలిసి పనిచేయనున్నాయి. అధునాతన తయారీ, ఇంధన వ్యవస్థలు, సాంకేతికత అభివృద్ధి తదితర రంగాల్లో అరుదైన ఖనిజాలు, క్రిటికల్ అధునాతన తయారీ, ఇంధన వ్యవస్థలు, సాంకేతికత అభివృద్ధి తదితర రంగాల్లో అరుదైన ఖనిజాలు, క్రిటికల్ మినరల్స్ వినియోగం అత్యంత కీలకం. జైశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల కూటమి) సదస్సులో రూబియోతో పాటు ఆస్ట్రేలియా, జపాన్ విదేశాంగ మంత్రులు పెన్నీ వాంగ్, తోషిమిత్సు పాల్గొన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్ మీదుగా సరకు రవాణా, ఇండో–పసిఫిక్ తదితర అంశాలపై వీరంతా చర్చలు జరిపారు. ఉగ్రవాదాన్ని ఎప్పటికీ సహించవద్దని, ఉగ్రదాడులకు వ్యతిరేకంగా పోరాడే హక్కు అన్ని దేశాలకు ఉందని ఈ కూటమి పునరుద్ఘాటించింది.

# చొరబాట్లపై ఉన్నతస్థాయి కమిటీ

సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు ఒక పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు.కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై సమగ్ర మూల్యాంకనం నిర్వహించడం.. మత, సామాజిక వర్గాల స్థాయిల్లో జనాభా మార్పుల సరళిని విశ్లేషించడం ఈ కమిటీ పని అని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఇదీ చదవండి: వెళ్లగొట్టకముందే పారిపోండి: అక్రమ వలసదారులకు సువేందు హెచ్చరిక

# ప్రొ॥ నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు మా బలగాలు తెలంగాణకు వెళ్లలేదు

వేదికగా పోస్టు పెట్టింది. ఇదంతా అసత్యప్రచారమని స్పష్టం చేసింది. అలాంటిదేమీ లేదని, కొందరు పనిగట్టుకొని ఈ ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టుగా పేర్కొంది. ఈ ఫ్యాక్ట్‌చెక్ పోస్టును తెలుగుదేశం పార్టీ సైతం రీపోస్టు చేసింది.

# మావోయిస్టు కీలకసభ్యుడు నరహరి లొంగుబాటు

నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. తెలంగాణకు చెందిన ముగ్గురు నేతలు.. గణపతి, జాడే సుజాత, వార్త శేఖర్ మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయమందిస్తోంది" అని డీజీపీ తెలిపారు.

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా–శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు మరో జీసీసీ

డిజిటల్ సేవలను అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పనిచేస్తుండగా, మరిన్ని అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. జిసిసి ల కేంద్రంగా ముంబయి, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో ఉన్న బలమైన ఎకోసిస్టం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోందన్నారు.తెలంగాణ ప్రభుత్వం పరిశోధన, తయారీ రంగం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. జీనోమ్ వ్యాలీ విస్తరణ, త్వరలో ఏర్పాటు కానున్న గ్రీన్ ఫార్మా సిటీ వంటివి రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు.రెజెనరాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ద్వారా రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థల్లో ఒకటైన రెజెనెరాన్ ఇప్పటికే అనేక ఔషధాలను అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. రెజెనెరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారి కోవాల్, రెజెనెరాన్ జీసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఓనాట్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అమెరికాలో కాల్పుల కలకలం

**ఘటనలో భారతీయ మహిళ మృతి**

వాషింగ్టన్,మే26(ఆర్ఎన్ఎ): అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వర్జీనియా రాష్ట్రంలోని ఒక సూపర్ మార్కెట్‌లో మే 23 శనివారం గుజరాత్‌కు చెందిన భారతీయ మహిళ దారుణ హత్యకు హత్యకు గురయ్యారు. మృతురాలు బిజాపూర్ ప్రాంతంలో మెహసానా జిల్లా జంత్రాల్ గ్రామానికి చెందిన మేఘనా పటేల్‌గా గుర్తించారు. మేఘ్నా పటేల్ దుకాణం లోపల ఉండగా.. ఆ సమయంలోనే ఓ దుండగుడు కస్టమర్ తరహాలో లోపలికి వచ్చి సెకన్ల వ్యవధిలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. దుండగుడు ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి.

# రూ.వంద ఇచ్చి మహిళలను కోటీశ్వరులు చేశామంటున్నారు

- ఆడబిడ్డల ఇళ్లను కూల్చుతూ వారికి మనశాంతి లేకుండా చేస్తున్నారు: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ప్రభుత్వమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత బాధితులు, ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ బాధితులతో కలిసి మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సమావేశం అయ్యారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆలైన్ మెంట్ మార్పులు, రాయగిరిలో ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ, కడ్లాపూర్ లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో పేదల భూములను లాక్కునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్ కు వివరించారు. అనంతరం లోక్ భవన్ బయట మీడియాతో మాట్లాడారు. రేవంత్ సర్కార్ పేదలకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని గవర్నర్ ను కోరామని చెప్పామన్నారు. తాము చెప్పిన అంశాలను గవర్నర్ ఒపోకతో విన్నారని, కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి కర్కోటక సీఎంరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల పట్ల అత్యంత కర్కోటకంగా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని



కవిత మండిపడ్డారు. కేవలం వంద రూపాయల చీర ఇచ్చి ఆడవాళ్లను కోటీశ్వరులు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నాడని విమర్శించారు. వెలుగుమట్లలో ఆడబిడ్డ నవ్య ఇల్లు కూలగొట్టి వారికి మనశ్శాంతి లేకుండా చేశారన్నారు. వెలుగుమట్ల లో ఇళ్లు కూల్చుతుంటే ఓ మహిళకు గర్భస్రావం అయ్యిందని..వాళ్ల భర్త రోదన ఇప్పటికీ మాకు వినబడుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో ఏ రైతు కూడా సంతోషంగా లేదని చెప్పారు. కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయటం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావటం లేదని విమర్శించారు. ఈ ముఖ్యమంత్రి విమానంలో ఢిల్లీకి వెళ్తూ ఫ్లైట్ నుంచి చూస్తే కల్లాల్లో ధాన్యం కనిపిచంటం లే?దేమో అన్నారు. వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. గవర్నర్ న్యాయం చేస్తారన్న నమ్మకం ఉంది ఖమ్మంలోని వెలుగుమట్ల, పరిగిలోని ఇండస్ట్రియల్ పార్క్ కోసం ల్యాండ్ కోల్పోతున్న బాధితులు, ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల కోసం తాము పోరాడుతున్న విషయం తెలిసిందేనని కవిత గుర్తు చేశారు. వారికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతో బాధితులను తీసుకెళ్లి గవర్నర్ ను కలిశామన్నారు. ధర్మసమాజ్ పార్టీ, టీఆర్ఎస్ కలిసి చేసిన పోరాటంతో ఈ అంశాల్లో పాక్షికంగా విజయం సాధించామన్నారు. వెలుగుమట్ల లో భూ బాధితులకు అక్కడే ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వటంతో పాటు పరిగి, ట్రిపుల్ ఆర్ సేకరణను తాత్కాలికంగా ఆపేశారని గుర్తు చేశారు. ఐతే పూర్తి స్థాయిలో నిర్వాసితులకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగానే గవర్నర్ ను కలిసి ఆయనకు అన్ని వివరాలు అందజేశామన్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ ను నాలుగు సార్లు మార్చిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆశ్చర్యపోయారన్నారు. దీనికి సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాసిన లేఖను కూడా గవర్నర్ కు అందజేశామన్నారు. తాము చెప్పిన అంశాలను కూలంకషంగా విన్నారని కవిత చెప్పారు. ఆయా అంశాలకు సంబంధించి రిపోర్ట్ తెప్పించుకోని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గవర్నర్ కచ్చితంగా న్యాయం చేస్తారన్న నమ్మకంతో ప్రజాస్వామ్య పద్దతిలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి కొన్ని రోజులు సమయం ఇచ్చి ఆ తర్వాత సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ పోరాట బాట పడతామని తేల్చి చెప్పారు.లక్ష ఎకరాలు కొల్లగొట్టే కుట్రము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో లక్ష ఎకరాల భూమి కొల్లగొట్టేందుకు పథకం పన్నాడని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆరోపించారు.

# ఏసీబీకి చిక్కిన మహిళా తహసిల్దార్

**రూ. 2లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

మేడ్చల్(జనంసాక్షి):రాష్ట్రంలో మరో అవినీతి అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం ఇద్దరు, మంగళవారం మరో ఇద్దరు అధికారులకు చిక్కడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలానికి చెందిన తహసీల్దార్ టి.సుచరిత రెండు లక్షల రూపాయలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ కేసులో ఆమె డ్రైవర్ వి నాగేష్‌ను కూడా అరెస్టు చేశారు. 30 ఎకరాల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తును ఆమోదించాలని తహసీల్దార్‌ను కోరగా అందుకు రూ.30లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో తహసీల్దార్ ప్రైవేట్ డ్రైవర్ నాగేష్‌కు రూ.2లక్షలు అందజేశాడు. డ్రైవర్ ఆ డబ్బును తహసీల్దార్ సుచరితకు ఇస్తుండగానే మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం డబ్బును పట్టుకున్నారు. ఆమెతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.





## కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు మారాలి

- వృత్తి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ అవసరం
- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- యూనియన్‌పై సభ్యులకు నమ్మకం కలిగించాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ



**హనుమకొండ ప్రతినిధి మే 26 (జనంసాక్షి) :** మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో హనుమకొండ జిల్లా నూతన టీయూడబ్ల్యూజే కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే (ఐజే యు) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్‌లు మీడియా అకాడమీ చైర్మన్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లా కమిటీ ప్రతిపాదన మేరకు జిల్లాలో ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో జర్నలిస్టులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో ఆసక్తి గల జర్నలిస్టులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా యూనియన్ కృషి చేయాలని సూచించారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నాయకులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. యూనియన్‌పై ప్రతి సభ్యుడికి నమ్మకం కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రమశిక్షణతో పని చేస్తూ సంఘం పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తుందని, సమస్యలు ఉంటే రాష్ట్ర నాయకత్వానికి నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బోల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, రాష్ట్ర నాయకులు గాడిపెల్లి మధు, కంకణాల సంతోష్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో మహిళా ఆత్మహత్యాయత్నం



**బెల్లంపల్లి, మే 26, (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణం తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్లో మంగళవారం మహిళా ఆత్మహత్యయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ట్రాక్టర్ దొంగతనం విషయంలో కేసు నమోదు చేయకుండా జాప్యం చేయడంతో తీవ్ర అసహనానికి గురై చిన్న బుదే గ్రామానికి చెందిన గుంపుల భాగ్య తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన పోలీసులు వెంటనే భాగ్యను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కొద్ది రోజుల క్రితం గుంపుల లక్ష్మణ్ భాగ్య దంపతులకు చెందిన ట్రాక్టర్ చోరీకి గురైంది. బాధితులు లక్ష్మణ్ భాగ్య ట్రాక్టర్ దొంగతనం జరిగిందని కేసు నమోదు చేయాలని పిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకుండా తాము బియ్యాల పోశంకి డబ్బులు బాకీ ఉన్నామని కాగితం రాయించుకొని ట్రాక్టర్ తీసుకెళ్లాలని చెప్పడంతో తీవ్ర మనస్తాపం చెందిన భాగ్య పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగుల సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కాగా ఈవిషయమై తాళ్ల గురిజాల ఎస్సై రామకృష్ణ వివరణ కోరగా గుంపుల భాగ్య ట్రాక్టర్ చోరీ విషయమై పిర్యాదుపై విచారణ చేపట్టాగా, బియ్యాల పోశం ట్రాక్టర్ తీసుకెళ్లినట్టు తెలిసింది. బియ్యాల పోశంను ట్రాక్టర్ తెచ్చి అప్పగించాలని చెప్పడంతో స్టేషన్ కు ట్రాక్టర్ తెచ్చి పెట్టాడని వివరించారు. గుంపుల లక్ష్మణ్ దంపతులు డబ్బులు బాకీ పడటంతో ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదని, ఇవ్వం ఏం చేసుకుంటావో చేసుకో అంటే బియ్యాల పోశం వాళ్ళ సమక్షంలోనే ట్రాక్టర్ తీసుకొని వెళ్లాడని పోశం తెలిపాడని అన్నారు. డబ్బుల విషయమై తీసుకెళ్లిన ట్రాక్టర్ పోలీస్ స్టేషన్ తీసుకురావడంతో ఇరు వర్గాలు కూర్చొని పరిష్కరించుకోవాలని సూచించానని తెలిపారు. కావాలనే భాగ్య పురుగుల మందు డబ్బాతో పోలీస్ స్టేషన్ వచ్చి మందు సేవించి సమస్యను పక్కదారి పట్టించడానికి హంగామా సృష్టించిందన్నారు. తాము ఎవరిని ఎలాంటి బలవంతం చేయలేదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని మాత్రమే సూచించినట్లు ఎస్సై వివరణ ఇచ్చారు.

## జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను విధుల్లోకి తీసుకోవాలి

**బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా శాఖ నాయకులు నాగరాజు గుర్రాల**




**హైదరాబాద్(జనంసాక్షి) :** జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా శాఖ నాయకులు నాగరాజు గుర్రాల డిమాండ్ చేశారు. 'నేను కూడా అదే డిపోలో పనిచేసి రిటైర్ అయిన ఆర్టీసీ డ్రైవర్ కుమారుడిని. ఒక డ్రైవర్ ఉద్యోగం ఎంత విలువైనదో, ఆ ఉద్యోగం మీద ఒక కుటుంబం ఎలా ఆధారపడి ఉంటుందో నాకు బాగా తెలుసు. ఒక ఆర్టీసీ ఉద్యోగి జీతం వెనుక పిల్లల చదువులు ఉంటాయి... ఇంటి అద్దె ఉంటుంది... వృద్ధ తల్లిదండ్రుల మందులు ఉంటాయి... కుటుంబం మొత్తం భవిష్యత్తు ఉంటుంది. అలాంటి ఉద్యోగాన్ని ఒక ప్రశ్న అడిగాడనే కారణంతో తీసేయడం చాలా కఠినమైన చర్య. అశోక్ గారు ఎవరినీ అవమానించలేదు, ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయలేదు. రైతుల వడ్లు కొనాలని మాత్రమే కోరారు. రైతు సమస్య గురించి మాట్లాడటం తప్పు కాదు... అది సమాజం పట్ల బాధ్యత. ఒక ఉద్యోగిని విధుల నుంచి తొలగించడం అనేది కేవలం ఒక వ్యక్తిపై చర్య కాదు... ఆ కుటుంబం మొత్తాన్ని మానసికంగా, ఆర్థికంగా దెబ్బతీయడం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉండాలి. ప్రజల సమస్యలను చెప్పినందుకు ఉద్యోగాలు పోయే పరిస్థితి రావడం మంచిది కాదు. అశోక్ గారికి ఇచ్చిన రిమూవల్ లెటర్‌ను వెంటనే వెనక్కి తీసుకుని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

## స్కూళ్లు, ఆలయాలకు దూరంగా మద్యం షాపులు

- సబ్సిడీ క్యాంటిన్లలో 5లకే చేప భోజనం
- సిఎం సువేందు ఆదేశాలు

**కోల్‌కతా, మే26 (జనంసాక్షి) :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మంగళవారంనాడు పలు సంక్షేమ, నియంత్రణ చర్యలను ప్రకటించారు. విద్యాసంస్థలు, ఆలయాలకు ఒక కిలోమీటర్ దూరంలోపు మద్యం దుకాణాలపై నిషేధం విధించారు. మహిళలకు ప్రతినెలా ఆర్థిక సాయం, రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీపై చేపలతో కూడిన భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సువేందు అధికారి వివరిస్తూ, స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలకు కిలోమీ టరు దూరంలోపు మద్యం దుకాణాలను అనుమతించమని చెప్పారు. అన్నపూర్ణ యోజన కింద అర్హులైన మహిళలకు రూ.3,000 ఆర్థికసాయం అందించను న్నామని, మే 27 నుంచి అప్లికేషన్లను సెక్రటేరియట్ నుంచి జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీతో క్యాంటిన్లు ఏర్పాటు చేయనున్నామని, రూ.5కే చేపలతో కూడిన భోజనం అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 400 క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య శాఖ నుంచి వేరుచేస్తూ ప్రత్యేక ఆయుష్ శాఖను పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కాగా, నదియా, నార్త్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో అభివృద్ధి పనుల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి మంగళవారంనాడు అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు.

# ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

- అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మే 26 (జనంసాక్షి) :** ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ఃదేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

## సుపారీ హత్యకేసులో నిందితుల అరెస్ట్

- అప్పు ఇచ్చి హత్యకు ప్లాన్
- హత్యకు కారణం అక్రమ సంబంధమే?
- ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఆక్సిడెంట్ డ్రామా.



**మంచిర్యాల ప్రతినిధి, మే 26 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో గత మూడు రోజుల క్రితం జరిగిన అనుమానస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందడంతో మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మూడు రోజులలో కేసును చేదించారని మంచిర్యాల డిసిపి భాస్కర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన సాయిని కుమార్ అనే వ్యక్తి ఈనెల 23న అనుమానాస్పద స్థితిలో ముల్కాల సమీపంలోని రోడ్డు ప్రక్కన మృతి చెందడం జరిగిందని ఆయన తెలిపారు . మృతుడి తల్లి సాయిని లక్ష్మి తన కొడుకు మరణించడం వెనుక అనుమానాలు ఉన్నాయని గతంలో రాం మల్లేష్ అనే వ్యక్తి 60 వేల రూపాయల అప్పు ఇచ్చి చంపుతానని బెదిరించాడని ఈ నేపథ్యంలో తన కొడుకును అతడే హత్య చేసి ఉంటాడని మృతుడి తల్లి అనుమానం వ్యక్తం చేసింది . ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి కేసును చేదించారు. మల్లేష్ 60 వేల అప్పిచ్చి ఇచ్చిన డబ్బులు కోసం మల్లేష్ పై ఒత్తిడి చేయడంతో కాకుండా అతని భార్యతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో మృతుడు తన భార్య భారతిపై వేధింపులు మొదలుపెట్టాడు. అక్రమ సంబంధం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించిన ప్పటికీ ఆమె ప్రవర్తన మారకపోవడం రా మల్లేష్ తో కలిసి భర్తను ఎలాగైనా చంపాలని ప్రణాళిక వేసుకొని రాం మల్లేష్ ముత్తిడి భార్య మరో ఇద్దరి ఇద్దరికీ సుభారి ఇచ్చి పది లక్షల రూపాయల సుపారీ ఇచ్చి చంపాలని రెండు లక్షల అడ్వాన్స్ ఇచ్చారు . శ్రీరామ్ కుమార్ ,అలాగే లగిశెట్టి సురేందర్ ఇద్దరికి సుపారి ఇవ్వడంతో మృతుడు సాయిని కుమార్ అతిగా మద్యం తాగించి సుత్తితో కొట్టి చంపి ముల్కాల రోడ్డు పక్కన పడేసి మోటార్ సైకిల్ రోడ్డు పక్కన పడేసి ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేశారు . మృతుడు సాయిని కుమార్ హత్య చేయడానికి ముందే రాం మల్లేష్ ,మృతుడి భార్య సాయిని భారతి ఒక ప్రణాళిక ప్రకారం సాయిని కుమారుపై ఇన్సూరెన్సులు పెద్ద మొత్తంలో చేయించారు. మృతుడి పేరున సుమారు 60 లక్షల మేర ఇన్సూరెన్స్ చేయించడం ముందస్తు ప్రణాళికలో జరిగినట్లు స్పష్టంగా తెలుస్తుంది ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు వేగవంతమగా దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానం తో, ఖచ్చితమైన నిఘా తో అతి తక్కువ రోజుల్లోనే హత్య కేసుని చేదించిన పరిశోధనాదికారి రవీందర్, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంచిర్యాల–రూరల్ సర్కిల్, దర్యాప్తులో సహకరించిన కిరణ్ కుమార్ ఎస్ఐ, హాజీపూర్ మరియు సిబ్బంది సదానందం హెడ్ కానిస్టేబుల్, చంద్ర శేఖర్ ౹ాజహాజీపూర్, గంగాధర్ జహాజీపూర్ లను మంచిర్యాల డిసిపి అభినందించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 26 (జనంసాక్షి):** ఈ నెల 26వ తేదీన కొమరం భీమ్ ఆసిఫాబాద్ మండలం కొలం కొరారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు కొమరం భీమ్ మండలం కోలం కొరారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ (ఆర్‌డిఓ) లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. ?అదేవిధంగా, సభకు విచ్చేసే ప్రజలకు,లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ ) భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం ప్రజావాణిలో 634 దరఖాస్తులు

**హైదరాబాద్(జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 225వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 634 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 296, రెవెన్యూ శాఖకు సంబంధించి 48, ఇందిరమ్మ ఇండ్ల కోసం 181, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 107 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాడిచర్ల ఓసీపీ డేంజర్ జోన్ ఇండ్లకు 261 కోట్లు



**మల్హర్, మే 25 (జనంసాక్షి) :** తాడిచర్ల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఓసీపీ) డేంజర్ జోన్ పరిధిలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో బాధిత కుటుంబాల పునరావాసం, పరిహారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించిన ?261 కోట్ల నిధులు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ కావడం పట్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ తాండ్ర మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాండ్ర మల్లేష్ మాట్లాడుతూ, డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో మంత్రి శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల భద్రత, జీవన ప్రమాణాల మెరుగుదల మరియు పునరావాస అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేయడం అభినందనీయమన్నారు.

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే..

- అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి
- సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు



**హైదరాబాద్, మే26 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారితో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ పక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 మే 2026

# మాట్లాడే హక్కుకే సవాల్

ప్రజాస్వామ్యం బతికి ఉందా లేదా అని పరీక్షించాలంటే ఒక్క పని చేస్తేచాలు, ఒక పౌరుడు నిర్భయంగా మాట్లాడగలుగుతున్నాడా అని చూడాలి. ఆ కొలమానంతో నేటి తెలుగు రాజకీయ వాతావరణాన్ని అంచనా వేస్తే సమాధానం ఆందోళన కలిగిస్తుంది.

*దశాబ్దాలుగా తెలుగు సమాజానికి రాజకీయ విశ్లేషకుడిగా, అకడమిక్ వ్యాఖ్యాతగా సుపరిచితుడైన ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్ పోలీసులు కేసులు నమోదుచేసిన తీరుచూస్తే మాట్లాడడమే నేరమైపోయిందా అనే సందేహం కలుగుతుంది. తన మాటల్లో ఏదైనా తప్పు దొర్లిందని ఆయన స్వయంగా గుర్తించి, ప్రకటనను వెనక్కు తీసుకున్నారు. ఒక పరిణతి చెందిన మేధావికి ఇంతకంటే నిజాయితీ ఏం కావాలి? అయినా కేసులు వెనక్కు తీసుకోలేదు. ఇది చట్టపాలన కాదు ఇది భయపెట్టే పాలన.*

సంపాదకీయం

నాగేశ్వర్ కేవలం ఒక ఆచార్యుడు మాత్రమే కాదు. దశాబ్దాలుగా సామాన్య ప్రజల రాజకీయ అవగాహనకు వారధిగా నిలిచిన వ్యక్తి. సంక్లిష్టమైన విధానపర అంశాలను సాధారణ భాషలో చెప్పగలిగే అరుదైన ప్రతిభ ఆయనది. ధ్రువపడని విషయాల జోలికి వెళ్ళకుండా, వాస్తవాధారంగా మాట్లాడే అభ్యాసం ఆయనది. అలాంటి వ్యక్తి నోరు మూయించబడితే అది ఒక్క వ్యక్తికి జరిగిన అన్యాయం మాత్రమే కాదు, ఆ గొంతు నమ్మిన లక్షలాది మంది సామాన్య ప్రజలకు జరిగిన అన్యాయం. విమర్శలను, అభిప్రాయాలను, వ్యాఖ్యానాలను సహించలేని పాలన చివరికి దేశాన్ని ఎక్కడికి తీసుకెళ్తుందో చరిత్ర సాక్ష్యం చెప్తుంది. నిరంకుశత్వం ఎప్పుడూ చట్టం పేరుతోనే మొదలవుతుంది.

మానవులు మాట్లాడతారు, రాస్తారు, కొన్నిసార్లు పొరపాటు పడతారు. అదే విమర్శకు తావిస్తే సవరించుకుంటారు. ఇది నాగరిక సమాజపు సహజ లక్షణం. నాగేశ్వర్ చేసింది అదే మాట్లాడారు. తప్పు దొర్లిందని గుర్తించారు, వెనక్కు తీసుకున్నారు. ఇది పరిపక్వత. ఇది గౌరవింపదగిన వైఖరి. కానీ ఆ సవరణను సైతం పాలకులు అంగీకరించకపోవడం ప్రకటన తప్పు అని కాదు, మాట్లాడిన వ్యక్తి ఎవరో చూసి కేసు పెట్టారని స్పష్టమవుతుంది. ఇది న్యాయం కాదు, ఇది వ్యక్తిగత ప్రతీకారం.

ఈ కేసు తెలంగాణ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎందుకంటే ఇక్కడ రాష్ట్ర విభజన పోరాటం నేర్పిన గుణపాఠం ఒకటుంది. మాట్లాడే హక్కు కోసం పోరాడకపోతే ఆ హక్కు మిగలదు. రేపు తమకూ ఇదే పరిస్థితి వస్తుందేమోనని ప్రశ్నిస్తున్నారు. ఆ భయం అకారణమైనది కాదు. ఇతర రాష్ట్ర పోలీసులు తెలంగాణకు చెందిన ఒక మేధావిపై కేసులు నమోదు చేయడం, రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికే సవాల్. ఈ దేశంలో ఒక పౌరుడు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకుండానే అక్కడి పోలీసుల వేధింపులకు గురికావడం చట్టాన్ని ఆయుధంగా వాడటం

ప్రజాస్వామ్యం మాట్లాడే హక్కుతో జీవిస్తుంది, మాటలపై భయంతో చస్తుంది. నాగేశ్వర్‌పై నమోదైన కేసులు వెంటనే రద్దు కావాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ పగసాధింపు కంటే పరిపక్వతను చూపించాలి. వ్యక్తిని వేధించడం ద్వారా అభిప్రాయాన్ని వెనక్కు తిప్పలేరు. అది చరిత్ర నిరూపించిన సత్యం. జనం గొంతుకలు బతికుంటేనే ప్రజాస్వామ్యం బతుకుతుంది.

# విచారణే 'శిక్ష'గా మారితే..!?



మీరు ఏ నేరమూ చేయలేదు. కానీ, పోలీసులు వచ్చి మిమ్మల్ని ఏదో ఒక కఠినమైన చట్టం కింద అరెస్ట్ చేశారు. "నేను తప్పు చేయలేదు బాబూ, సాక్ష్యాలు చూపించండి" అని మీరు అడిగితే... "సాక్ష్యాలతో మాకు పనిలేదు, నువ్వు తప్పు చేయలేదని నువ్వే నిరూపించుకో.. అప్పటివరకు జైల్లోనే ఉండు" అని చెబితే ఎలా ఉంటుంది..? ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది కదూ..! ఈ భయానకమైన నిస్సహాయత కేవలం ఊహ కాదు, చట్టాల నీడన సగటు మనిషి ఎదుర్కొంటున్న చేదు నిజం. ఒక కఠినమైన 'ఉపా' కేసులో వంద రోజుల జైలు జీవితం, కోర్టు వాయిదాలు, సుదీర్ఘ విచారణ ఎలా ఉంటుందో తెలిసిన నా వ్యక్తిగత అనుభవంతోనే ఈ మాటలు రాస్తున్నాను. అందుకే, గత ఐదున్నరేళ్లుగా (2020 నుండి) ఒక్కటంటే ఒక్క రోజు కూడా బయటి ప్రపంచాన్ని చూడకుండా, నేరం నిరూపణ కాకుండానే తిహార్ జైలు చీకట్లలో మగ్గుతున్న ఉమర్ ఖాలిద్ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. ఇది కేవలం ఒక వ్యక్తికి బెయిల్ వస్తుందా లేదా అనే కథ కాదు, మన దేశంలో పౌర హక్కులు, రాజ్యాంగ ఆత్మ ఇంకా బతికే ఉన్నాయా లేదా అనేదానికి జరుగుతున్న ఒక పెద్ద పరీక్ష..!

సాధారణంగా మన దేశంలో ఎలాంటి చట్టం ఉందంటే... ఒక వ్యక్తిపై కోర్టులో నేరం నిరూపణ అయ్యేంతవరకు అతన్ని 'నేరారోపణ ఎదుర్కొంటున్న వక్తి'గా ఒక అమాయకవక్తిగా భావించాలి. కానీ 'ఉపా' లాంటి కఠినమైన చట్టాలు వచ్చిన తర్వాత ఈ సూత్రం తలకిందులైంది. ఇందులో బెయిల్ రావడం అనేది అగమ్యగోచరంగా మారిపోతుంది. వ్యవస్థ ఆడే చదరంగం ఎలా ఉంటుందంటే... ఒక కేసులో నెగ్గి బయటకు వస్తున్నారనగా... పోలీసులు ముందే సిద్ధం చేసుకున్న మరో చార్జ్‌షీట్‌ను బయటకు తీసి, మరో పీటీ వారెంట్' వేస్తారు. అంటే, ఒక ఊబి నుంచి కాలు బయటపెట్టేలోపే మరో ఊబిలోకి నెట్టేయడం అన్నమాట. ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ చెప్పుకుందాం. ఒక బడిలో క్లాస్ లీడర్ పెన్ పోయింది. మాస్టారు వచ్చి, క్లాస్‌లో అందరికంటే ఎక్కువగా మాట్లాడే, ప్రశ్నించే ఒక కుర్రాడిని పిలిచి, "నువ్వే దొంగతనం చేశావు, లీడర్ నీ గురించే చెప్పాడు" అని బెత్తం పట్టుకుని కూర్చోబెట్టారు. ఆ అబ్బాయి "నేను తీయలేదు సార్, నా బ్యాగ్ వెతకండి" అన్నా వినకుండా... "నువ్వు తీయలేదని క్లాస్ అంతా ఒప్పుకునేలా నిరూపించుకో, అంతవరకు క్లాస్ బయటే నిలబడు" అనడం ఎంత అన్యాయమో, 'ఉపా' నిర్బంధాలు కూడా అంతే అన్యాయం. ఉపా కేసుల పరిస్థితి సరిగ్గా ఈ ఉదాహరణలాగే ఉంటుంది.

ఉమర్ ఖాలిద్ అనుభవిస్తున్న ఈ నిరవధిక నిర్బంధం మన న్యాయ వ్యవస్థలో కొత్తేమీ కాదు. నేరం నిరూపణ కాకముందే జీవితాలను బుగ్గిపాలు చేసి, ఏళ్ల తర్వాత 'మీరు నిర్దోషులు' అని ప్రకటించే ఈ ఆలస్యపు న్యాయం చట్టం పేరిట జరుగుతున్న అన్యాయమే అవుతుంది. దీనికి దేశ చరిత్రలో 'ఉపా' చట్టం నీడన జరిగిన ఎన్నో సజీవ సాక్ష్యాలు ఉన్నాయి:

ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా లాంటి సాక్ష్యం అందరికీ తెలిసిందే. తొంభై శాతం శారీరక వైకల్యంతో వీల్ చైర్‌కే పరిమితమైనా, ఉపా చట్టం కింద దశాబ్ద కాలం పాటు జైలు నరకాన్ని అనుభవించి, చివరికి ఉన్నత న్యాయస్థానం ద్వారా 'నిర్దోషి'గా బయటపడ్డారు. కానీ ఆ సుదీర్ఘ నిర్బంధం ఆయన ఆరోగ్యాన్ని, జీవితాన్ని పూర్తిగా చిన్నాభిన్నం చేసింది. కడకు ఊపిరి ఆగిపోయిన ఉదాంతం ఉపా కేసుల క్రూరత్వానికి సాక్ష్యంగా నిలిసింది. ఇక ఫాదర్ స్టాన్ స్వామిని విషయంలోనూ 84 ఏళ్ల వయసులో, తీవ్రమైన పార్కిన్సన్స్ అనారోగ్యంతో బాధపడుతున్నా 'ఉపా' చట్టం కింద కఠినంగా బెయిల్ నిరాకరించారు. కనీసం విచారణ కూడా ఎదుర్కోకుండానే, జైలు నిర్బంధంలోనే ఆయన ప్రాణాలు విడిచారు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే ఉదాహరణలు. ఉపా కేసుల్లో జైళ్లలో మగ్గుతున్న వారు ఎందరో ఉన్నారు. అమాయకులు, అభాగ్యులు బయటి ప్రపంచానికి తెలియని జీవులూ ఉన్నారు. జైళ్లలోకి తొంగిచూస్తే, లేదా కోర్టుల్లో పెండింగ్ కేసులను పరిశీలిస్తే, ఇంకా సూటిగా చెప్పాలంటే అసలు కోర్టుకే కేసు వెళ్లకుండా పోలీస్ స్టేషన్లలోనే కేసు ఫైళ్లు ఉన్న స్థితిని చూస్తే ఉపా కేసుల అసలు విషయం బోధపడుతుంది. అయితే ఈ జాబితాలోకి ఇప్పుడు ఉమర్ ఖాలిద్ కూడా చేరిపోతున్నారా..? నేరం రుజువు కాకుండానే సుమారు ఐదున్నరేళ్ల యవ్వనాన్ని జైలు గోడల మధ్య బలితీసుకోవడం అంటే... కోర్టులు శిక్ష వేయకముందే, వ్యవస్థే అతనికి ఒక పెద్ద శిక్షను అమలు చేస్తోందని అర్థం కావడం లేదా..?

ఈ కేసుల్లో కోర్టులు సుదీర్ఘకాలం ఉదాసీనంగా వ్యవహరించినప్పటికీ, ఇటీవల సుప్రీంకోర్టు చేసిన ఆత్మవిమర్శ న్యాయవ్యవస్థలో సానుకూల మార్పును తెచ్చింది. "చట్టాలు ఎంత కఠినమైనా పౌరుడి స్వేచ్ఛను హరించకూడదని, విచారణ పేరిట నిరవధికంగా జైల్లో ఉంచడం రాజ్యాంగ విరుద్ధం" అని కోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థల ఆరోపణలను గుడ్డిగా నమ్మితే, విచారణే ఒక శిక్షగా మారుతుందని అంగీకరించింది.

ఈ క్రమంలోనే మే 22న ఉమర్ ఖాలిద్ బెయిల్ అంశాన్ని సుప్రీంకోర్టు 'విస్తృత ధర్మాసనానికి' బదిలీ చేయాలని ప్రతిపాదించడం ఒక కీలక మలుపు. దర్యాప్తు సంస్థల అభ్యంతరాల నడుమ, ఈ రాజ్యాంగ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం దీన్ని ప్రధాన న్యాయమూర్తి ముందుకు తీసుకెళ్లాలని సూచించింది. దీన్ని కేవలం లీగల్ ప్రాసెస్ లాగా కాకుండా, దేశ రక్షణతో పాటు పౌర స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమని గుర్తించే ప్రక్రియగా చూడాలి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం ఒక పౌరుడి హక్కు. ప్రశ్నించే ప్రతి గొంతును చట్టాల సాకుతో నొక్కేస్తూ పోతే, రేపు సమాజంలో అన్యాయం జరిగినప్పుడు మాట్లాడేవారే కరువవుతారు. న్యాయం ఆలస్యమైతే అది న్యాయాన్ని తిరస్కరించడమే కాదు, ఒక నిరపరాధి జీవితాన్ని నిలువునా పూడ్చిపెట్టడమే..! ఇవాళ జైల్లో ఉన్నది ఉమర్ ఖాలిద్ కావచ్చు, నిన్న మనకు తెలిసిన మరో వ్యక్తి కావచ్చు. కానీ వ్యవస్థ నడిచే తీరు మారకపోతే, రేపు ఏ పాపమూ ఎరుగని సామాన్య పౌరులెవరైనా ఆ ఇనుప చట్రాల వెనుక బందీలు కాక తప్పదు. ఉమర్ ఖాలిద్ కేసుకు వాయిదాల పర్వం వీడి, త్వరలోనే ఒక స్పష్టమైన ముగింపు రావాలి. ఆ ముగింపు కేవలం ఒక వ్యక్తికి ఇచ్చే బెయిల్ కాకూడదు. ఈ దేశంలో రాజ్యాంగం బతికే ఉంది, సామాన్యుడి ప్రాణానికి, స్వేచ్ఛకు విలువ ఉంది అని చాటిచెప్పే బలమైన చారిత్రాత్మక తీర్పు కావాలి. అప్పుడే న్యాయదేవత కళ్లకున్న గంతలు తొలగి, రాజ్యాంగ ఆత్మ నిజమైన ఊపిరి పీల్చుకుంటుంది..!



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# ఉద్యమానికి మహనీయుల దార్శనికత




### దార్శనికుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్

ఈ దశలన్నిటిలో ఉద్యమానికి దార్శనికతను అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్. ఆయన కేవలం ప్రాంతీయవాది కాదు, లోహియా దృక్పథంతో సామాజిక న్యాయాన్ని తెలంగాణ ఆకాంక్షకు జోడించిన వ్యక్తి. 1969 నుంచి ఉద్యమంలో ఉన్న జాదవ్, 1990లలో మళ్లీ మేధావులను ఏకం చేయడంలో ముందుండేవారు. 1990 నుంచి 2000 వరకు ఆయన చేయని సదస్సు లేదు, తిరగని పల్లె లేదు. తెలంగాణను మానవ హక్కుల సమస్యగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు.

### వరంగల్‌లో జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ

వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఆచార్య కె. జయశంకర్ వంటి వారు తిరిగి ఆలోచనలో పడ్డారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 1969 ఉద్యమంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాలు వదిలి బహుజన చైతన్యం కోసం సమీకరించారు. గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్ బృందం కాంగ్రెస్ శాసనసభ్యులను 1989లోనే కదలికలు తీసుకొని వచ్చారు. "దగా పడ్డ తెలంగాణ" పేరిట పుస్తకాలు తెచ్చారు. 610 జీవో అమలు కోసం ఆందోళనలు మొదలయ్యాయి.

### 1990లు - కీలక దశ

1992-93లో గెజిటెడ్ అధికారుల సంఘం నాయకత్వంలో ఉద్యోగాల్లో అన్యాయంపై నిరసనలు మొదలయ్యాయి. 1994లో 'తెలంగాణ ఫోరం' వంటి వేదికలు చర్చలు ప్రారంభించాయి. 1995 నాటికి ప్రపంచీకరణ పేరుతో తెలంగాణ పల్లెలు, వ్యవసాయం విస్మరించబడ్డాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం తెలంగాణ రైతాంగంలో తీవ్ర అశాంతికి దారి తీసింది.

### బహుజన కోణం - సామాజిక న్యాయం

తెలంగాణ పునరుజ్జీవనం అంటే కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు కాదు. అది కుల వివక్షకు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన మేధో యుద్ధం. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల శ్రమశక్తిని దోచుకొని ఆంధ్ర పెట్టుబడిదారీ వర్గం ఎలా బలపడిందో బి.ఎస్. రాములు వంటి మేధావులు ఈ కాలంలోనే గ్రంథస్థం చేశారు. తెలంగాణ తల్లి రూపకల్పన ద్వారా మనకంటూ ఒక విశిష్ట సాంస్కృతిక చిహ్నాన్ని అందించడం ఈ మేధో పునరుజ్జీవనంలో ఒక భాగమే.

### సమష్టి ప్రయత్నం

రాష్ట్రం ఒక వ్యక్తి వల్లనో, ఒక పార్టీ వల్లనో రాలేదు. 1989లో మొదలైన చిన్న చిన్న సమాచార సేకరణ, కేశవరావు జాదవ్ గారి నిరంతర మేధోమథనం, జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్ వంటి వారి కృషి, 36 సంస్థలు కలిసి జేఏసీగా ఏర్పడి చేసిన మేధోమథనం - ఇవన్నీ కలిసి కాలువలు, ఉపనదులు కలిసి నదీ ప్రవాహంగా మారాయి. ఈ వ్యాస పరంపర కొన్ని కొత్త విషయాలను, మరుగున పడిన సత్యాలను వెలికి తెస్తూ సాగుతుంది. తెలంగాణ ఉద్యమం ఒక వ్యక్తి కథ కాదు - ఇది ఒక జాతి స్వాభిమాన చరిత్ర.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# దేశంలో ప్రజలను విభజించి పాలించే రాజకీయాలు

**నేడు భారతదేశం ఎదుర్కొంటున్న అత్యంత భయంకరమైన సత్యాలు ఇవే. ఒకవైపు 45% యువత సరైన ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో అల్లాడిపోతుంటే, మరోవైపు గత దశాబ్దంలో 700 పైగా కుల ఘర్షణలు జరిగి సమాజం అశాంతితో రగిలిపోతోంది. డిజిటల్ విప్లవం పేరుతో చేతికొచ్చిన సోషల్ మీడియాలో 68% మంది వినియోగదారులు నిత్యం ద్వేషపూరిత కంటెంట్‌కు గురవుతూ మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. వీటన్నిటికంటే పెద్ద విషాదం ఏమిటంటే, దేశానికి అన్నం పెట్టే 3 లక్షల మందికి పైగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకున్నా, ఆ వార్తలు కనీసం ప్రధాన మీడియాలో చర్చకు రావడం లేదు. ఈ సంఖ్యలు కేవలం అంకెలు కావు - మన వ్యవస్థల వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యాలు.**



భారతదేశం ఒక మహా నదిలాంటిది. వందల ఉపనదులు కలిసి ఒక్కటిగా ప్రవహిస్తాయి. కానీ ఆ నదికి ఆనకట్ట వేసేవాళ్ళు ఎవరు? ఒడ్డున నిలబడి "మీ నీళ్ళు వేరు, మా నీళ్ళు వేరు" అని కేకలు వేసే వాళ్ళే రాజకీయ నాయకులు. కులం అనే గోడ కట్టి, మతం అనే అగ్ని రాజేసి, ప్రజలను విభజించడమే వీళ్ళ వ్యూహం. ప్రజలు విడిపోతే రాజకీయం గెలుస్తుంది. ఇది కొత్త సత్యం కాదు, కానీ దీన్ని ప్రజలు ఇంకా అర్థం చేసుకోలేదు లేదా అర్థం చేసుకున్నా పట్టించుకోవడం లేదు. అదే అసలు విషాదం. నేటి భారతదేశంలో ఒక వింత వాతావరణం నెలకొంది. ఇరుగుపొరుగు మనుషులు పాత స్నేహాన్ని మరచి, కులం-మతం పేరుతో ఒకరినొకరు అనుమానంగా చూసుకుంటున్నారు. వందల సంవత్సరాలుగా కలిసి జీవించిన గ్రామాలలో ఇప్పుడు ఏ చిన్న సంఘటన అయినా మతకలహంగా మారే ప్రమాదం ఉంది. ఒక వైరల్ వీడియో, ఒక తప్పుడు పోస్ట్ చాలు - అది సమాజాన్ని మంటల్లో ముంచెత్తడానికి. ఈ నిప్పులు అప్రమత్తంగా రాజేస్తున్నారు స్వార్థ రాజకీయ నాయకులు, వారి చేతి కింద పని చేసే సోషల్ మీడియా కూలీలు. యువత ఈ విషతుల్యమైన ఊపిరిలో ఎదుగుతోంది. బాల్యంలో కలిసి ఆడిన పిల్లలు, కౌమారదశలో కులం-మతం పేరుతో విడిపోతున్నారు. స్నేహం చేయాల్సిన వయసులో ద్వేషం నేర్చుకుంటున్నారు. విద్య నేర్పాల్సిన స్కూళ్ళలో, కళాశాలల్లో కూడా వర్గ విభజన మొదలైంది. ఒక అనుభవశాలి రాజకీయ నాయకుడు సభలో పది నిమిషాలు మాట్లాడితే చాలు, వేల మంది యువకుల మనసుల్లో వర్గ విద్వేషం విత్తు వేయవచ్చు.

సోషల్ మీడియా ఇందులో ఇంధనంలా పని చేస్తోంది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి రోజులు పట్టేవి. ఇప్పుడు సెకన్లలో ఒక పేలుడు వీడియో కోట్ల మంది మొబైళ్ళకు చేరుతోంది. నిజం అయినా కాకపోయినా, వాస్తవం అయినా అబద్ధమైనా - ముందు చూపిస్తారు, తర్వాత ప్రశ్నలు. ఆ మధ్యలో సమాజం ముక్కలవుతుంది. ఫేక్ న్యూస్ ఒక ఆయుధంగా మారింది. ఒక నిర్దిష్ట కులం వ్యతిరేకంగా, ఒక మతం వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారాలు సుడిగాలిలా వ్యాపిస్తున్నాయి. ఇందులో భాగం పంచుకుంటున్న వాళ్ళకి తాము ఏం చేస్తున్నారో కూడా అర్థం కావడం లేదు.

ఈ విధంగా పెచ్చుమీరుతున్న సామాజిక అశాంతిని అదుపు చేయడంలో వ్యవస్థలు విఫలమవుతున్నాయి. అసలు ప్రశ్న ఏమిటంటే ఈ కుల-మత చర్చలు ఇంతగా హిట్ అవుతున్నప్పుడు, నిజమైన సమస్యలు ఎక్కడికి వెళ్తున్నాయి? రైతు అప్పుల్లో మునిగిపోతున్నాడు. యువత ఉద్యోగం కోసం అర్జీ తర్వాత అర్జీ వేస్తూ తలపై చేయి పెట్టుకుంటున్నాడు. ఆస్పత్రి చేరుకోవడానికి గంటల ప్రయాణం చేయాల్సిన గ్రామాలు ఇంకా ఉన్నాయి. పాఠశాలల్లో బెంచీలు లేవు, మాస్టర్లు లేరు. ఈ సమస్యలన్నీ పక్కన పెట్టి, టీవీ స్క్రీన్‌పై గంటల తరబడి కుల-మత వివాదాలు చర్చించడంతో ఎవరికి లాభం? జవాబు చాలా స్పష్టంగా ఉంది రాజకీయ నాయకులకు. ప్రజలు తమ హక్కులు, అభివృద్ధి, జవాబుదారీతనం గురించి ప్రశ్నించకూడదు. అందుకే వాళ్ళని బిజీగా ఉంచాలి - మీ కులం అవమానమైంది, మీ మతం ప్రమాదంలో ఉంది అని రోజూ భయం పెట్టాలి. భయంలో ఉన్న మనిషి ఆలోచించలేడు. పోరాడే మనిషి అడగలేడు. నేటి పాలక వర్గాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల భావోద్వేగాలను ఒక ముడి సరుకుగా వాడుకుంటున్నాయి. ఫలితంగా సమాజంలో మానవీయ విలువలు పూర్తిగా నశించిపోతున్నాయి. నిజమైన శత్రువు కుల సమూహం కాదు, మత సమూహం కాదు - ఇవన్నీ పేర్లతో ఆడుకుంటూ అధికారంలో కూర్చున్న దోపిడీ వ్యవస్థ!

గత ఒక దశాబ్దంలో సోషల్ మీడియా ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది కానీ అది మంచి మార్పు మాత్రమే కాదు. సామాన్య మనిషి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి వేదిక దొరికింది, ఇది నిజమే. కానీ అదే వేదికలో ద్వేషం, విభేదం, తప్పుడు సమాచారం కూడా పదింతలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ట్రోల్ అకౌంట్లు, ఫేక్ ప్రొఫైళ్ళు ఇవి రాత్రికిరాత్రే లక్షల ఫాలోవర్లు సంపాదించుకుంటున్నాయి. ఒక ఫేక్ వీడియో ఆసియా మొత్తం తిరిగిన తర్వాత, ఇది తప్పు అని వచ్చే సవరణ ఎవరూ చూడడు. తప్పు ఒకటి వేల కిలో మీటర్లు ప్రయాణించిన తర్వాత, సత్యం ఇంకా బూట్లు వేసుకుంటూ ఉంటుంది అని ఒక మహా రచయిత చెప్పాడు. నేడు ఆ మాటకు కొత్త అర్థం వచ్చింది. డిజిటల్ యుగంలో విషపూరితమైన అబద్ధాలు క్షణాల్లో నిజాలుగా చలామణి అవుతున్నాయి.

యువత తమ విలువైన సమయాన్ని, సృజనాత్మకతను ఇటువంటి నిరుపయోగమైన వాదోపవాదాలకు అంకితం చేయడం దేశ భవిష్యత్తుకే తీరని నష్టం కలిగిస్తుంది.

భారతదేశంలో ప్రతి సంవత్సరం కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తున్నారు. అయితే అందుకు తగిన ఉద్యోగావకాశాలు లేవు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు నత్తగమనంతో సాగుతున్నాయి. ప్రైవేట్ రంగంలో నైపుణ్యం లేకపోతే అవకాశాలు రావడం లేదు. నైపుణ్యాన్ని అందించాల్సిన విద్యా వ్యవస్థ కుప్పకూలిపోయింది.


ఇది యాదృచ్ఛికం కాదు. ఇది పద్ధతి ప్రకారం జరుగుతున్నది. ప్రజల నొప్పిని పరిష్కరించని రాజకీయ నాయకులు, ప్రజలను నొప్పితో బిజీగా ఉంచే కొత్త నొప్పి సృష్టిస్తారు. కుల వివాదం, మత ఘర్షణ ఇవి ప్రజల ధ్యాస మళ్ళించే సాధనాలు. దశాబ్దాలుగా ఈ వ్యూహం విజయవంతంగా సాగుతోంది. సామాన్యుడు తన మౌలిక అవసరాల గురించి ఆలోచించకుండా చేయడమే ఈ కుటిల రాజకీయాల ముఖ్య ఉద్దేశ్యం. మార్పు కోసం ఒక మహా నాయకుడి కోసం ఎదురు చూడడం మానండి. ఆ నాయకుడు మీరే, ఆ సమయం ఇప్పుడే, ఆ స్థలం ఇక్కడే! ఈ మొత్తం సమస్యలో అత్యంత బాధాకరమైన అంశం ఏమిటంటే మనం మౌనంగా ఉంటున్నాం. ఒక వ్యక్తి పక్కింటివాడిని కులం పేరుతో అవమానిస్తే మనం చూస్తున్నాం. ఒక రాజకీయ నాయకుడు ద్వేష ప్రసంగం చేస్తే మనం ఆయన్ని ఏం చేయలేమ్ అని నిరాశగా ముఖం తిప్పుకుంటున్నాం. ఒక తప్పుడు వార్త వైరల్ అవుతుంటే మనం అప్రమత్తంగా వెరిఫై చేయకుండా ఫార్వర్డ్ చేస్తున్నాం. ఈ మౌనం, ఈ నిరాసక్తత ఇవే అసలు ద్రోహాలు. సమాజం నిప్పుల్లో కాలిపోతున్నప్పుడు ప్రక్కన నిలబడి చూడడం కూడా నేరమే అవుతుంది. మన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను చూస్తూ కూడా మౌనంగా ఉండటం అంటే, ఆ అన్యాయానికి మనం కూడా సహకరించినట్లే అవుతుందని గుర్తించాలి.

సామూహిక బాధ్యత అనే మాట తేలికగా వినిపిస్తుంది. కానీ దాని అర్థం తీవ్రంగా ఉంటుంది. ప్రతి పౌరుడికి తన సమాజం పట్ల బాధ్యత ఉంటుంది. ఓటు వేయడం మాత్రమే ఆ బాధ్యత కాదు. నిజం మాట్లాడడం, తప్పుడు సమాచారాన్ని సవాలు చేయడం, ఇరుగుపొరుగుతో మానవీయ సంబంధాలు నిలుపుకోవడం ఇవన్నీ కూడా పౌర బాధ్యతలే. ఒక్కో మనిషి తన వంతు బాధ్యత నిర్వర్తిస్తే, సమాజం మారుతుంది. రాజకీయ నాయకులు మారకపోయినా పర్వాలేదు -- ప్రజలు మారితే రాజకీయాలు మారతాయి. ఇది చరిత్ర మనకు నిరంతరం నేర్పించిన పరమ సత్యం.

ఈ వ్యాసం చదివిన మీరు ఒక్క అడుగు వేయండి. మీ పక్కింటివాడితో కులం-మతం పక్కన పెట్టి ఒక్కసారి మాట్లాడండి. మీ పిల్లలకు ఐక్యత విలువ చెప్పండి. ఒక తప్పుడు పోస్ట్ ఫార్వర్డ్ చేయబోయే ముందు ఒక్క నిమిషం ఆగి ఆలోచించండి. ఇవి చాలా చిన్న చిన్న అడుగులు కావచ్చు. కానీ ఈ చిన్న అడుగులే రేపటి రోజున ఒక పెద్ద సామాజిక విప్లవానికి, మార్పుకు దారి వేస్తాయి. సమాజ మార్పు ఎల్లప్పుడూ కింది స్థాయి నుండే, అంటే ఒక సామాన్య వ్యక్తి ఆలోచనా విధానం నుండే మొదలవుతుంది అంతేకానీ అగ్రపీఠాలపై కూర్చున్న అధికారం నుండి కాదు. కేవలం ప్రజల నుండి మాత్రమే సాధ్యమవుతుంది.నిర్ణయం ఎప్పుడైనా మీ చేతుల్లోనే ఉంది. కుల-మత విభేదాలతో విడిపోయి, ఆ చీకటిలో కూర్చుంటారా లేదా అందరం ఐక్యంగా నిలబడి, నిజమైన సమస్యలపై పాలకులను ప్రశ్నిస్తూ ఒక సరికొత్త వెలుగు దారి వెతుకుతారా? ఆలోచించండి. ఎందుకంటే ప్రజలు విడిపోతే స్వార్థ రాజకీయాలు గెలుస్తాయి. అదే ప్రజలు ఏకమైతే నిజమైన ప్రజాస్వామ్యం గెలుస్తుంది. ఇకనైనా మౌనాన్ని వీడి, మన ఉనికి కోసం, మన దేశ భవిష్యత్తు కోసం గళం విప్పుదాం. సమాజంలో శాంతిని, సామరస్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగడమే నేటి తరం ముందున్న ప్రధాన కర్తవ్యం. ఒకరికొకరు తోడుగా నిలుస్తూ, ద్వేషాన్ని ప్రేమతో జయించే రోజు కోసం మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలి.

డా .సూర్యదేవర రామకృష్ణ , 9490754169

# లోకజ్ఞానం -పుస్తక జ్ఞానం కంటే గొప్పదా?



మనిషి జీవితం కేవలం పాఠ్యపుస్తకాలతో నిర్మితమయ్యే ప్రయాణం కాదు. వివిధ సామాజిక అధ్యయనాల ప్రకారం జీవిత విజయాలలో సుమారు 65% వరకు లోకజ్ఞానం ప్రభావం చూపుతుందని, కేవలం 35% మాత్రమే పుస్తక జ్ఞానం ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందని అనేక మానసిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పుస్తకాలు మనిషికి అక్షరజ్ఞానం, సూత్రాలు, చరిత్ర, విజ్ఞానం నేర్పిస్తాయి. కానీ జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలి, మనుషులతో ఎలా మెలగాలి, కష్టకాలంలో ఎలా నిలబడాలి, సమాజంలోని వాస్తవాలను ఎలా గ్రహించాలి అన్న విషయాలను ఎక్కువగా నేర్పేది లోకజ్ఞానం. అందుకే "లోకజ్ఞానం పుస్తక జ్ఞానం కంటే గొప్పది" అనే మాట తరతరాలుగా వినిపిస్తూ వచ్చింది.

పలు అంతర్జాతీయ ఉద్యోగ సర్వేల ప్రకారం ఉద్యోగ జీవితంలో 70% విజయాన్ని కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అనుభవం, పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం నిర్ణయిస్తే, కేవలం 30% మాత్రమే సర్టిఫికెట్లు, మార్కులు ప్రభావితం చేస్తున్నాయని వెల్లడైంది. పుస్తకాలు చదివిన వ్యక్తి పరీక్షల్లో అగ్రస్థానం సాధించవచ్చు. కానీ జీవనపరీక్షల్లో నిలబడటానికి అనుభవం, పరిశీలన, సమాజంతో మమేకం కావడం, పరిస్థితులను అర్థం చేసుకునే సామర్థ్యం అవసరం. ఇదే లోకజ్ఞానం యొక్క అసలైన శక్తి. పుస్తక జ్ఞానం సాధారణంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల ద్వారా లభిస్తుంది. దీనికి ఒక విధానం ఉంటుంది. సిలబస్ ఉంటుంది. పరీక్షలు ఉంటాయి. మార్కులు ఉంటాయి. విద్యార్థి చదివినదాన్ని గుర్తుంచుకుని సమాధానాల రూపంలో రాస్తాడు. ఈ విధమైన జ్ఞానం మానవ మేధస్సును పదును పెడుతుంది. శాస్త్ర విజ్ఞానాన్ని అందిస్తుంది. ఉద్యోగ అవకాశాలకు దోహదపడుతుంది. భారతదేశంలో 2025 విద్యా గణాంకాల ప్రకారం సుమారు 82% మంది విద్యార్థులు పరీక్షల్లో అధిక మార్కులను జీవిత విజయానికి ప్రధాన ప్రమాణంగా భావిస్తున్నారని వెల్లడైంది. ఒక వైద్యుడు వైద్యం నేర్చుకోవడానికి పుస్తక జ్ఞానం అవసరం. ఒక ఇంజనీర్ నిర్మాణ సూత్రాలు తెలుసుకోవడానికి పుస్తకాలు అవసరం. ఒక న్యాయవాది చట్టాలను అధ్యయనం చేయడానికి గ్రంథాలు అవసరం. అందువల్ల పుస్తక జ్ఞానాన్ని తక్కువగా చూడలేం. అది నాగరికతకు పునాది.

అయితే పుస్తక జ్ఞానానికి కొన్ని పరిమితులు ఉంటాయి. పుస్తకాల్లో ఉన్నది ఎక్కువగా సిద్ధాంతం. కానీ జీవితం మాత్రం ప్రతిసారీ సిద్ధాంతాల ప్రకారం నడవదు. ఒక వ్యక్తి ఎన్నో డిగ్రీలు చదివినా జీవితంలో చిన్న సమస్య ఎదురైనప్పుడు అయోమయానికి గురవుతాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన మానసిక అధ్యయనాల ప్రకారం అధిక విద్యావంతులలో దాదాపు 48% మంది ఒత్తిడి పరిస్థితులను ఎదుర్కొనే విషయంలో బలహీనత చూపుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఎందుకంటే అతడు పుస్తకాల ద్వారా తెలుసుకున్న ప్రపంచం ఒకటి కాగా, వాస్తవ ప్రపంచం మరొకటి. సమాజంలో ప్రతి మనిషి ఒకే విధంగా ప్రవర్తించడు. ప్రతి పరిస్థితి పుస్తకాల్లో చెప్పినట్టు ఉండదు. ఇక్కడే లోకజ్ఞానం అవసరం అవుతుంది. లోకజ్ఞానం అనేది అనుభవంతో వచ్చే విజ్ఞానం. ఇది పాఠశాల గదుల్లో కాకుండా జీవితంలో నేర్చుకునేది. పెద్దలను గమనించడం, సమాజాన్ని పరిశీలించడం, కష్టాలను ఎదుర్కోవడం, మనుషుల స్వభావాలను అర్థం చేసుకోవడం ద్వారా ఈ జ్ఞానం పెరుగుతుంది. గ్రామీణ భారతదేశంలో సుమారు 72% మంది రైతులు ఆధునిక వాతావరణ సాంకేతికతల కంటే ప్రకృతి సంకేతాల ఆధారంగా వర్షాలను అంచనా వేస్తున్నారని వ్యవసాయ అధ్యయనాలు వెల్లడించాయి. రైతు వర్షం వచ్చే సూచనలను ఆకాశం చూసి అంచనా వేయగలడు. అతడు వాతావరణ శాస్త్రంలో డిగ్రీ చదవకపోయినా ప్రకృతి లక్షణాలను అర్థం చేసుకుంటాడు. ఒక వృద్ధురాలు కుటుంబ సమస్యలను మాటలతో పరిష్కరించగలదు. ఆమెకు సైకాలజీ పుస్తకాలు చదివిన అనుభవం లేకపోయినా జీవిత అనుభవం ఉంటుంది. ఇదే లోకజ్ఞానం యొక్క గొప్పతనం.

లోకజ్ఞానం మనిషిని వినయవంతుడిగా తయారు చేస్తుంది. పుస్తక జ్ఞానం కొన్నిసార్లు అహంకారాన్ని పెంచవచ్చు. "నాకు అన్నీ తెలుసు" అనే భావన కలిగించవచ్చు. కానీ లోకజ్ఞానం ఉన్న వ్యక్తి జీవితంలో ప్రతి రోజు కొత్త పాఠమని అర్థం చేసుకుంటాడు. అతడు ఇతరుల మాటలు వింటాడు. పరిస్థితులను గమనిస్తాడు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

మిగితా తరువాయి రేపటి సంచికలో..

## ప్రభుత్వం వీవోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



**చేవెళ్ల, మే 26 (జనంసాక్షి) :** వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి ప్రమీల, మండల సలహాదారుడు చంద్రశేఖర్, కోశాధికారి జ్యోతి తెలిపారు. వీవోఏల సమ్మెలో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనం ముందు 9వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వీవోఏలకు ప్రతి నెల రూ. 20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంలో వీవోఏల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రభుత్వం వీవోఏల పనులు గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పద్మ, అస్రాబేగం, సుశీల, మం జుల, మాధవి, హేమలత, లలిత, సుజాత, కవిత, స్వప్న, శిరీష, జంగయ్య, అమృత, నిర్మల, అనిత, కవిత తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ సంఘాల ఆపీస్ బేరర్స్ బదిలీలకు మినహాయింపు ఇవ్వాలి



**ఇబ్రహీంపట్నం, మే 26 (జనం సాక్షి) :** ఉద్యోగ బదిలీలలో ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్ కి మినహాయింపు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కిరణ్మయికి, జిల్లా పంచాయతీ అధికారికి సురేష్ మోహన్ , జిల్లా వైద్యా అధికారి స్వర్ణ కుమారిలకు వినతి పత్రం అందజేసిన టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్ బృందం. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వ జీఓ ప్రకారం ఉద్యోగ సంఘాలలో పనిచేసే ఆఫీస్ బేరర్‌కి మినహాయింపు వర్తింపచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ జీవో సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మాధవ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వాణి (మహిళా విభాగం), గాయత్రి జాయింట్ సెక్రెటరీ (మహిళా విభాగం ) సభ్యులు ఏ.మహేందర్, గౌస్, భిక్షపతి, శివకుమార్, శ్రీకాంత్, మల్లేశ్, బాషయ్య, వెంకటేష్, వెంకట్ రెడ్డి, మహేష్ గౌడ్, శంకర్, రాజు గౌడ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి




**వీపనగండ్ల, మే 27 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల సిపిఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వీపనగండ్ల మండల కేంద్రంలోని ఆటోకు తాళ్ళు కట్టి లాగుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి. బాల్ రెడ్డి మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ధరల పెరుగుదలను కట్టడి చేస్తామని చెప్పి దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపే విధంగా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం సిగ్గుచేటు అన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు దేశంలో ఇంధన ధరలు తగ్గించకుండా ప్రజలపై భారాన్ని మోపడం సమంజసం కాదు అన్నారు. వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల అనంతరం మే 15వ తేదీ నుంచి నేటి వరకు నాలుగు సార్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ ధరలు పెంచడం వల్ల నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటూతున్నాయని ఇది పేద,మధ్య తరగతి ప్రజల జీవనానికి దుర్భరం చేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి. హెచ్. వెంకటయ్య,నక్క ఈశ్వర్,ఎం. ఆది, వెంకటేశ్వర గౌడ్, వెంకన్న,రామకృష్ణ,నవీన,రఘు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులను ఉపసంహరించుకోవాలి

### ఏపీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి
### అరెస్టు ప్రయత్నాలు మానుకోవాలి
### టిఎస్‌యుటిఎఫ్

**ముషీరాబాద్, మే 26 (జనం సాక్షి) :** ప్రముఖ మీడియా విశ్లేషకుడు, విశ్రాంత ఆచార్యులు నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ లోని వివిధ పోలీసు స్టేషన్లలో బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆచార్య నాగేశ్వర్ర ర్నలిజం అధ్యాపకునిగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, సివిల్ సర్వెంట్స్ మొదలు రాజకీయ నాయకుల వరకు వివిధ అంశాలపై శిక్షణనిస్తూ పాలకులు ఎవరైనా నిక్కచ్చిగా, సామాజిక కోణంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారనీ, గత, ప్రస్తుత ముఖ్యమంత్రులతో సహా రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఏదోఒక సందర్భంలో ఆయన సలహాలు తీసుకున్నవారే నాని అన్నారు. ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు అసభ్యంగానో, వ్యక్తిగత విమర్శలో కావు. ఆయన వ్యాఖ్యలు నచ్చనివారు ప్రజాస్వామ్యయుతంగా ఖండించవచ్చన్నారు. తన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినా ఆయనపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని ప్రయత్నించడం విజ్ఞత అనిపించుకోదనీ, ఈ చర్య మీడియా స్వేచ్ఛపై దాడిగానే భావించాల్సి ఉంటుందనీ అన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని కేసులను ఎత్తివేసి ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని కోరుతున్నామన్నారు.

# ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి



**వనపర్తి బ్యూరో, మే 26 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, తాగు నీటి సమస్య తీర్చడానికి అవసరమైన ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా సందర్శించి సాగు, తాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించనున్న నేపథ్యంలో వనపర్తి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు, భవిష్యత్తులో సైతం తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అవసరమైన ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి సూచించారు. మంగళవారం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పాలమూరు రంగారెడ్డి , మహాత్మగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పురోగతి, ఇంకా మిగిలి ఉన్న పెండింగ్ పనుల పై నాగర్ కర్నూల్ జిల్లలా వట్టెం రిజర్వాయర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లాల ఇరిగేషన్ సమీక్షలో శాసన సభ్యులు మాట్లాడుతూ ఇటీవలే గణప సముద్రం భూసేకరణ, కొంకాలపల్లి, బొంకలపల్లి, బంద్రాయిపాకుల గ్రామాల పునరావాస కేంద్రాలకు సంబంధించిన పరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్యాకేజీ 27 కింద ఇంకా మిగిలి ఉన్న 68.12 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, అది త్వరగా పూర్తి అయ్యేవిధంగా చూడాలన్నారు. కల్వకుర్తి లిఫ్ట ఇరిగేషన్ ప్యాకేజీ 29 కింద డి-5 ను మరింత బలోపేతం చేసి సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుద్ధారం స్టేజ్ 1, 2 కింద డి -5, డి8 కాలువలు వెడల్పు చేయడంతో పాటు మరింత సామర్థ్యం పెంచేందుకు అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్యాకేజ్ - 27 కానయపల్లి వద్ద కాంట్రాక్టర్ పనులు దక్కించుకొని ఇప్పటివరకు పూర్తి చేయలేదని, 60-సి కింద నోటీసులు ఇచ్చి మరో కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. 14.600 కి.మీ ల మేర బుద్ధారం కుడికాలువ విస్తరించి సామర్థ్యం పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా సూచించారు. గట్లఖానాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బుద్ధారం - 2 రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు, గొల్లపల్లి రిజర్వాయర్, ప్యాకేజీ 28 కింద తాడిపర్తి చెరువు అదనపు పనులు, ఘనపూర్ బ్రాంచి కెనాల్ , కర్నె తాండా లిఫ్ట ఇరిగేషన్, రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు, రాజీవ్ భీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ - 2 ఏనుకుంట రిజర్వాయర్ నుండి రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్ వెడల్పు పనుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్యాకేజ్ 19 వద్ద పైపులు పాడైపోయాయని, వాటిని మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పెబ్బేరు చెరువు సామర్థ్యం 5 టి.యం.సి లకు పెంచేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ శాసన సభ్యులు రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇరిగేషన్ ఎస్. ఈ చంద్రశేఖర్, పార్థసారథి, కార్యనిర్వహక ఇంజనీర్లు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సిలాల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## పేటను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చుదాం



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 26 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాని బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చుదాం అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక , మహిళా వారోత్సవాలలో భాగంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో " బాల్య వివాహరహిత తెలంగాణ" అంశంలో భాగంగా నారాయణపేట జిల్లా ను బాల్య వివాహ రహిత జిల్లా గా మార్చే లక్ష్యం తో జిల్లా బాలల సంరక్షణ విభాగం మంగళ వారం దామరగిద్ద మండలం కంసాన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక మాట్లాడుతూ అన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్యపరమైన సామాజికపరంగా వచ్చే సమస్యలు వాటి వల్ల ఎదుర్కొనే ప్రమాదాలపై అదేవిధంగా మరియు చట్ట పరంగా వచ్చే సమస్యల గురించి అనగా బాల్యవివాహాల నిరోధక చట్టం ,బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, బాల్య వివాహాలకు పాల్పడినటువంటి లేదా ప్రోత్సహించినటువంటి వారిపై చట్టపరంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువుకోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని ప్రతి ఒక్కరూ చదువు కొనసాగించడంపై దృష్టి పెట్టి వారికంటూ ఒక గుర్తింపు ఉండేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కాగా ఈ కార్యక్రమం "బాల్యవివాహం-బతుకు ఆగం" అనే థీమ్ తో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శివారెడ్డి, గ్రామ సర్పంచ్ , డీ ఆర్ డి ఓ వెంకట్ రాములు, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, ,దామరగిద్ద తహసిల్దార్, ఎంపీడీవో, మద్దూరు, సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్స్ , డీ సీ పీ యూ, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి రోగికి ప్రత్యేక వైద్య విధానంతో మెరుగైన ఫలితాలు సాధ్యం

- డా.టి.శ్రావంతి రెడ్డి




**మహబూబ్ నగర్ అర్బన్, మే 26 (జనం సాక్షి) :** ప్రస్తుతం క్యాన్సర్ రోగాలకు అనేక రకాల ఆధునిక చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోగి పరిస్థితిని బట్టి ప్రత్యేకంగా చికిత్సను నిర్ణయిస్తున్నామని డా. టి స్రవంతి రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ చికిత్సలో ప్రధాన లక్ష్యం వ్యాధిని పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం మాత్రమే కాకుండా, రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడమని ఆమె పేర్కొన్నారు. చికిత్స వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ ను తగ్గిస్తూ, అవసరమైన చికిత్సను ఖచ్చితంగా అందించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో హైలీ అడ్వాన్స్డ్ మరియు న్యూ టెక్నాలజీ ఆధారిత రేడియేషన్ మెషిన్ లను ఉపయోగిస్తున్నామని, ఇటీవల వీటిని మరింత ఆధునికంగా అప్గ్రేడ్ చేసినట్లు వెల్లడించారు. ఈ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ ఉన్న భాగాన్ని మాత్రమే టార్గెట్ చేసి చికిత్స అందించడంతో చుట్టూ ఉన్న సాధారణ కణజాలానికి నష్టం చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. రేడియేషన్ థెరపీ లో ప్రెసిషన్ పెరగడంతో పాటు పోసిషనింగ్ ఎర్రర్స్ కూడా గణనీయంగా తగ్గుతున్నాయని చెప్పారు. ఆధునిక ట్రీట్మెంట్ సిస్టమ్స్ వల్ల రోగులకు మరింత సురక్షితమైన మరియు సమర్థవంతమైన చికిత్స అందుతోందన్నారు. రోగి శరీరంలో చికిత్స సమయంలో జరిగే మార్పులను బట్టి ట్రీట్మెంట్ ప్లాన్ ను మార్చుకునే విధానాన్ని అడప్టివ్ రేడియోతెరపి అంటారని, దీని వల్ల చికిత్స ఫలితాలు మరింత మెరుగుపడుతున్నాయని వివరించారు. ఫాస్ట్ ఇమేజింగ్ టెక్నిక్ ద్వారా సింగిల్ బ్రీత్ లోనే స్కాన్ పూర్తి చేయగలుగుతున్నామని, దీనివల్ల ట్రీట్మెంట్ టైం తగ్గి రోగికి సౌకర్యం పెరుగుతోందని తెలిపారు. ప్రతి రోగికి చికిత్స విధానం వేర్వేరుగా ఉంటుందని, వైద్యుల సూచనల మేరకు మాత్రమే చికిత్స తీసుకోవాలని డా. శ్రావంతి రెడ్డి సూచించారు. ఆధునిక రేడియేషన్ థెరపీ ద్వారా క్యాన్సర్ రోగులకు మెరుగైన ఫలితాలు పొందే అవకాశాలు మరింత పెరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ రోహిత్ కుమార్, బి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

# వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 26 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ఈరోజు వరకు 2,65,639.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 54,885 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 38,402 మంది రైతుల అకౌంట్లో రూ. 423.52 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# మెదక్ మున్సిపాలిటీలో నిధులు దుర్వినియోగం

- అడ్డగోలు బిల్లులపై కౌన్సిలర్ల ఆగ్రహం
- పాత కౌన్సిలర్లకే ప్రాధాన్యత



**మెదక్ మున్సిపల్, మే 26 (జనం సాక్షి) :** అడ్డగోలుగా నిధులు ఖర్చు చేస్తున్నారని కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, బట్టి ఉదయ్, మాయ గంగమని కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ బల్దియా కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వ సభ్య సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్, మున్సిపల్ శాఖ అధికారులు సిబ్బంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని పలు వార్డులలో ఉండే కౌన్సిలర్లు పలు సమస్యలపై ప్రశ్నించారు. 17వ వార్డు కౌన్సిలర్ అరుణ సమావేశంలో మాట్లాడుతూ పాత వార్డు కౌన్సిలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారని, కౌన్సిలర్ గా గెలిచి ఏం లాభమని ఆమె మండిపడ్డారు. వార్డులలో సమస్యలు పరిష్కరించకుంటే మాకెందుకు ఈ పదవులని, మీ పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదనకు గురయ్యారు. ప్రజలు మాకు నమ్మి మున్సిపల్ కౌన్సిలర్గా ఓటేసి గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయడం మేము ఆవేదనకు గురవుతున్నామని బాధను వ్యక్తం చేశారు. అనంతరం 23వ వార్డు కౌన్సిలర్ శృతి మాట్లాడుతూ వార్డు సమస్యలపై అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ కౌన్సిలర్ చెప్పినట్టు వింటున్నారని ఇదెక్కడి న్యాయమని ఆమె ప్రశ్నించారు. మేము ప్రజలు ఎన్నుకున్న నాయకులమని, కౌన్సిలర్ గా ఉన్నవాళ్లకు అధికారులు వినకుండా మాజీ కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇస్తే ఇక మేమెందుకు అని ప్రశ్నించారు. అనంతరం ఎనిమిదో వార్డు కౌన్సిలర్ మాయ గంగమని మాట్లాడుతూ మాకు తెలవకుండా మా వార్డులో అధికారులు పనిచేసినట్టు 99 వేల బిల్లు పెట్టడం ఏమిటని దానికి వర్క్ ఆర్డర్ లేకుండా మాకు సమాచారం లేకుండా ఏం పని చేశారని నిలదీశారు. ఆటో వాటర్ మోటర్ మరమ్మత్తుల కోసం ఐదు వేల రూపాయలు ఖర్చు అయితే 99 వేల బిల్లు ఎలా వేస్తారని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు ప్రజల డబ్బును దుర్వినియోగం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం కౌన్సిలర్ బట్టి ఉదయ్ మాట్లాడుతూ ఒక్క కంప్యూటర్ బిల్లు 99 వేలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఆపిల్ కంప్యూటర్ కూడా 50 వేలు ఉండదని ఇంత పెద్ద బిల్లు పెట్టడం ఏంటని నిలదీశారు. గత నెల 35వేల ఏసికి 75,000 బిల్లు పెట్టి అప్పనంగా మున్సిపల్ ఆదాయాన్ని గండి కొట్టారని ఈనెల కంప్యూటర్ పేరుతో మరోసారి గండి కొడుతున్నారని వచ్చేనెల ఇంకేం చేస్తారంటూ ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో చిన్న క్యాబిన్ నిర్మాణానికి లక్ష పది వేలు ఖర్చు చేయడం ఏమిటని నిలదీశారు. ఈ నిధులుతో మంచి ఇల్లు కట్టుకోవచ్చు అన్నారు. అనంతరం 22 వార్డు కౌన్సిలర్ గౌస్ ఖురిషి మాట్లాడుతూ రాందాస్ చౌరస్తా నుండి రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి ముందుకు సాగడం లేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... అధికారులు పనిచేసే ఉద్దేశం ఉంటే చేయండి, లేదంటే కూలగొట్టిన ఇల్లు కట్టించేసేయండి... నిర్లక్ష్యం చేస్తే ఆర్ అండ్ బి కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# భూ సేకరణ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలి

- అధికారులకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశం

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మే 26 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కొనసాగుతున్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి భూసేకరణ ప్రక్రియను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని పాలమూరు – రంగారెడ్డి పటేం 8వ ప్యాకేజ్ హౌస్ గెస్ట్ హౌస్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, భూసేకరణ పనుల పురోగతిపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు.

### పలు కీలక సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

ఈ సమావేశంలో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ), డిండి ప్రాజెక్టు, ఉమామహేశ్వరం బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ రిజర్వాయర్, కర్ణేతాండ్రా బాలెన్సింగ్ రిజర్వాయర్‌లతో పాటు పలు సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనులు, భూసేకరణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా కాలువల నిర్మాణం, రిజర్వాయర్ల అనుబంధ పనులు, పంప్‌హౌస్‌ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ల



కల్పన వంటి అంశాలపై చర్చించారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా భూసేకరణ

భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రైతులకు చెల్లించాల్సిన పరిహారం అంశాలను మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తెలిపారు.

### సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతులకు సాగునీరు అందించడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ప్రతి పనిని నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాకపోవడం వల్ల నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు అధికారులు తెలియజేయగా, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

### పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని మంత్రి హెచ్చరించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను ముఖ్యమంత్రి సందర్శించనున్న నేపథ్యంలో, ప్రధాన సమస్యల పరిష్కారానికి అవసరమైన అనుమతులు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ అమరేందర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేర ప్రవర్తన మార్చుకొని సమాజంలో గౌరవంగా జీవించాలి



**బెజ్జంకి, మే 26 (జనం సాక్షి) :** బెజ్జంకి పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ తోట తిరుపతి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రౌడీ షీటర్లు,సస్పెక్ట్ షీటర్లతో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధిపేట రూరల్ సర్కిల్ సీఐ సిహెచ్.విద్యాసాగర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.గ్రామ వివాదాలు,భూ తగాదాలు,దాడులు,బెదిరింపులు,జూదం,మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం,మహిళలను వేధించడం వంటి సంఘ వ్యతిరేక చర్యలకు రౌడీ షీటర్లు గా నమోదైన మీరు దూరంగా ఉండాలని సూచించారు.పాత నేర ప్రవర్తనలను విడిచిపెట్టి కుటుంబాలతో కలిసి సక్రమ మార్గంలో గౌరవంగా జీవించాలని మంచిగా అర్థమయ్యేలా చెప్పారు.శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని,తిరిగి నేర కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసు శాఖ నిరంతరం పనిచేస్తోంది అనీ అన్నారు.గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు,అనుమానాస్పద వ్యక్తుల సమాచారం అందించడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



**వనపర్తి బ్యూరో, మే 26 (జనంసాక్షి) :** విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి. కళార్చన అన్నారు.జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి లోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమ్మర్ క్యాంప్ లోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకు,పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, మహానంది ఏ. ఎం. ఓ., పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, నిరీష ఆర్ట్ టీచర్, ప్రతాప్ రెడ్డి సి.ఎం.ఓ, మల్లేష్ స్కూల్ అసిస్టెంట్ మరియు బాల సదన్ ఇంచార్జ్ లావణ్య పాల్గొన్నారు.

# వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య
- వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి
- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, మే 26 (జనం సాక్షి) :** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... పట్టుదల, మనోధైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు. దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు



మాట్లాడుతూ...దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. వారికి అత్యుత్తమ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

- కార్యాలయం ముందు ఏఐటీయూసీ ధర్నా
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం ఏ. రెహమాన్

**సంగారెడ్డి, మే 26 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ కార్మికుల బకాయ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకట్ రాజ్యం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం ఏ. రెహమాన్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సంగారెడ్డి – డిపిఓ మల్లారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామపంచాయతీ కార్మికులుగా తమ ఆరోగ్యాలకు సైతం లెక్కచేయకుండా అహర్నిశలు ప్రజల శ్రేయస్సు కొరకు పనిచేస్తున్న కార్మికులకు గత రెండు నెలల నుండి వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు . ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి గ్రామపంచాయతీ కార్మికుల కు ఈఎస్ఐ, పిఎఫ్ ప్రమాద బీమా లాంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఎనిమిది గంటల పరిధినాన్ని అమలు చేయాలనీ, వారంతపు సెలవులు, పండగ సెలవులు ,జాతీయ సెలవులు , అర్జీతా సెలవులు ఇవ్వాలని కోరారు.ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే లైసెన్సులు ఇప్పించాలి ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ చేయించాలనీ సంవత్సరానికి మూడు



జతల యూనిఫామ్ ,చెప్పులు, సబ్బులు, నూనె , బెల్లం ఇవ్వాలన్నారు . ప్రతి ఆరు నెలలకు ఒకసారి కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు .విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ ,సహజ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ 5 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ ద్వారా చెల్లించాలనీ విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు శివ శంకర్, పెంటయ్య, యేసయ్య, కృష్ణ, పద్మారావు, మెగారాజ్, గణేష్ , భాగయ్య, దుర్గయ్య ,సంజీవులు , శ్రీకాంత్ పాల్గొన్నారు.

## లావాదేవీలలో జాప్యం బ్యాంకు ముందు ఖాతాదారుల ఆందోళన

**వెల్దుర్తి, మే 27 (జనం సాక్షి) :** బ్యాంకు లావా దేవిలాద్వారా తమకు ఇచ్చే వరి ధాన్యం డబ్బులు పింఛన్లు ఇవ్వకుండా బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని మంగళవారం



మాసాయిపేట మండలం కెనరా బ్యాంకు ముందు రైతులు వృద్ధులు ఖాతాదారులుఆందోళన చేపట్టారు కెనరా బ్యాంకు లోఇటీవలనే బ్యాంక్ మేనేజర్ బదిలీ కావడంతో అతని స్థానంలో మరో అధికారి వచ్చి సెలవులపై వెళ్లడంతో లావాదేవీలు స్తంభించిపోయి తమకు డబ్బులందగా ఇబ్బందులు పడుతున్నామని ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఖాతాదారులు బ్యాంక్ సిబ్బంది ఎవరు సక్రమంగా లేకపోవడంతో తాము లావాదేవీలు ఇలా జరపాలని ఖాతాదారులు రైతులు బ్యాంకు అధికారుల తీరుపై మండిపడ్డారు వారం రోజులుగా బ్యాంకులోకి డబ్బులు రాకపోవడంతో డబ్బుల కోసం బ్యాంకు వద్ద ఎండకు ఎండుతూ ఇబ్బందులు పడుతూ బ్యాంకు వద్ద పడికాడ్పులు కాస్తున్నామన్నారు. డబ్బులు విషయంలో బ్యాంకులో మేనేజర్ లేకపోవడంతో ఎవరు డబ్బులు వస్తాయని తాము అడిగే ప్రశ్నలకు జవాబురితనం ఇవ్వడం లేదని బ్యాంకులో ప్రస్తుతం ఇన్చార్జి ఉన్న మేనేజర్ ను ప్రశ్నించారు. మేనేజర్ స్పందిస్తూ ఈ సమస్యను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ తో ఫోన్లో మాట్లాడించారు ముఖ్యంగా రైతులు పండించిన ధాన్యం డబ్బులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ ఆర్ ఎం దృష్టికి తీసుకెళ్లారు అధికారులు స్పందించి ఖాతాదారులకు రైతులకు డబ్బులు చెల్లింపులు చేయించాలని బ్యాంకు ముందు బైఠాయించడంతో రెండు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని ఆర్ ఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు నర్సింలు శ్రీనివాస్ ఖాతాదారులు రైతులు పాల్గొన్నారు.

## వివోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**వెల్దుర్తి, మే 27 (జనం సాక్షి) :** వివోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐకెపి రాష్ట్ర జె ఏసి పిలుపుమేరకు మంగళవారం తాసిల్దార్ శ్రీనివాస్ కు తమ సమ్మె నోటీసులను అందించడం జరిగింది. ముఖ్యంగా వివోఏలతోని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం వెట్టి చాకిరి చేపించుకుంటుందని తమకు కనీసం 20 వేల వేతనాన్ని అందించాలని అలాగే వివో ఏ లను సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని అర్హులైన వివో ఏ లను సిఏలుగా గుర్తించాలని తమకు బీమా సౌకర్యం కల్పించాలని అలాగే వివో ఏ లదరికీ ట్యాబ్ సౌకర్యం కల్పించాలని జీవో నెంబర్ 58ని సవరించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ శ్రీనివాస్ కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాసాయిపేట వెల్దుర్తి మండల వివో ఎలా సంగమ అధ్యక్షుడు అశోక్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



## అధిక తూకం వేయాలన్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం పార్టీ డిమాండ్

**బెజ్జంకి, మే 26 (జనం సాక్షి) :** మండలంలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో అదనపు తూకం వేయాలని ఒత్తిడి చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ శ్రీకాంత్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల మంచి ధాన్యాన్ని కూడా బి–గ్రేడ్‌గా కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారనీ,ఇప్పటి వరకు బస్తాకు 41 కిలోలు తూకం వేయగా,ఇప్పుడు 42 కిలోలు ఉంటేనే కొనుగోలు చేస్తామని రైస్ మిల్లర్లు చెప్పడంతో రైతులు తీవ్ర నష్టం కలిగే



అవకాశం ఉంది అనీ అన్నారు.ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని,నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల్లో వడ్లు నిల్వ ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు.వెంటనే రైస్ మిల్లర్లు,ఐకేపీ అధికారులపై చర్యలు తీసుకోవాలి అనీ అన్నారు.రానున్న రోజుల్లో అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బొనగిరి లింగం,బండి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడాలి

- బెక్కెం జనార్ధన్ అధ్యక్షులు ఉమ్మడిపాలమూరు ప్రాజెక్టుల సాధన జేఏసీ
- పిఆర్ఎల్ఐ ను ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలి
- కృష్ణా నది ఎగువన బ్యారేజీ నిర్మాణం చేపట్టాలి పాలమూరు ఎంపీ లు , ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- డిండి ప్రతిపాదనను విరమించి గొట్టిముక్కల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి



**మహబూబ్‌నగర్ ప్రతి నిధి, మే 26 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు తో పాటు జిల్లాల ఉన్న అన్ని ప్రాజెక్టులపట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలని ఉమ్మడి ప్రాజెక్టుల సాధన జేఏసీ జిల్లా అధ్యక్షులు బెక్కెం జనార్దన్ అన్నారు . మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఉమ్మడి ప్రాజెక్టుల సాధన జేఏసీ మరియు పాలమూరు అధ్యయన వేదిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాలమూరును అన్ని ప్రభుత్వాలు రాజకీయంగా వాడుకున్నాయే తప్ప అభివృద్ధిలో మాత్రం వెనకబాటులోనే ఉంచారన్నారు . జిల్లా సస్యశ్యామలంగా మారాలంటే పెండింగ్ లో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీలు మరింత చొరవ తీసుకొని ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు ముందుకురావాలని కోరారు . జిల్లాలో ఉన్న రైతాంగం కోసం ప్రతి ఒక్కరు ముందుకు కదిలి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేవరకు. మేము ప్రజాప్రతినిధుల వెంట పడతామని తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ప్రజలు క్షమించరని అయన తెలిపారు. కృష్ణా నది ఎగువన బ్యారేజీ నిర్మాణం చేపట్టాలి పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షులు రాఘవాచారి కృష్ణ నది ఎగువన బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షులు రాఘవాచారి తెలిపారు .తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నందున, పరస్పర సద్భావనతో పాలమూరు, రంగారెడ్డి జిల్లాల సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని అయన డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి అంశాలపై తక్షణమే చర్చలు జరిపి సత్ఫలితాలు సాధించాలి అని కోరారు . తుంగభద్ర నదిపై ఉన్న రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ అనకట్ట పునర్నిర్మాణ పనులను వేగవంతం చేసి, గ్రావిటీ ద్వారా తెలంగాణకు దక్కాల్సిన వాటాను సాధించాలని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న అంతర్రాష్ట్ర వివాదాలను త్వరగా పరిష్కరించాలి అని అయన కోరారు. కృష్ణా నదిపై ఎగువన బ్యారేజీ నిర్మాణం చేపట్టి మహబూబ్‌నగర్ సాగునీటి కష్టాలను తీర్చాలని, అదే విధంగా తుంగభద్ర ఎడమ కాల్వను తెలంగాణ సరిహద్దుల వరకు పొడిగించి, కృష్ణా–తుంగభద్ర నదుల మధ్య ఉన్న నడిగడ్డ ప్రాంత ప్రయోజనాల కోసం గ్రావిటీ ద్వారా నీటిని చేరవేసే నెట్టెంపాడు ప్రాజెక్టుతో దీనిని అనుసంధానించాలని వారు కోరారు. ప్రజాప్రతినిధుల బాధ్యతగా తీసుకొని మహబూబ్‌నగర్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ నీటి సమస్యలపై గట్టిగా కృషి చేసి సాగునీటి కరవును నివారించాలి అని అయన డిమాండ్ చేశారు . ఈ సమావేశంలో జేఏసీ నేతలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ ప్రతినిధి మే 26 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాముల పర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూ ర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించా రు. తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్య తను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం దేవస్థానం చైర్మన్‌ను తొలిగించాలి

- మహిళా వేధింపు చట్టం కేసు నమోదు చేయాలి



**కాళేశ్వరం, మే 27 (జనం సాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన మహిళా భక్తులను వేధింపులకు గురి చేసిన దేవాలయ చైర్మన్ మోహన్ శర్మను వెంటనే తొలిగించాలని అతని పై మహిళా వేధింపు చట్టం కేసు నమోదు చేయాలని కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భూపాలపల్లి జిల్లా చైర్మన్ పీక కిరణ్ అధికారులను డిమాండ్ చేసారు. మంగళవారం కాళేశ్వరం లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరంగల్ నుంచి వచ్చిన మహిళ భక్తులను ఏక వచనంగా రావే, పోవే అని భక్తుల మధ్య కించపరచడం శోచనీయమని కిరణ్ అన్నారు. అదే అగ్రకులాలకు చెందిన మహిళలను అణగారిన వర్గాలు వేధిస్తే మీరు ఊరుకుంటారా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సరస్వతి అంత్య పుష్కరాలను నిర్వహిస్తుండగా మోహన శర్మ లాంటి కీచకుడు దేవస్థానం ప్రతిష్టను అభాసుపాలు చేస్తున్నాడని కిరణ్ పేర్కొన్నారు. ఆలయ దేవస్థానం చైర్మన్ గా ఎస్సీ ఎస్టీలను నియమించాలని కోరారు. చైర్మన్ పై కేసు నమోదు చేయని పక్షంలో రెండు రోజుల్లో కాళేశ్వరం దేవస్థానం ఈ ఓ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్, లింగమల్ల సదవాలిరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ క్రియేటర్లకు గొప్ప అవకాశం

- మే 30లోగా రీల్స్ సమర్పించండి
- ఆకర్షణీయ నగదు బహుమతులు పొందండి
- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 26(జనంసాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'లో పాల్గొనాలని ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా హ్యాండ్లర్లకు జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారం, లక్నవరం ఉయ్యాల వంతెన, తెలంగాణ నయాగరా బొగత జలపాతం, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి అందాలపై 4కె నాణ్యతతో రీల్స్ రూపొందించి పంపాలని కోరారు. ములుగు జిల్లా పర్యాటక వైభవాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది సువర్ణావకాశమని తెలిపారు. రూపొందించిన రీల్స్‌ను పెన్‌డ్రైవ్‌లో ములుగు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలి. లేదా జిల్లా పౌర సంబంధాల అధికారి రఫీక్ – 99483 92976, సహాయ పౌర సంబంధాల అధికారి వేణు – 94949 70535 నంబర్లకు వాట్సాప్ ద్వారా 30.05.2026 శనివారం సాయంత్రం 5 గంటల లోపు పంపించాలి. పోటీలలో గెలుపొందినవారికి ప్రథమ బహుమతి 21,000, ద్వితీయ బహుమతి 15,000 తృతీయ బహుమతి 10,000 నగదు బహుమతులు అందజేస్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన 02.06.2026 రోజున విజేతలను ప్రకటిస్తారు. బహుమతులు రాని రీల్స్‌లో కూడా కంటెంట్, నాణ్యత బాగుంటే వాటిని సంబంధిత క్రియేటర్ పేరుతో జిల్లా అధికారిక ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ పేజీలలో కోలాబరేషన్ పోస్టుల రూపంలో ప్రచురిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ములుగు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యం సరికాదు



**కాసిపేట మే26 ( జనం సాక్షి) :** కాసిపేట ఒకటవ గనిపై మంగళవారం ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ , మరియు ఏఐటియుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ హాజరై ప్రసంగించారు. సింగరేణి లో రాజకీయ జోక్యం ఉండకూడదని, సొంత ఇంటి కల సహకారాన్ని వెంటనే అమలు చేయాలని, నూతన బొగ్గు గనుల ను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు .సింగరేణి లో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి పాత పద్ధతి లో మెడికల్ ఇన్వాల్వేషన్ చేసి వారసత్వం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాసిపేట మైన్ లో గత కొన్ని సంవత్సరాలుగా ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ లో పని చేస్తున్న 62.మంది కార్మికుల ను ఇతర డిపార్ట్ మెంట్ లకు మార్చడం. తీవ్రంగా, ఖండిస్తున్న మనీ తెలియజేశారు. మార్చడం వలన యాక్టింగ్ చేస్తున్న కార్మికులు ప్రమోషన్ కోల్పోవడం జరుగుతుంది. కావున వెంటనే వారిని తిరిగి ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లో కార్మికులకు పనిముట్లు కోల్ కట్టర్ బిట్లు,డ్రిల్ రాడ్స్, బిట్లు పట్టే బండలు.. లైన్ మెన్ కీలలు మరియు ఇతర పని ముట్లు సప్లై చేయడం లేదని మరియు ఇతర కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమం లో పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, వడ్ల మల్ల రాజేందర్, పార్వతి సురేష్, కొక్కర సంతోష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ జంజీరాల రంజిత్, సపాట అశోక్, బియ్యాల రాజన్న,సందీప్,ఆడెపు రవీందర్, వెంకటేష్,మేకల ఆంజనేయులు, మరియు మైన్స్ కమిటీ,సేఫ్టీ కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు

# అయ్యో.. రైతన్న

- పండిన పంట కొనేదిక్కులేదు
- నెలకు పైగా కల్లాల్లోనే ధాన్యం
- రైతుల కళ్ళు కన్నీటిమయం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న పరిస్థితి



**వరంగల్ బ్యూరో, మే 26 (జనం సాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తుంది. వరి ధాన్యం అమ్మేందుకు కుప్పలుగా పెట్టి ఎప్పుడు కొంటారా అని ఎదురుచూస్తూ ఎదురుచూస్తూ రైతన్నలు నిరసించి పోతున్న బాధాకరమైనటువంటి సందర్భం ప్రస్తుతం పల్లెటూర్లలో కనిపిస్తుంది. ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యం కొనాలంటే తేమశాతం 16% ఉంటేనే కొనే పరిస్థితి ఉంది. ఇందుకోసం రైతులు తాము పండించినటువంటి పంటను ఐకెపి కల్లాల వద్ద ఆరబోసి నెలల తరబడి అక్కడే ఉంచడం జరుగుతుంది. 16% తేమ వచ్చేవరకు ధాన్యం అక్కడే ఉండడం ఎండకు వానకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా రైతులు వేయింపవాలు ఇదే ప్రాంతంలో కాపాడడం పెద్ద సమస్యగా మారింది. ఒకవేళ వర్షం గనుక వచ్చి దాన్ని తడిస్తే ఇంకా రైతుకు బాగా నష్టం కలిగే అవకాశం ఉంది. ఐకెపి నిర్వాహకులు మాత్రం రోజుకు రెండు లారీలు మాత్రమే పంపించి దానికి సరిపడే ధాన్యాన్ని మాత్రమే తీసుకెళ్లడం జరుగుతుంది. లారీలు గనుక కావాల్సినన్ని పంపించకపోవడం వలన ధాన్యం నిల్వ ఉండడం రైతుల రోజుల తరబడి వాటిని కాపాడుతుండడం జరుగుతుంది. ధాన్యాన్ని మిల్లర్లకు పంపించడం జరుగుతుంది. అయితే అక్కడ ఫేమస్యతాన్ని మరోసారి చేపట్టడం వల్ల అక్కడ 16% కంటే ఎక్కువ ఉండటంవల్ల ఒక్కో బస్తా నుండి కిలో నుంచి రెండు కిలోల వరకు ధాన్యాన్ని కట్ చేస్తున్నారు. ఐకెపి సెంటర్లో మట్టికి కిలో, సంచికి కిలో, తాలుకు కిలో చొప్పున తీసేయడం జరుగుతుంది. దీనివల్ల కూడా రైతులు నష్టపోతున్నారు. రైతులు తాము ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కూడా సాధ్యమైనంత తొందరగా ధాన్యాన్ని కొని తీసుకెళ్లలేని పరిస్థితి ప్రస్తుతం కనిపిస్తుంది. రైతులు తమ ధాన్యాన్ని వర్షంకు తడవకుండా ఉండేందుకు తాడిపత్రిలు వేల రూపాయలు పెట్టి కొనుక్కొని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తమ ధాన్యం వర్షం గనుక వస్తే తడిసి ముద్ద అయ్యే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం రైతులు పండించిన పంటలను తక్షణమే కొని రైతులకు న్యాయం జరిగేలా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# వడదెబ్బతో ముగ్గురు మృతి

**చెన్నారావుపేట జల్లిలో వృద్ధురాలు, ఏటూరునాగారంలో టైలర్, నూగూరు వెంకటాపురంలో ట్రాక్టర్ డ్రైవర్**



ఎల్లమ్మ



వెంకన్న



నరేష్

**చెన్నారావుపేట, మే 26 (జనంసాక్షి) :** వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని జల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన సంగెం ఎల్లమ్మ(73) సోమవారం తన బట్టలను పిండుకోవడానికి గ్రామంలోని ఉర చెరువు వద్దకు వెళ్ళింది. బట్టలను పిండుకొని సాయంత్రం వేళలో ఇంటికి తిరిగి వచ్చింది. పొద్దంతా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బతో అస్వస్థకు గురైంది. వెంటనే వాంతులు, విరేచనాలు చేసుకుంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

**ఏటూరునాగారం (జనంసాక్షి) :** ఏటూరునాగారం గ్రామానికి చెందిన వెంకన్న అనే టైలర్ కొద్ది రోజుల క్రితం తన అమ్మవారి ఇంటికి వెళ్లిన సమయంలో తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తాకి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్ ద్వారా ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

**నూగూర్ వెంకటాపురం, మే 26(జనం సాక్షి) :** వెంకటాపురం మండలంలోని సూరవీడు కాలనీ గ్రామానికి చెందిన తాటి నరేష్ (34) వడ దెబ్బతో మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం తాటి నరేష్ సోమవారం రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామంలో ఇసుక తొలకాలకు వెళ్లి రాత్రి 8:00గంటల కు వచ్చి భోజనం చేసి పడుకున్నాడని తెలిపారు. మంగళవారం ఉదయం 6:00గంటలకు మృతుడి భార్య అయినా తాటి భవాని నిద్ర లేచి చూడగానే తన భర్త అయినా మృతుడు మంచం మీదనే చేతులు, లాక్కువచ్చి చనిపోయి ఉండటం గమనించానని తెలిపారు. మృతుడు తాటి నరేష్ ని గమనించిన తన తండ్రి, కుటుంబ సభ్యులు ఆ గ్రామం లోని ఆశా వర్కర్ కి సమాచారం అందించారు. ఆశా వర్కర్ మృతుడిని పరిశీలించి మృతుడు అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడు సోమవారం రోజు ఎండలో ఇసుక ట్రాక్టర్ తొలకం వలన వడదెబ్బ తగిలి రాత్రి పడుకున్న తర్వాత నిద్రలోనే మరణించినట్లు, తండ్రి తెలిపారు. తన తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కె తిరుపతి రావు తెలిపారు.

# ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**స్టేషన్ ఘన్పూర్, మే 26 ( జనం సాక్షి) :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జిల్లాలోని స్టేషన్ ఘన పూర్ లో ఉన్న (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తో న్న ధాన్యం కొనుగోలు కేంద్రం, మండలంలోని నమిలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మెప్మా ధాన్యం కొనుగో లు కేంద్రాల్లో రైతులకు ఎన్ని టోకెన్లు జారీ చేశారు, ఇప్పటివరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యం తర లించాయి, ఏ సమయంలో ఏ మిల్లుకు పంపించా రు, ట్రక్ షీట్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేశారా అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే ఇప్పటివరకు ఎన్ని ఓపీఎంఎస్ ఎంట్రీలు పూర్తి చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టోకెన్ పొందిన రైతుల సంఖ్య,ప్రతి టోకెన్‌కు అనుగుణం గా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలు దే రాయో, ఇప్పటి వరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో, ట్రక్ షీట్‌లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ప్రస్తు తం ఎన్ని కళ్లాల్లో ధాన్యం నిల్వలో ఉందో, ఎన్ని వాహనాల ఎంట్రీలు నమోదయ్యాయో కూడా నిరంతరం నవీకరణ చేయాలని ఆదేశించారు. ధాన్యం తేమ శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది హమాలీలు పనిచేస్తున్నారో తెలుసు కుని అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పా టు చేసి వెంటనే లోడింగ్, అన్లోడింగ్ పనులు చేప ట్టాలని సూచించారు. అలాగే ధాన్యం రవాణా ఆలస్యం కాకుండా ట్రక్కులు, డీసీఎంల ద్వారా వేగంగా తరలించాలని, లక్ష్యంగా నిర్ణయించిన రవాణాప్రక్రియను పూర్తిచేయాలని కేంద్ర నిర్వాహ కులకు సూచించారు. కాంటా వద్ద 41 కిలోల ప్రకా రం తూకం వేయాలని సూచించారు. ధాన్యం నిల్వ కాకుండా కేంద్రాల నిర్వహణ సమర్థంగా ఉండాల ని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనలమేరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంత రం పర్యవేక్షిస్తూ వేగవంతమైన చర్యలు కొనసాగు తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా తీర్చి దిద్దుదాం

- మహిళల అభ్యున్నతికే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వారోత్సవాలు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**గుడిహత్నూర్ (జనం సాక్షి) :** జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి వేయాలని జిల్లా పాలనాధికారి రాజర్షి షా పిలుప ఎనిచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 82 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం గుడిహత్నూర్ మండలంలోని మన్నూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల సభ ఘనంగా జరిగింది. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతా ల్లో అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల్లో అవగాహన పెంపుతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమ వుతుందని అన్నారు. ఇందుకోసం స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు చదువు ద్వారానే బాలికల భవిష్యత్తు మారు తుందని బాల్యవివాహాల వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈదురుగాళ్లకు ఎగిసిపడిన ఇంటిపై కప్పు

- గాలిలో కలిసిన మిర్చి పంట

**నడికుడ, మే 26 (జనం సాక్షి) :** నడికుడ మండలం చర్లపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం విపరీతమైన ఈదురు గాలుల వర్షంతో ఒక్కసారిగా దూడ రాజయ్య సల్మాన్ ఖాన్ అనే ఇద్దరి ఇంటి పైకప్పులు ఎగిసి కింద పడ్డాయి దూడ రాజయ్య మిర్చి పంట ఇంటి ముందు ఆరబయగా ఈదురుగాళ్లకు గాలిలో కలిసి కొట్టుకుపోయింది. సల్మాన్ ఖాన్ కొత్తగా హోటల్ ఏర్పాటు చేసుకుని బిల్డింగ్ ముందు వేసుకున్న రేకులు ఎగిసి పడ్డాయి పెద్ద ఎత్తున భారీ నష్టం వాటిల్లింది వడగండ్ల వానతో భారీ నష్టం వాటిల్లిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


# పంట పొలాలను కాల్చవద్దు

- జిల్లా ఎస్పీ విజ్ఞప్తి



**కాళేశ్వరం, మే 27 (జనం సాక్షి) :** పంట అవశేషాలను, పొలాలను కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. మంగళవారం మహాదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరంలో జరిగిన పొలాల అగ్ని ప్రమాద ఘటనలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. పోలీసులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బందితో కలిసి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

# వరి గడ్డికట్టలు దగ్ధం



**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** మండలంలోని విరనారాయణపూర్ గ్రామానికి చెందిన నార్ల గిరి రవీందర్ కు సంబంధించిన పొలములో దాదాపుగా 90 కట్టల వరకు దగ్ధమైనట్లు సర్పంచ్ పుల్లూరు శ్రీధర్ రావు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీందర్ గడ్డి కట్టలు కాలిపోవడం బాధాకరమని, కుటుంబసభ్యులతో మాట్లాడి అన్నారు మధ్యాహ్నం వచ్చిన ఈదురుగా లులతో కరెంటు వైర్లు గాలివానకు ఊగడంతో మెరుపులు మెరిసి గడ్డి కట్టలమీద పడి దగ్ధమైనట్లు గ్రామస్తులు సర్పంచి శ్రీధర్ రావు తెలిపారు దాదాపుగా లక్ష నుంచి రెండు లక్ష వరకు నష్టం వాటిల్లందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ప్రకృతి వలన ఇలాంటి ఘటనలు జరుగుతాయని వ్యవసాయ రైతులు అప్రమత్తంగా ఉండాలని మక్కా, వరి కొయ్యల అవశేషాలను కాల్చవద్దని , కొన్ని గ్రామాల్లో మంటలతో రైతులు బావుల్లో మోటార్లు పైపులు టెక్ వనాలు దెబ్బతిన్నా యని ఈ లాంటివి చాలా ఘటనలు బాధాకరమని ఈసందర్భంగా అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 మే 2026

# నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు

- ఎస్పీ నరసింహ



**కోదాడ, మే 26 (జనం సాక్షి) :** నేరాలను అలవాటుగా మార్చుకుంటే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు అవసరమైతే జిల్లా బహిష్కరణ చర్యలు కూడా తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తీవ్ర హెచ్చరిక చేశారు. మంగళవారం కోదాడ పట్టణంలోని కాశీనాదం ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కోదాడ డివిజన్ స్థాయి పాత నేరస్తులు, గంజాయి కేసుల్లో నిందితులు, సస్పెక్ట్ షీటర్లకు సంబంధించిన పరివర్తన--సత్ప్రవర్తన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు.క్షణికావేశంలో దాడులు, నేరాలకు పాల్పడితే వ్యక్తిగత గౌరవం కోల్పోవడంతో పాటు కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్న చిన్న వివాదాలతో జైలు పాలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించే దిశగా మారాలని సూచించారు.పోలీస్ శాఖ దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత గణనీయంగా పెరిగిందని, నేరాలకు పాల్పడిన వారిని త్వరితగతిన గుర్తించి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోరని స్పష్టం చేశారు. బైండోవర్ కేసులు నమోదు చేయడం, పీడీ యాక్ట్ అమలు చేయడం వంటి కఠిన చర్యలు కొనసాగుతాయని చెప్పారు.అదే సమయంలో మంచి ప్రవర్తన కనబరిచే షీటర్లపై నమోదైన షీట్స్ ఎత్తివేత అంశాన్ని భవిష్యత్తులో పరిశీలిస్తామని ఎస్పీ వెల్లడించారు. సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, గ్రామాలు, కాలనీల్లో జరుగుతున్న అసాంఘిక చర్యలు, గంజాయి విక్రయాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మేళ్లచెరువు, గరిడేపల్లి మండలాల్లో జరిగిన హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు పడిన విషయాన్ని ప్రస్తావిస్తూ నేరం చేసిన వారు ఎప్పటికైనా చట్టం ముందు తప్పించుకోలేరని తెలిపారు. కోదాడ రూరల్ పరిధిలోని గణపవరం గ్రామంలో జరిగిన యువకుడి హత్య కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించి నిందితులను అరెస్టు చేశామని పేర్కొన్నారు.

### బక్రీద్ పండుగ సామరస్యానికి ప్రతీక

ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పండుగ త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక అని ఎస్పీ తెలిపారు. అన్ని మతాల ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అక్రమంగా గోవులను రవాణా చేయడం, పశువులను హింసించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కోదాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కోదాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై బస్వాపూర్‌లో బిగించిన కట్టడి

- ఆడబిడ్డ భవిష్యత్తును కాపాడటం సమాజ బాధ్యత
- అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ మచ్చు బిక్షపతి పిలుపు



**భువనగిరి, మే 26 (జనం సాక్షి) :** బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామ సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు రావాలని బస్వాపూర్ గ్రామ సర్పంచ్ మచ్చు బిక్షపతి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో మంగళవారం 91 ప్రణాళికలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మచ్చు బిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు బాల్యవివాహాల దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలు, బాలికల హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్యవివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చట్టవిరుద్ధమైన ఘటనలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో అవగాహన పెంపొందితేనే బాల్యవివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ఆడబిడ్డల భద్రత, విద్య, స్వావలంబనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వార్డు సభ్యులు సిహెచ్.పాండు, ముఖ్య అతిథులు ఆర్. గంగరాజు, ఏ. బాలస్వామి, ఆరోగ్య కార్యకర్త (యూచీవీ) ఎం. హేమలత, ఆశా కార్యకర్త మైమున, అంగన్‌వాడీ టీచర్లు షాహీన్ బేగం, రేణుకతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద లైసెన్స్డ్ సర్వేయర్ల మహాధర్నా




**చండూరు, మే 26 (జనంసాక్షి) :** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లైసెన్స్డ్ సర్వేయర్లు గళమెత్తారు. తెలంగాణ లైసెన్స్డ్ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన 'చలో హైదరాబాద్' మహాధర్నా ఉధృతంగా సాగింది. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సర్వేయర్ల నినాదాలతో ధర్నాచౌక్ పరిసరాలు దద్దరిల్లాయి.ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ.. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన 'భూభారతి' చట్టం కింద లైసెన్స్డ్ సర్వేయర్లకు స్పష్టమైన వర్క్ అలోట్మెంట్ పాలసీ (పనుల కేటాయింపు విధానం)ని ప్రభుత్వం వెంటనే రూపొందించాలని డిమాండ్ చేశారు.

### ఒకే వేదికపైకి సర్వేయర్లు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్వేయర్లందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ నిరసన సభ పూర్తిగా విజయవంతమైందని అసోసియేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు మంద గోవర్ధన్, ఉపాధ్యక్షులు మొగుదాల రాంప్రసాద్, భూతరాజు మురళి, సర్వేయర్లు భూతరాజు మహేష్, మధుసూదన్ రెడ్డి, పెద్దలు,చందర్ నాయక్, ప్రశాంత్, సంపత్ తో పాటు వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ పెద్దలు, హక్కుల నాయకులు, సర్వేయర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పది రోజుల్లో న్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**మునుగోడు, మే 26 (జనం సాక్షి) :** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా యా సంగి పంట దాన్యం కొనుగోళ్ల ప్రక్రియ, కల్లాలలో మిగిలి ఉన్న ధాన్యం, దిగుబడికి తగిన నిలువ సామర్థ్యం , ఉందా లేదనిలువ సామర్థ్యం,హమాలీల , లారీల కొరత కొనుగోల్లు వేగవంతం చేయడానికి క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమశ్యాలు, పరిష్కార మార్గాలు తదితర అంశాలకు సంబందించి మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్గొండ, యాదాద్రి జిల్లాల అదికారులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. నల్గొండ జిల్లా పరిదిలోని మునుగోడు, చండూరు, ఘట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ మండలాలలో గత సంవత్సరంలో మొత్తం 2,85,560 క్వింటాళ్ల సేకరణ జరగగా ..ఈ సంవత్సరం 4,20,430 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది...ఇప్పటికే 3,52,300 క్వింటాళ్ల దాన్యం కొనుగోళ్లు జరగగా ఇంకా కల్లాలలో 68130 క్వింటాళ్ల దాన్యం ఉన్నది.యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్, నారాయణ్ పూర్ మండలాలలో గత సంవత్సరం కంటే ఈసారి రెండింతలు ఎక్కువ దిగుబడి వచ్చింది. అనుకున్న దానికంటే ఎక్కువ రెట్లు దాన్యం దిగుబడి పెరగడానికి తోడు హమాలీలు, లారీల కొరతతో పాటు ఈ ప్రాంతంలోని కొన్ని మిల్లులు బ్లాక్ లిస్టులో ఉండడం, నిలువ సామర్థ్యం ఉన్న గోదాములు లేకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుతుందని అదికారులు ఎమ్మెల్యే ద్రుష్టికి తీసుకొచ్చారు.

రైతుల ఇబ్బందులు చూసి హమాలీలకు తక్షణ సహాయంగా 10,20,000 రూపాయలు చెల్లిస్తామనీ ఎమ్మెల్యే ఈ సందర్భంగాహామీ కూలీకి అదనంగా ఇంకొంత తాను చెల్ల హమాలీలకు చెల్లించే 10,20,000 రూపాయలు తాను సొంతంగా చెల్లిస్తానని అదికారులకు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి మండలంలో గోదాముల ను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాన్యం నిలువ చేసే గోదాముల నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలని అదికారుల ను ఆదేశించారు. అదేవిదంగా ఇక్కడ పండిన దాన్యాన్ని ఇక్కడి గోదాముల్లోనే నిలువచేసుకునే విదంగా చూడాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు కులుగకుండా మండలం యూనిట్ గా తీసుకుని పంటలు దిగుబడిని అంచనా వేసి ముందస్తుగా చర్యలు తీసుకునే విదంగా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నల్గొండ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, చౌటుప్పల్ ఆర్టీఓ శేఖర్ రెడ్డి, యాదాద్రి డీసీఓ, నల్గొండ ఇన్ చార్జి డీసీఓ, సివిల్ సప్లై అదికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అదికారులు, ఆయా మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**నూతనకల్, మే 26 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ బి హరి సింగ్ అధికారులను ఆదేశించారు మంగళవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు వర్షా బావ సూచనలు ఉన్నందున 5 రోజులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత కేంద్ర నిర్వాహకులు ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కె నాగేశ్వర్ ను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు...



**ముషీరాబాద్, మే 26 (జనం సాక్షి) :** ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ పై అక్రమంగా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రయత్నించడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఏపీ పోలీసులు చేస్తున్న ఈ అక్రమ అరెస్ట్ ప్రయత్నాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అడ్డుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని నాగేశ్వర్ కు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐఎం కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ... రాజకీయ విశ్లేషకులు సమాజంలో జరిగే పరిణామాలను, తమకు ఉన్న సమాచారాన్ని బట్టి విశ్లేషించడం, ప్రజా బాహుళ్యంలో చర్చలు చేయడం సహజమైన విషయం అని అన్నారు. కానీ, తమ ప్రభుత్వంపై విమర్శలు చేయకూడదని, భిన్నమైన అభిప్రాయాలు చెప్పకూడదనే అహంకారంతో మేధావుల నోరు నొక్కేందుకు ఆంధ్రప్రదేశ్ అధికార పక్ష నాయకులు, పోలీసులు ప్రయత్నించడం అప్రజాస్వామికనన్నారు. మేధావులు, విశ్లేషకులు ప్రజా సమస్యలపై మాట్లాడితే, ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు వాటిని అర్థం చేసుకుని, లోపాలను సరిదిద్దుకునే వైఖరితో వ్యవహరించాలన్నారు. అలా కాకుండా అక్రమంగా అరెస్టులకు దిగడం రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. తప్పుడు కేసులు పెట్టి, జైళ్లకు పంపిస్తామంటూ భయభ్రాంతులకు గురిచేసే ఇలాంటి నిరంకుశ వైఖరిని సీపీఎం ఎంతమాత్రం సహించబోదనీ చెప్పారు. ప్రశ్నించే గొంతుకైన నాగేశ్వర్ను అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీపీఐ(ఎం) హెచ్చరిస్తున్నదన్నారు.

# మునుగోడు కస్తూర్బా పాఠశాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, మే 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. నియోజకవర్గ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (ఖ+దీఎ) అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. సోమవారం పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే, ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం తన వ్యక్తిగత ఇంజనీరుతో కలిసి మరోసారి పాఠశాలను సందర్శించి సరికొత్త యాక్షన్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. విద్యార్థినుల భద్రత, సౌకర్యాలే పరమావధిగాపాఠశాలలో చదువుతున్న సుమారు 400 మంది విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారు సౌకర్యవంతంగా ఉండేలా నూతన నిర్మాణాలు చేపట్టాలని తన వ్యక్తిగత ఇంజనీర్ నారాయణను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇందులో భాగంగా అన్ని వసతులతో కూడిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక గదుల నిర్మాణం, విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా తరగతి గదులు, హాస్టల్ గదులను విడివిడిగా నిర్మించడం,ఆధునిక భోజనశాల, విశాలమైన వంటగది, వంట సామాగ్రిని భద్రపరుచుకునే స్టోర్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా నూతన టాయిలెట్లు, బట్టలు బట్టలు ఉతుక్కునేందుకు ప్రత్యేక వాష్ ఏరియా, సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం వంటివి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థినుల కోసం ఆట స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదికతో పాటు పాఠశాల ఆవరణ అంతటా డ్రైనేజీ వ్యవస్థలో సమూల మార్పుల తో అభివృద్ధి చేయనున్నారు.




మునుగోడు నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు తన తల్లి జ్ఞాపకార్థం 'కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్' ద్వారా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను కూడా అందిస్తున్నారు. త్వరలోనే మునుగోడు కస్తూర్బా పాఠశాల సరికొత్త హంగులతో, ఆధునిక వసతులతో విద్యార్థినులకు అందుబాటులోకి రానుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సూర్యాపేట ప్రతినిధి, మే 26 (జనంసాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.మంగళవారం చివ్వెంల మండలం బీబీగూడెంలోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలంలోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, సివిల్ సప్లైస్ డీఎం శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులున్నారు.

# పండిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి, మే 26 (జనం సాక్షి) :** వడ్ల కొనుగోలు అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తూ బీజేపీ రైతుల్లో అపోహలు, గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం భువనగిరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రయోజనాల విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత రెండు పంటల సీజన్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జవీ= (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మా ప్రజాప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మా ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పండిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి అయోమయానికి గురికావద్దని సూచించారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధిక ధరకు వడ్ల కొనుగోలు జరుగుతోందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం మరింత మెరుగ్గా వడ్ల కొనుగోలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంట దిగుబడి నమోదైందని, అధిక దిగుబడి వచ్చినప్పటికీ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం బీజేపీనేనని ఆరోపిస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉద్యమాల తర్వాత వాటిని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు



పెంచిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రైతు సంక్షేమం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు వాస్తవాలను గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతు భరోసా యాత్రను తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీజేపీ నాయకులకి అనిల్ కుమార్ రెడ్డి సూచించారు.




## ఏఐతో భారత్‌కు
# సవాల్ అదే..
### ఐబీఎం ఇండియా చీఫ్

**న్యూఢిల్లీ:**భారతదేశంలో కృత్రిమ మేధ, మానవ వనరులను సమర్థవంతంగా వినియో గించడంపై ప్రముఖ టెక్ సంస్థ ఐబీఎం ఇండియా చీఫ్ సందీప్ పటేల్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఏఐలో అగ్రగామిగా నిలవాలంటే.. నైపుణ్యాభివృద్ధి, విధానాల విషయంలో ప్రభుత్వం, కంపెనీలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, ఐటీ కంపెనీలు ఉద్యోగులకు తిరిగి శిక్షణ ఇవ్వడంపైనా దృష్టిపెట్టాలని అన్నారు. అన్ని రంగాల్లోకి ఏఐ శరవేగంగా దూసుకొస్తున్నప్పటికీ.. ఈ కొత్త టెక్నాలజీ భారత్‌కు సవాల్ కాదు.. లక్షల మంది ఉద్యోగులను కాపాడుకోవడమే అసలైన సవాల్ అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. "ఏఐ రేసులో భారత్ దేశానికి ఉన్న ప్రత్యేక ప్రయోజనం యువతే. దేశ జనాభాలో సగం కన్నా ఎక్కువమంది 30 ఏళ్లలోపు వారే. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ శ్రామిక శక్తిని నిర్మించడానికి ఇదొక గొప్ప అవకాశం. ఏఐ వేగానికి తగ్గట్టుగా నైపుణ్యాలను అందిపుచ్చుకోకపోతే.. మానవ వనరులు అనే ప్రత్యేకత వల్ల ప్రయోజనం ఉండదు" అని పటేల్ హెచ్చరించారు. మరోవైపు, కృత్రిమ మేధ కారణంగా ఐటీ రంగంలో ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారు. జనరేటివ్ ఏఐ టూల్స్ కోడ్ రాస్తున్నాయి, డేటాను విశ్లేషిస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ సిబ్బంది చేసే పనులనూ చకచకా పూర్తి చేస్తున్నాయి. ఏఐతో పూర్తిగా ఉద్యోగాలు పోనప్పటికీ.. అది పని స్వరూపాన్ని మాత్రం మార్చనుంది. నియామకాల సమయంలో కంపెనీల ఎంపికలూ మారనున్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




# భార్యాభర్తలకు ఒకటే పాలసీ..
## ఎల్ఐసీ నుంచి జాయింట్ ప్లాన్స్

**న్యూఢిల్లీ:**ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండు కొత్త పాలసీలను తీసుకొచ్చింది. భార్యాభర్తలిద్దరికీ బీమా అందించేలా రెండు జాయింట్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. బీమా+ పొదుపు మిళితంగా న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం, న్యూ జీవన్ సాథీ లిమిటెడ్ ప్రీమియం పేరిట రెండు పాలసీలను ఆవిష్కరించింది. జూన్ 1 నుంచి ఈ పాలసీలు కొనుగోలుకు అందుబాటులోకి రానున్నాయి.ఒకప్పుడు ఇంట్లో పురుషులకు మాత్రమే బీమా పాలసీ తీసుకునేవారు. చాలా కుటుంబాల్లో స్త్రీలు కూడా కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నారు. అలాంటి సందర్భాల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ భార్యాభర్తలిద్దరూ కలిపి ఒకే పాలసీ తీసుకోవాలని అనుకునే వారి కోసం ఈ ప్లాన్లను ఎల్ఐసీ డిజైన్ చేసింది. బీమా హామీతో పాటు కట్టిన సొమ్ముకు గ్యారెంటీడ్ అడిషన్ (ఉం) కింద కొంత మొత్తం అదనంగా చెల్లిస్తారు. మెచ్యూరిటీ బెనిఫిట్ కూడా లభిస్తుంది.ఎల్ఐసీ జీవన్ సాథీ (సింగిల్ ప్రీమియం – 888) జీవన్‌సాథీ సింగిల్ ప్రీమియంతో వస్తోంది. ఇది నాన్–పార్టిసిపేట్ నాన్ మార్కెట్ లింక్డ్‌ప్లాన్. భార్యాభర్తలకు వ్యక్తిగత జీవిత బీమాతో పాటు పొదుపు అందించడం దీని ముఖ్య ఉద్దేశం.ఈ ప్లాన్‌లో ఒకేసారి ప్రీమియం మొత్తం చెల్లించాలి.పాలసీ టర్మ్‌లో ప్రతి రూ.1000కు గానూ రూ.70 చొప్పున గ్యారెంటీ అడిషన్ కింద చెల్లిస్తారు.మెచ్యూరిటీ లేదా డెత్ బెనిఫిట్ మొత్తాలను ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో తీసుకునే వీలూ ఉంది.ఎల్ఐసీ పాలసీహోల్డర్లకు రిబేట్ లభిస్తుంది. రుణ సదుపాయం కూడా ఉంది.ఈ పాలసీ తీసుకోవడానికి కనీస వయసు 18 ఏళ్లు దాటి ఉండాలి.బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు, గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు.ఆప్షన్–1 కింద ప్రీమియం మొత్తానికి 1.25 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్ లభిస్తుంది.ఆప్షన్–2 కింద సింగిల్ ప్రీమియంపై 10 రెట్లు బీమా హామీ లభిస్తుంది. పాలసీ టర్మ్: ఆప్షన్ ఎ– 10, 15, 20, 25 సంవత్సరాలు; ఆప్షన్ 10, 15 సంవత్సరాలు.భార్యాభర్తల్లో ఒకరికి రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్ చెల్లిస్తారు. రెండో వ్యక్తీ మరణిస్తే నామినీకి ఆ మొత్తం చెల్లిస్తారు.ఉదాహరణకు: ఒక 35 ఏళ్ల భర్త (ప్రైమరీ) తన 32 ఏళ్ల భార్య (సెకండరీ)తో కలిసి రాజూబితినీని ఎని ఎంచుకుని, పాలసీ టర్మ్ 20 సంవత్సరాలు, బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలతో పాలసీ తీసుకున్నారనుకుందాం. సింగిల్ ప్రీమియం కింద సుమారు రూ.8 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు భర్తకు రిస్క్ జరిగితే ఆప్షన్ 1 ప్రకారం రూ.10 లక్షలు సర్వైవింగ్ భార్యకి చెల్లిస్తారు. పాలసీ ముమ్ముందూ కొనసాగుతుంది. భార్యకు కూడా రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్+ అప్పటి వరకు యాడ్ అయిన గ్యారెంటీడ్ అడిషన్ కలిపి నామినీకి చెల్లిస్తారు. ఒకవేళ 20 ఏళ్లకు ఇద్దరికీ ఎలాంటి రిస్కూ జరగకపోతే బేసిక్ సమ్ అష్యూర్డ్, గ్యారెంటీ అడిషన్ కలిపి రూ.24 లక్షలు చెల్లిస్తారు. మధ్యలో ఎప్పుడైనా రుణం కూడా తీసుకోవచ్చు. యాక్సిడెంటల్, క్రిటికల్ ఇల్‌నెస్ వంటి రైడర్లు కూడా జోడించొచ్చు. జీవన్ సాథీ (లిమిటెడ్ ప్రీమియం– 889) ఇది కూడా నాన్–పార్టిసిపేట్, నాన్–లింక్డ్ ప్లాన్. 5, 10, 15 సంవత్సరాల పాటు ప్రీమియం చెల్లించాలి.ప్రీమియం చెల్లించే కాలవ్యవధిలో మొదటి వ్యక్తికి రిస్క్ జరిగితే.. మిగిలిన ప్రీమియంలు చెల్లించాల్సిన అవసరం లేదు. పాలసీ కొనసాగుతుంది.పాలసీ ఫోర్స్‌లో ఉన్నంత వరకు ప్రతి వెయ్యి రూపాయలకు రూ.70 చొప్పున గ్యారెంటీ అడిషన్ జోడిస్తారు. డెత్ బెనిఫిట్ ఆప్షన్లు: ఆప్షన్ ఎ బేసిక్ సమ్ అష్యూర్డ్ లేదా చెల్లించిన ప్రీమియం మొత్తం ఆప్షన్ ఎఎ: వార్షిక ప్రీమియానికి 10.5 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్‌పాలసీ టర్మ్: 10, 15, 20, 25 సంవత్సరాలు.

కనీస బీమా హామీ మొత్తం రూ.3 లక్షలు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు. ఉదాహరణకు ఒక 35 ఏళ్ల భర్త, తన 32 ఏళ్ల భార్యతో కలిసి ఆప్షన్–ఎని ఎంచుకుని, పాలసీ టర్మ్ 20 సంవత్సరాలు, ప్రీమియం చెల్లించే కాలవ్యవధి 10 సంవత్సరాలు ఎంచుకున్నారనుకుందాం. బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలు తీసుకుంటే వార్షిక ప్రీమియం కింద ఏడాదికి రూ.1.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ 10 ఏళ్లలోపు భర్తకు రిస్క్ జరిగితే ఆప్షన్ ఎ కింద డెత్ బెనిఫిట్‌ను భార్యకు చెల్లిస్తారు. మిగిలిన ప్రీమియాలు మాఫీ అవుతాయి. పాలసీ కొనసాగుతుంది. రెండో వ్యక్తికి కూడా రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్+ గ్యారెంటీడ్ అడిషన్లు నామినీకి చెల్లిస్తారు. ఒకవేళ 20 సంవత్సరాలు పాలసీదారులకు ఎలాంటి రిస్కూ జరగకపోతే మెచ్యూరిటీ కింద సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలు, గ్యారెంటీ అడిషన్ రూ.18 లక్షలు కలిపి రూ.28 లక్షలు చెల్లిస్తారు. పాలసీ ఫోర్స్‌లో ఉన్న సమయంలో రుణ సదుపాయం ఉంది. యాక్సిడెంటల్, క్రిటికల్ ఇల్‌నెస్, టర్మ్ అష్యూరెన్స్ రైడర్స్ జోడించొచ్చు.




## ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్..
### విదేశీ పర్యటనలపై ఆంక్షలు: మారుతీ సుజుకీ




చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటించాలని, కార్పొరేట్ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఆ దిశగా మంగళవారం పలు చర్యలను ప్రకటించింది. ఆన్ ఫీల్డ్‌లో పనిచేయాల్సిన అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని కల్పించింది. వ్యాపార అవసరాలకు మాత్రమే విదేశీ పర్యటనలను పరిమితం చేయాలని నిర్ణయించింది. దేశీయంగా కూడా ప్రయాణా లను తగ్గించుకోవాలని, ఆన్‌లైన్ సమావేశాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించింది. ఈ మేరకు మారుతీ సుజుకీ ఎక్స్ వేదికగా పొదుపు చర్యలను ప్రకటించింది. "ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు, పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దీర్ఘకాలిక ప్రభావాన్ని తగ్గించేందుకు మేం ప్రాధాన్యం ఇచ్చాం. సంక్షోభం లేదా సాధారణ పరిస్థితులతో సంబంధం లేకుండా పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని, విదేశీ మారకద్రవ్య వ్యయాన్ని కనిష్ఠస్థాయికి తగ్గించేలా సమర్థవంతంగా వ్యాపారాన్ని నిర్వహించాలి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కంపెనీ అనుసరిస్తోన్న ప్రక్రియలను పునఃసమీక్షించడానికి ఇది సరైన సమయం అని భావిస్తున్నామన్నారు.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40

వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

₹ 1,45,800 (22 క్యారెట్లు)

₹ 1,59,060 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

## అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డ్..
### 3.37 గిగావాట్ అవర్ ఎనర్జీ స్టోరేజ్

**ముంబై:**అదానీ గ్రీన్ ఎనర్జీ రికార్డు సృష్టించింది. గుజరాత్‌లోని ఖవ్‌డాలో 3.37 గిగావాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది. దీంతో చైనా వెలుపల ఒకే చోట నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్‌గా ఇది నిలిచింది. దీని ద్వారా దాదాపు 10 లక్షల ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయొచ్చు.ఈ భారీ ప్రాజెక్టును కేవలం 10 నెలల్లోనే పూర్తి చేయడం విశేషం. ఇందులో భాగంగా 1.37 గిగావాట్ అవర్ కెపాసిటీని మార్చిలోనే కంపెనీ ప్రారంభించింది. మిగిలిన సామర్థ్యాన్ని జోడించి మొత్తం 3.37 గిగావాట్ అవర్ కెపాసిటీకి చేర్చింది. దీని ద్వారా దాదాపు 10 లక్షల ఇళ్లకు రోజంతా సరిపడా విద్యుత్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా అందిస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. సౌర, పవన వ్యవస్థల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వఉంచి, అవసరమైనప్పుడు వాడుకునేలా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును నిర్మించినట్లు పేర్కొన్నారు. దీంతో దేశ ఇంధన రంగానికి స్వావలంబన, సుస్థిరత లభిస్తుందని దీనివల్ల నాణ్యమైన, అందుబాటు ధరలో విద్యు త్ లభిస్తుందని వెల్లడించారు. విద్యుత్‌ను నిల్వ చేసేందుకు అ ధునాతన లి థియం అయాన్ బ్యాటరీలను అనుసంధానిస్తున్నట్లు ఆయన తెలిపారు.




# రూ.1.1 లక్షల కోట్లు
## ఎవరూ పట్టించుకోవడం లేదు
## అంతకంతకూ పెరుగుతున్న క్లెయిం చేయని డబ్బు




**న్యూఢిల్లీ:**దేశంలో ఎవరూ పట్టించుకోకుండా మిగిలిపోతున్న ఆర్థిక ఆస్తులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రభుత్వం సమర్పించిన తాజా గణాంకాల ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి క్లెయిం చేయని ఆస్తుల విలువ ఏకంగా రూ.1.1 లక్షల కోట్లకు చేరింది. బ్యాంకులు, బీమా సంస్థలు, ఈక్విటీ మార్కెట్లలో యజమానుల జాడలేక ఈ నిధులు పేరుకుపోతున్నాయి. కేంద్రం 'మీ డబ్బు–మీ హక్కు'లాంటి ఎన్నో అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నా, క్లెయింలు ఆశించినంత స్థాయిలో పెరగడం లేదు.

**ఎక్కడ ఎంతెంత సొమ్ము?**

మొత్తం రూ.1.1 లక్షల కోట్లలో అత్యధికంగా రూ.83, 000 కోట్లు బ్యాంకు డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. వీటితోపాటు రూ.10,000 కోట్లు ఈక్విటీ పెట్టుబడులు, మరో రూ.14,000 కోట్లు జీవిత బీమా పాలసీల రూపంలో క్లెయిం చేయకుండా ఉన్నాయి. ప్రస్తుతం ఈ నిధులు వివిధ నియంత్రణ సంస్థల ఆధీనంలో ఉన్నాయి. ఆర్‌బీఐ తన పరిధిలోని నిధులను 'డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్'లో ఉంచగా, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, ఈక్విటీ నిధులను 'ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (ఐపీఈఎఫ్)లో భద్రపర్చింది.

**సమస్య ఎక్కడ?:**ఈ సమస్య ప్రధానంగా 'మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి' (కేవైసీ) ప్రక్రియను డిజిటల్‌గా కాకుండా, పత్రాల రూపంలో నిర్వహించిన పాత ఖాతాలకు సంబంధించింది. పాన్–ఆధార్ అనుసంధానానికి ముందు, ఖాతాలను చేతిరాతతో నమోదు చేశారు. కొన్ని పేర్లలో అక్షర దోషాలు, తాత్కాలిక చిరునామాలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు లబ్ధిదారులు ఆ నిధులను ఉపసంహరించుకోవడానికి డిజిటల్ కేవైసీని అనుసంధానించాలని చూసినప్పుడు, పాత రికార్డులకు ప్రస్తుత వివరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలు సవాళ్లుగా మారుతున్నాయి. పాత ఖాతాల్లో నామినీ వివరాలు లేకపోవడం వల్ల, యజమాని మరణించాక వారసులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

**నిరూపణ సవాలుగా:**ఇది కేవలం నిష్క్రియా ఖాతాల సమస్య ఒక్కటే కాదు. ఇది అర్హత నిరూపణ సమస్యగా మారుతోందని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. వారసులకు హక్కు ఉన్నప్పటికీ, గుర్తింపు కొనసాగింపును, అర్హతను నిరూపించుకునేందుకు అఫిడవిట్లు, ఇండెమ్నిటీ పత్రాలు సమర్పించడం వారికి భారంగా మారుతోంది. ముఖ్యంగా అసలైన ఖాతాదారులే ఉన్నా, వయసు పైబడటం వల్ల సంత కాలు మారడం, వేలిముద్రలు సరిగా పడకపోవడం, మతిమ రుపు, నరాల సంబంధిత వ్యా ధులు సమస్యను మరింత పెంచుతున్నాయి. వాస్తవ ఖాతాదారులు మరణిస్తే, వారి వారసులకు ఆయా పెట్టుబడుల వివరాలు తెలియకపోవడం / వివరాల్లో పొరపాట్ల వల్ల కేవైసీకి సరిపోకపోవడంతో.. వాటి గురించి తెలియడం లేదని చెబుతున్నారు.

**అవగాహన కల్పిస్తున్నా..:**ప్రభుత్వం విధానాలను సరళతరం చేస్తూ.. క్లెయింలను ప్రోత్సహించేందుకు ఉద్గమ్ వంటి ప్రత్యేక డిజిటల్ వేదికలను అందుబాటులోకి తెచ్చింది. గతేడాది ఆర్‌బీఐ, సెబీ సంయుక్తంగా చేపట్టిన 'మీ డబ్బు–మీ హక్కు' పేరిట దేశ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. దీనిద్వారా సుమారు రూ.5,777 కోట్ల విలువైన ఆస్తులను లబ్ధిదారులకు అప్పగించగలిగినా, క్లెయిం చేయని నిధులను వెలికితీయడం ఇంకా పెద్ద సవాలుగానే మిగిలింది.

## ఆర్మీలో చేరితే అప్పుల బాధ తీరుస్తాం: పుతిన్

ఉక్రెయిన్‌పై గత నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా సైన్యాన్ని పెంచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకుంటే, వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు రుణం నుంచి విముక్తి కలిగిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, మే 1వ తేదీకి ముందు రుణాలు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందని సమాచారం. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని తాజా నిబంధనల్లో పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘకాలంగా జరుగుతోన్న యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో ఇటీవల కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఇరువర్గాలతో కలిపి శాంతి చర్చలు జరిపినప్పటికీ.. అవి మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ తరుణంలో తన బలగాలను పెంచుకునేందుకు క్రెమ్లిన్ అనేక చర్యలు చేపడుతోంది. యుద్ధంలో పాల్గొనేవారికి భారీ మొత్తంలో నగదు చెల్లింపులు, ఉన్నత విద్య ప్రవేశాల్లో ప్రాధాన్యం సహా పలు రకాల ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటిస్తోంది.



## ఒక్క క్లాస్‌కు రూ.23 లక్షలు
### ఈ ఏఐ గురువులకు కాసుల పంట..!

**న్యూఢిల్లీ:**కృత్రిమ మేధను అన్ని రంగాలు వేగంగా అందిపుచ్చుకుంటున్నాయి. బేసిక్ టాస్క్‌లకే పరిమితం కాకుండా విస్తృత స్థాయిలో ఏఐ (ఎ.)ని వినియోగించేందుకు కంపెనీలు భారీ మొత్తాలను వెచ్చిస్తున్నాయి. ఈ కొత్త టెక్నాలజీని వాడే విషయంలో తొలుత సంకోచించిన బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సంస్థలు.. ఇప్పుడు ఏఐ నిపుణుల వైపు చూస్తున్నాయి. లేకపోతే తాము పోటీలో నిలవలేమోనని ఆందోళన చెందుతున్నాయి. అందుకే ఏఐ సాధనాలు వాడేలా తమ సిబ్బందిని సిద్ధం చేసే ఫైనాన్స్ ట్రైనింగ్ కంపెనీల వైపు చూస్తున్నాయి. అలా ట్రైనింగ్ ఇస్తోన్న ఓ సంస్థ ఇప్పుడు అమెరికా లో ప్రాచుర్యం పొందింది. దాని పేరే వాల్‌స్ట్రీట్ ప్రాంప్ట్.2025లో ఫెలిపే సినిస్ట్రెరా, డేవ్ వాంగ్.. వాల్‌స్ట్రీట్ ప్రాంప్ట్ స్థాపించారు. వారిద్దరూ గతంలో సాఫ్ట్‌బ్యాంక్‌లో పనిచేశారు. ఏఐ ప్లానింగ్‌లో అమెరికా బ్యాంకర్లు ఎక్కడ వెనకబడ్డారో చెప్తూ.. భారీగా సంపాదిస్తున్నారు. ఒక్క క్లాస్ తీసుకుంటే.. 25వేల డాలర్లు (రూ.23,85,322) వసూలు చేస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రముఖ ఆర్థిక సంస్థలైన సిటీగ్రూప్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వారి కస్టమర్ల జాబితాలో ఉన్నాయి. ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీ, ఆంత్రోపిక్ క్లాడ్, గూగుల్ జెమినై టూల్స్‌తో తమ రోజువారీ ఆర్థిక కార్యకలాపాలను సులభంగా పూర్తిచేయడంలో ఆ ఆర్థిక సంస్థల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉద్యోగులపై పిడుగులా చూస్తున్నా.. భవిష్యత్‌లో ఇదే అవసరంగా మారడాన్ని మనం గుర్తిస్తామని ఈ ఏఐ గురువులు చెప్తున్నారు. కాగా.. చాలామంది బ్యాంకర్లకు ఏఐ టూల్స్‌ను సమర్థవంతంగా వినియోగించడంలో తగిన శిక్షణ లేదు. దాంతో పాత మోడళ్లనే ఉపయోగిస్తున్నారు. ఈ గ్యాప్‌ను పూరించడానికి భారీ సంఖ్యలో ఏఐ నిపుణుల అవసరం ఉందని టెక్ రంగ నిపుణులు చెప్తున్నారు. మరోవైపు.. ఈ ఏఐతో లేఆఫ్‌లు ఐటీ రంగానికే పరిమితం కాలేదు. స్టాండర్డ్ చార్టర్డ్, సిటీగ్రూప్, వెల్స్ ఫార్గో అండ్ కో, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ప్రముఖ సంస్థలు సంప్రదాయ ఉద్యోగాలను తొలగించే ప్లాన్స్‌ను ఇప్పటికే ప్రకటించాయి. రికార్డు స్థాయి ఆదాయాలను ఆర్జిస్తున్నా కూడా.. అవన్నీ కలిసి ఇప్పటివరకు 5000 వేల ఉద్యోగాలకు కోత పెట్టాయి. ఇక, ఏఐ విస్తృత వినియోగంలో ఆసియా ఖండం ముందువరుసలో ఉంది. ఐఎంఎఫ్ విడుదల చేసే ఏఐ ప్రిపేర్డ్‌నెస్ ఇండెక్స్ ప్రకారం.. 174 దేశాల్లో సింగపూర్ తొలిస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఫెలిపే సినిస్ట్రెరా, డేవ్ వాంగ్ ఆసియా వైపు ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

## వైట్‌హౌస్‌లో వాన్స్ ఒంటరి అయ్యారా..?

వైట్ హౌస్‌లో మారుతున్న పరిస్థితుల కారణంగా కీలక విదేశాంగ విధాన నిర్ణయాలకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దూరంగా ఉంటున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో 2028లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ప్రణాళికలను కూడా వాన్స్ వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాను భవిష్యత్తు అధ్యక్ష అభ్యర్థిని కాదని, ప్రస్తుత ఉపాధ్యక్షుడినని వ్యాఖ్యానించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లైంది. అయితే 2028 అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం కొంతకాలంగా వాన్స్‌కు మార్కో రూబియోతో తెర వెనుక రహస్య పోటీ జరుగుతోందని మీడియా వర్గాలు వెల్లడించాయి. వాన్స్ తన నిర్ణయాలను మార్చుకోవడానికి అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ఇటీవల క్యాబినెట్ నుంచి వైదొలగడం కూడా ప్రధాన కారణమని మీడియా కథనాలు వెల్లడించాయి. అమె పదవి నుంచి దిగిపోవడం వల్ల విదేశీ వ్యవహారాల విషయంలో వ్యూహాలను పంచుకోవడానికి అనుభవజ్ఞులైన అధికారులు లేకుండాపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్‌తో యుద్ధం విషయంలోనూ వాన్స్ ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నట్లు.. యుద్ధాన్ని ముగించాలని సూచిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి.

## అడకత్తెరలో పాకిస్థాన్
### ట్రంప్ 'అబ్రహం అకార్డ్స్' మెలిక..

అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహిస్తున్నామంటూ గొప్పలు చెబుతోన్న పాక్ పరిస్థితి ట్రంప్ ప్రతిపాదనతో ఇప్పుడు కుడతిలో పడిన ఎలుకలా మారింది. ఈ శాంతి ఒప్పందానికి 'అబ్రహం అకార్డ్స్ మెలికపెట్టిన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్.. అందులోకి పాక్‌ను ఆహ్వానించారు. దీంతో మన దాయాది పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పైగా ఇందుకు సంబంధించిన పోస్ట్‌లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ప్రస్తావించకపోవడం ఆ దేశానికి మరింత అవమానకరం. అసలేం జరిగిందంటే..ఇరాన్‌తో శాంతి చర్చలకు (జూ–ఎతీజీని ఖవజీఇవ ఆవజీశ్రీ) సంబంధించిన ట్రంప్ తాజాగా తన ట్రూత్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. అరబ్ దేశాలు చారిత్రక అబ్రహం అకార్డ్స్‌లో తప్పనిసరిగా చేరాల్సిందేనని రాసుకొచ్చారు. "సౌదీ అరేబియా, ఖతార్, పాకిస్థాన్, తుర్కియే, జోర్డాన్ దేశాలు తక్షణమే అబ్రహం అకార్డ్స్‌పై సంతకం చేయాలి. ఇందులో ఒకట్రెండు దేశాలు ఇందుకు అంగీకరించకపోవచ్చు. కానీ, చాలా దేశాలు సిద్ధంగానే ఉన్నాయి. పశ్చిమాసియాలో ఆర్థిక, సామాజిక పురోగతికి ఈ అకార్డ్స్ (ఒప్పందాలు) ఎంతగానో ఉపయోగపడతాయని ఇదివరకే రుజువైంది. చరిత్రలోనే కనీవిని ఎరుగని ఒప్పందాలు ఇవి. పశ్చిమాసియా ఐక్యత, బలాన్ని చాటిచెబుతాయి. దీనిపై సౌదీ, ఖతార్ తొలుత సంతకాలు చేయాలి. మిగతా దేశాలు కూడా వీటిని అనుసరించాలి. ఇరాన్ కూడా ఇందులో చేరితే అది చాలా గొప్ప విషయం అవుతుంది"



అని ట్రంప్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

**షరీఫ్‌ను మరిచి మునీర్ పేరు పెట్టి..**

ఈ సందర్భంగా ఆయా దేశాధినేతల పేర్లను అమెరికా అధ్యక్షుడు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్ విషయానికొచ్చేసరికి ఆ దేశ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ పేరు కాకుండా.. ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ పేరును ప్రస్తావించడం మరింత చర్చనీయాంశమైంది. పాక్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తొక్కిపెట్టి సైనిక పాలన సాగిస్తున్నారనే ప్రచారానికి ట్రంప్ పోస్ట్‌తో బలం చేకూర్చినట్లయ్యింది.

**ఏంటీ అబ్రహం అకార్డ్స్..?:**పశ్చిమాసియాలో శాంతి, వాణిజ్యం, దౌత్య సంబంధాలను పెంపొందించాలనే లక్ష్యంతో 2020లో అబ్రహం అకార్డ్స్‌ను రూపొందించారు. ఇజ్రాయెల్‌ను గుర్తిస్తూ దాంతో దౌత్య సంబంధాలు బలోపేతం చేసుకునేలా అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ ఒప్పందాలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, సూడాన్, మొరాకో సంతకాలు చేశాయి. ఇప్పుడు దీన్ని మరిన్ని అరబ్ దేశాలకు విస్తరించాలని ట్రంప్ భావిస్తున్నారు. అయితే, గాజాపై ఇజ్రాయెల్ సైనిక చర్యను మెజార్టీ ముస్లిం దేశాలు తీవ్రంగా ఖండిస్తున్న నేపథ్యంలో.. అబ్రహం అకార్డ్స్‌లోకి ఆయా దేశాలు చేరుతాయా అనేది సందేహమే. ఇజ్రాయెల్‌తో సాధారణ దౌత్య సంబంధాలు నెరపలేమని ఇప్పటికే సౌదీ పలుమార్లు స్పష్టం చేసింది.

పాక్ సంగతి ఇలా..

పాకిస్థాన్ కూడా ఇజ్రాయెల్‌ను ఇంతవరకూ గుర్తించలేదు. 2020లో అబ్రహం అకార్డ్స్ రూపొందించినప్పుడే నాటి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అమెరికా సంప్రదించింది. అయితే, నాడు అందులో చేరేందుకు ఇమ్రాన్ అంగీకరించలేదు. ఆ తర్వాత వచ్చిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఇజ్రాయెల్‌ను గుర్తించేందుకు ససేమిరా అన్నారు. ఇప్పుడు ఇరాన్‌తో అమెరికా శాంతిఒప్పందానికి ఇస్లామాబాద్ మధ్యవర్తిత్వం వహించడంతో ట్రంప్ మరోసారి ఈ అంశాన్ని తెర పైకి తెచ్చారు. ఈ ఒప్పందాలపై సంతకం చేస్తే.. పాక్ స్వదేశంలో రాజకీయంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అందుకే, ట్రంప్ ఆహ్వానాన్ని ఆ దేశం తోసిపుచ్చింది. "అబ్రహం అకార్డ్స్‌పై పాక్ సంతకం చేయదు. అది మా ప్రాథమిక సిద్ధాంతాలకు విరుద్ధం. ఇది మాకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ వెల్లడించారు.

# ఎస్సీ, ఎస్టీ భూములను గుంజుకున్న దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం

- చేవెళ్ల డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి : హరీష్ రావు
- లంబాడీలపై దాడులు, కేసులు పెంచిన రేవంత్ సర్కార్
- పోరాటం కొనసాగించాలని పిలుపు



**ముషీరాబాద్, మే 26 (జనంసాక్షి):** ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా 50 వేల ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను గుంజుకున్న దుర్మార్గ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు మండిపడ్డారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మందావత్ రాంబల్ నాయక్ అధ్యక్షతన గిరిజనుకు ఇచ్చిన 12 హామీలను అమలు చేయాలని కోరుతూ లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన 50 వేల ఎకరాల భూమిని గుంజుకుని తిరగబడిన లంబాడీలకు బేడీలు వేసిన సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయకపోతే ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత ఖర్గే ఇంటి ముందు ధర్నా చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలను కార్పొరేషన్ల పేరిట మోసం చేయడం తప్ప వారి సంక్షేమం కోసం ఒక రూపాయి ఇవ్వలేదన్నారు. ఇందిరా పార్క్ నుంచి మొదలైన ఈ పోరాటం ప్రతి తండాకు చేరాలని, చేవెళ్ల డిక్లరేషన్ అమలయ్యేంత వరకు పోరాడాలని సూచించారు. తెలంగాణ రాకముందు నుంచి లంబాడీలు అనేక ధర్నాలు చేశారని, కానీ 3146 తండాలను గ్రామ పంచాయతీలు చేసి, లంబాడీలను సర్పంచులుగా చేసింది కేసీఆర్ ఒక్కరే అని గుర్తు చేశారు. ఇది ధర్నా కాదని, లంబాడీల ఆత్మగౌరవ పోరాటమని, గిరిజనులు మాటిస్తే నిలబెట్టుకుంటారని చెప్పారు. సోనియా గాంధీ, రేవంత్ రెడ్డిలు చేవెళ్ల డిక్లరేషన్ అంటూ అనేక హామీలు గుప్పించారని, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పాముగా మారి కాటేస్తున్నదని, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు చేతులు జోడించిన కాంగ్రెస్ పాలకులు అధికారంలోకి వచ్చాక లంబాడీల చేతులకు బేడీలు వేశారని, భూములు గుంజుకోవద్దు అంటే ఆడ వాళ్లు, గర్భిణులు అని చూడకుండా పోలీసులతో దాడులు చేయించి, 45 మంది లంబాడీ బిడ్డలను జైల్లో పెట్టారని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి పథకం మొదలయ్యిందే ఎస్సీ, ఎస్టీల కోసమని, కేసీఆర్ లక్ష ఇచ్చిండు, మేం గెలిస్తే తులం బంగారం ఇస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి ఇవ్వకపోగా, పుట్టిన బిడ్డకు 13 వేల రూపాయలు ఇవ్వడం లేదని, చేవెళ్ల డిక్లరేషన్‌లో చెప్పిన ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. పది పాసైతే, ఇంటర్ పాసైతే, పీజీ పాసైతే డబ్బులు ఇస్తామన్నరు కానీ ఒక్కరికీ ఇవ్వలేదని, కొత్తగా పెడతామన్న నాలుగు ఐటీడీఏలు కనిపించకపోగా ఉన్న వాటికి రూపాయి సైతం ఇవ్వలేదన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిన బీఆర్ఎస్ ఆడపిల్లలు చదువుకోవడానికి మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి సేవాలాల్ మహరాజ్ పేరిట ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మండావత్ రాంబల్ నాయక్, ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్ భూక్యా, చందర్ నాయక్, భరత్ చౌహాన్, అశోక్ నాయక్, ధరావత్ బిక్షంనాయక్, హరినాయక్, రాణా ప్రతాప్ నాయక్, అధిక సంఖ్యలో లంబాడీ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున లంబాడీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాంధీ ఆస్పత్రి నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

**సికింద్రాబాద్ (జనం సాక్షి):** గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రిమాండ్ ఖైదీ పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కేసులో నిందితుడిగా ఉన్న బోయిన్ పల్లికి చెందిన సయ్యద్ అమీర్ హుస్సేన్ అనే యువకుడు గత పది రోజుల నుంచి చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అయితే ఈ నెల 24న అతడు జైల్లో ఐదు ఇనుప మేకులను మింగడంతో ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించింది. దీంతో అప్రమత్తమైన జైలు అధికారులు అతడికి ఎక్స్-రే పరీక్షలు, తదుపరి అత్యవసర చికిత్స నిమిత్తం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ముగ్గురు ఏఆర్పీసీల భద్రత నడుమ గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్య వేక్షణలో ఆదివారం సాయంత్రం అతడిని ఆస్పత్రిలోని టీఎంటీ వార్డులో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు అమీర్ హుస్సేన్ వాష్ రూమ్‌కు వెళ్లాలని ఎస్కార్ట్ పోలీసులను కోరడంతో వారు వార్డులోని వాష్ రూమ్‌కు పంపించారు. అయితే ఎంత సేపటికీ అతడు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు లోపలికి వెళ్లి పరిశీలించగా అప్పటికే నిందితుడు వాష్ రూమ్ కిటికీ గుండా బయటకు దూకి, ఆస్పత్రి ప్రాంగణం నుంచి చాకచక్యంగా పరారైనట్లు గుర్తించారు. ఖైదీ పారిపోయాడని తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో గాలించి నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చట్టపరమైన పోలీసు కస్టడీ నుంచి ఖైదీ పరారు కావడంతో, విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారైన ఖైదీ పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.కాగా ఆసుపత్రి నుంచి తప్పించుకున్న ఖైదీ నీ మంగళ వారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.

## తాండూర్ ఎమ్మెల్యేకు నకిలీ ఫోన్ కాల్

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో తాండూర్ ఎమ్మెల్యేకు నకిలీ కాల్
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన మనోహర్ రెడ్డి
- అపరిచితుల కాల్స్‌పై అందరూ అప్రమత్తం కావాలి

**తాండూర్, మే 26 (జనంసాక్షి):** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరుతో తనకు నకిలీ ఫోన్ కాల్ వచ్చిందని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వికారాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆర్థిక శాఖ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని చెబుతూ "దిలీప్ కుమార్" అనే వ్యక్తి ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడు. తనను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి మాట్లాడిన తీరు అనుమానాస్పదంగా ఉండటంతో ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారు. ఇటీవల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డికి కూడా ఇదే తరహా నకిలీ కాల్ వచ్చిందని, ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వీడియోను చూశానని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే విషయాన్ని ధృవీకరించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకుని నకిలీ పేర్లతో ఫోన్ కాల్స్ చేసి మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ గుర్తింపులతో మోసాలకు పాల్పడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం, సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : సైబరాబాద్ సిపి



**శేరిలింగంపల్లి, మే 26 (జనంసాక్షి) :** ఈనెల 28న బక్రీద్ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ పాస్ డాక్టర్ ఎం రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ విభాగం, వెటర్నరీ శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆయన 'జూమ్' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బక్రీద్ పండుగ మతసామరస్యాన్ని ప్రతిబింబించేదిగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కానీ, రెచ్చగొట్టే వ్యవహారాలు నిర్వహిస్తే చూస్తూ సహించబోమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ముస్లింలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని, పండుగ అంటే సంతోషాన్ని నింపేదిగా ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు. చంతువేరిదాలను ఎక్కడికక్కడ పడేయకూడదని, పరిశుభ్రమైన పరిసరాలు ప్రజా ఆరోగ్యం విషయంలో తప్పకుండా ముస్లిం మత పెద్దలు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. జిహెచ్ఎంసి అధికారులు ఈద్గాల వద్ద, మసీదులు మరియు నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సమీకరణ కోసం నల్లటి మందమైన పాలీథిన్ కవర్లను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రధాన రహదారులు, ప్రజా ప్రదేశాల పరిశుభ్రత నిమిత్తం తగినన్ని వాటర్ ట్యాంకర్లు పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించడం, బ్లీచింగ్ పౌడర్లు వినియోగిస్తూ ఎలాంటి దుర్వాసన, రోగాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలీసులు, సీఎంసీ అధికారులు, రెవెన్యూ మరియు వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పండుగ వాతావరణం లో కొనసాగేలా సైబరాబాద్ సిపి తెలియజేశారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ విభాగం డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డిసిపి సాయి మనోహర్, సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి సంజీవ్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుని కి సన్మానం చేసిన
## మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

**కామారెడ్డి ప్రతినిధి, మే 26 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ జిల్లా స్థాయి సమావేశానికి విచ్చేసిన టీపీసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాధారు షబ్బీర్ అలీ,ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్,జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంత్ రావు, డిసిసి అధ్యక్షులు మల్లికార్జున్ లకు షాలువాతో ఘనంగా సన్మానం చేసి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ధి చంద్రకాంత్ రెడ్డి,బిచ్కుంద మున్సిపల్ చైర్ పర్సన్, సీనియర్ నాయకులు కైలాస్ శ్రీనివాస్ రావు, పట్టణ అధ్యక్షులు సందీప్,టీపీసిసి జిల్లా నూతన కమిటీ సభ్యులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రాష్ట్రం విఫలం

- ప్రతిపైసా కేంద్రమే ఇస్తున్నా...ఎందుకీ వైఫల్యం
- ఇకనైనా బేషజాలకు పోకుండా ప్రతి గింజను కొనుగోలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన



**కరీంనగర్ బ్యూరో, మే 26 (జనంసాక్షి) :**

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రమే ఇస్తున్నప్పటికీ, వడ్ల కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగావడం లేదని మండిపడ్డారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే "రైతు గోస బీజేపీ భరోసా" పేరుతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం రోజు 1 కోటి 39 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వీటితోపాటు కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్ధరణ, షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. వడ్ల కొనుగోలు అంశం పై మీడియా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రానివా? రాష్ట్రానివా? సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుతిలీతాడు మొదలు రవాణా ఖర్చులన్నీ కేంద్రమే ఇస్తోందన్నారు. "వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి మాత్రమే. మధ్యవర్తిత్వం చేసినందుకు కేంద్రం, రాష్ట్రానికి కమీషన్ కూడా ఇస్తోంది. అయినా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమవుతోందని విమర్శించారు. ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. "ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయండి. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వండి. పొరపాట్లు జరిగిన చోట గుర్తించి వెంటనే సరి చేసుకుని వడ్లను కొనుగోలు చేయాలని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా పేరుతో యాత్రలు చేస్తున్నామని తెలిపారు.

## అడ్మిషన్ల పేరుతో అల్లాడుతున్న ప్రైవేట్ టీచర్లు

**ముస్తాబాద్ మే 26 (జనం సాక్షి) :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లకు అడ్మిషన్లు టార్గెట్ తో తీవ్ర తలనొప్పిగా మారింది. వేసవి సెలవులు రావడంతో టీచర్లకు అడ్మిషన్లు (స్కూలు యజమాన్యం) టార్గెట్ పెట్టడం పెట్టిన టార్గెట్ పూర్తి కాకపోతే టీచర్లపై ఒత్తిడి తీసుకురావడం,కనీసం వారికి ఆదివారం పండుగలు తీరిక లేకుండా, స్కూలు యాజమాన్యం వారు వారిని అడ్మిషన్ల కోసం ముప్పు తిప్పలు పెట్టడం, ఇంత వేసవి ఎండలో కూడా టీచర్లను అడ్మిషన్ల కోసం ఒత్తిడి చేయడం, కొన్ని స్కూళ్లలో అడ్మిషన్లు తీసుకురాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని చెప్పడం, టీచర్లకు అడ్మిషన్ కొరకు పిల్లల తల్లిదండ్రులతోని బ్రతిమిలాడి ఒప్పించి అడ్మిషన్ తీసుకెళ్లడం ఇవన్నీయు టీచర్లపై ఒత్తిడి తీసుకొచ్చి చాలా ఇబ్బందికి గురవుతున్నారు. అడ్మిషన్ల ఒత్తిడికి టీచర్ల వ్యక్తిగత జీవితాలను కూడా దెబ్బతీస్తుందని తెలుస్తుంది. అటు కుటుంబ సభ్యులతో సమయం గడపలేక, ఇటు అడ్మిషన్లతో ఇబ్బంది పడుతూ టీచర్లు సతమతం అవుతున్నారు. ప్రైవేట్ స్కూళ్ల టీచర్ల వేధింపులను అరికట్టాలని ఉన్నత అధికారులను కోరుచున్నాము

## ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

**ఆర్ఎంకు వినతిపత్రం అందజేసిన గంగుల, జీవన్ రెడ్డి**



**కరీంనగర్ టౌన్, మే 26, (జనం సాక్షి) :** వడ్ల కొనుగోలు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేటు వేయడం దారుణమని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి ఖండించారు. జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం గులాబీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా గంగుల కమలాకర్, జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. సస్పెండ్ చేసిన డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని గంగుల విమర్శించారు. ధాన్యం కొనుగోలు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే డ్రైవర్ అశోక్‌ను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. సస్పెండ్ చేసిన డ్రైవర్‌కు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు.డ్రైవర్ సస్పెన్షన్ ఎత్తివేసే వరకు అవసరమైతే ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ముందు బైఠాయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన ఉద్యోగిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాత్కాలిక డ్రైవర్‌గా ఉన్న అశోక్‌కు పర్మినెంట్ ఉద్యోగ భద్రత కల్పిస్తామని గంగుల హామీ ఇచ్చారు.

## మంత్రి సీతక్క వివోఏలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**ఎడపల్లి మండల వివోఏలు**

**ఎడపల్లి, మే 26 (జనంసాక్షి) :** వివోఏలకు గౌరవ వేతనం బదులు కనీస వేతనం అందిస్తామని చెప్పిన మంత్రి సీతక్క మాట నిలబెట్టుకోవాలని ఎడపల్లి మండల వివోఏలు స్పష్టం చేశారు. మంగళవారం తమ సమస్యల పరిష్కారం కోసం వివోఏలు చేస్తున్న సమ్మె రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలలో వివోఏలను బాధ్యులుగా చేస్తున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వివోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వివోఏలకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలను అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, వివోఏలకు సాధారణ ఆరోగ్య బీమా సౌకర్యం 20 లక్షల వరకు కల్పించాలని, ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని జీవో 58 ను సవరించాలని వారు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయకపోతే ఈ సమ్మెను మరింత రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి శస్త్రచికిత్స చేస్తే ప్రమాదాలు తగ్గించవచ్చు

- లాపరోస్కోపిక్ అంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు : యశోద ఆసుపత్రి డాక్టర్ జి. దయాకర్ రావు




**వనపర్తి, మే 26 (జనంసాక్షి):** అపెండిక్యులర్ మాస్, కోలన్ క్యాన్సర్ వంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు చెప్పారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ సర్జరీతో మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎం.వై.ఎస్ బ్యాంకెట్ హాల్‌లో క్యాన్సర్‌పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. దయాకర్ రావు మాట్లాడుతూ అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స యశోద ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మ తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డతో యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరిందని, పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్‌తో పాటు కోలన్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు.
కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్‌ప్లోరేషన్, అడ్హీజియోలిసిస్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమికోలెక్టమీ, ఐలియో ట్రాన్స్‌వర్స్ అనాస్టమోసిస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. పెద్దప్రేగు భాగంలో గడ్డతోపాటు చుట్టుపక్కల భాగాలకు అంటుకుపోయిన ఇన్‌ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారని చెప్పారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణ, ప్రత్యేక పర్యవేక్షణ అందించారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం మెరుగుపడి స్థిరపడడంతో అవసరమైన సూచనలతో డిశ్చార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.
అపెండిక్స్ లేదా పెద్దప్రేగుకు సంబంధించిన క్యాన్సర్‌తో కూడిన అపెండిక్యులర్ మాస్ అనేది క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధి అని, కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ, జీర్ణ సమస్యల వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమయానికి గుర్తించకపోతే ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి, ప్రేగు అవరోధం, క్యాన్సర్ ముదిరే ప్రమాదం ఉంటుందని, ముందస్తు నిర్ధారణ, అత్యాధునిక పరీక్షలు, సకాలంలో శస్త్రచికిత్స అత్యంత కీలకమని చెప్పారు. అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం, అత్యాధునిక లాపరోస్కోపిక్ పరీక్షలు, బయాప్సీ ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చన్నారు. అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే ఖచ్చితంగా నిర్ధారించి అత్యాధునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్రచికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స అందించడం ఆసుపత్రి నైపుణ్యాన్ని చాటిచెప్పిందని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందం, మల్టీడిసిప్లినరీ వైద్య విధానాలతో క్లిష్టమైన క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కే. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదురలు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్, ఏ. వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

# కోహెడలో మెగా ప్రాజెక్టు నిర్మాణం

- అంతర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్‌తో తెలంగాణకు గుర్తింపు
- జూన్ 3న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన.. ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీల సమీక్ష
- రైతులు, వ్యాపారులకు బంగారు అవకాశం



**అబ్దుల్లాపూర్‌మెట్, మే 26 (జనంసాక్షి):**
అంతర్జాతీయ ప్రమాణాలతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ మండలం కోహెడలోని సర్వే నంబర్ 167లో పండ్ల మార్కెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందని ఇబ్రహీం పట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలోనే అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగిందని, అదే తరహాలో సకల హంగులతో పండ్ల మార్కెట్ నిర్మించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా, ఇదే ప్రాంతంలో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చే జూన్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పండ్ల మార్కెట్, సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శంకుస్థాపన జరగనుంది.
ఇందుకోసం మార్కెట్ నిర్మించతలపెట్టిన ప్రాంతంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలైంది. సీఎం పర్యటన, మార్కెట్, రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన ఏర్పాట్లను ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మల్కాజ్‌గిరి సీపీ సుమతి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి దిశానిర్దేశం చేసి, భద్రత చర్యలపై సీపీతో చర్చించారు. అలాగే, సీఎం పర్యటన, పనుల ప్రారంభోత్సవం గురించి కలెక్టర్‌తో చర్చించారు.
గడ్డి అన్నారం నుంచి తరలించి, ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న మార్కెట్‌ను ముఖ్యమంత్రి సూచనల మేరకు అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేలా నిర్ణయం జరిగిందని చెప్పారు. ఈ మేరకు కోహెడలోని ప్రభుత్వ భూములను గుర్తించి, మార్కెటింగ్ శాఖకు అప్పగించినట్లు చెప్పారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తైతే అటు పండ్ల విక్రయదారులు, వ్యాపారులు, వినియోగదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మధ్యదళారీల బెడద లేకుండా ప్రజలే నేరుగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు జరుగుతాయన్నారు. అదేవిధంగా, మరో 4 ఎకరాల్లో సమీకృత రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం జరగనున్నట్లు చెప్పారు. మౌలిక వసతులు, సకల హంగులతో ఈ కార్యాలయాలు రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగిసేలా అధికారులు దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

## కోకాపేట కొత్త చెరువులో 22 ఎకరాల ఆక్రమణల తొలగింపు





### ఖైతలాపూర్‌లో రహదారి కబ్జాలపై హైడ్రా చర్యలు

**హైదరాబాద్/ రాజేంద్రనగర్ మే26(జనంసాక్షి)**
చెరువులు, రహదారుల ఆక్రమణలపై హైడ్రా భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని కొత్త చెరువులో జరిగిన ఆక్రమణలను మంగళవారం తొలగించింది. అలాగే కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్‌లో రహదారిని ఆక్రమించి నిర్మించిన షెడ్లను కూడా తొలగించింది. కోకాపేట కొత్త చెరువు పూర్తి ఎఫ్‌టీఎల్ పరిధి 72 ఎకరాలు కాగా, ఇందులో దాదాపు 22 ఎకరాల మేర ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా గుర్తించింది. గోల్డ్ ఫిష్ విల్లాస్ కోసం ఎఫ్‌టీఎల్ పరిధిలో సుమారు 1.20 ఎకరాల్లో ప్లే ఏరియాలు, పార్కులు నిర్మించినట్లు అధికారులు తెలిపారు. అదనంగా మరో 20 ఎకరాల మేర పలు నిర్మాణ సంస్థలు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసి చెరువును ఆక్రమించినట్లు గుర్తించారు. స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించింది. ఆక్రమణలు నిర్ధారణ కావడంతో మంగళవారం చర్యలకు దిగిన అధికారులు చెరువు పరిధిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లు, రేకులతో నిర్మించిన ప్రహరీలను తొలగించారు. ప్రస్తుతం చెరువు హద్దులను నిర్ధారిస్తూ ఫెన్సింగ్ పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇక కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్‌లోని జ్యువెల్ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీ ముందు సుమారు 1700 గజాల మేర రహదారి ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా గుర్తించింది. స్థానికుల ఫిర్యాదుల మేరకు సంబంధిత శాఖలతో కలిసి పరిశీలనలు నిర్వహించిన అధికారులు ఆక్రమణలు నిజమని తేల్చారు. దీంతో నిర్మాణ సంస్థకు చెందిన ఆఫీస్ రూమ్‌తో పాటు వెనుక భాగంలో నిర్మించిన పశువుల షెడ్డును తొలగించారు. ఆక్రమణదారులకు ముందుగానే సమయం ఇచ్చిన తర్వాత ఈ చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 మే 2026

# విదేశీ వాణిజ్యం వైపు రైతులకు మార్గం సుగమం

- నిజామాబాద్ మార్కెట్లకు రైతుల ఉత్పత్తుల ఎగుమతి
- వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారం
- ఆధునిక సాగు, మార్కెటింగ్ వ్యూహాలపై అవగాహన




**నిజామాబాద్, మే 26 (జనంసాక్షి):** వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ (డీజీఎఫ్టీ), ఏపీఈడీఏ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్టల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎంఎస్ఎంఈల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లా స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీజీఎఫ్టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలు, శాస్త్రీయ పద్ధతులను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యాంత్రీకరణను వినియోగించడం, మార్కెటింగ్ మెలకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ, పసుపు, వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేకూరుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డీజీఎఫ్టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ. చవాన్ మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి మారకం బలపడుతుందని, ఇది ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్. శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ విద్య, కే. జనార్దన్ రెడ్డి, ఏపీఈడీఏ అధికారి నాయుడు, నాబార్డు డీజీఎం ఎస్. ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.



# పేదల సహనాన్ని పరీక్షించొద్దు

- డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలి
- కొనుగోళ్లు వేగవంతం చేయాలి.. తాగునీటి సమస్యలు తీవ్రం : సీపీఎం

**జమ్మికుంట, మే 26 (జనంసాక్షి):** రెండు పడకగదుల ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా పేదల సహనాన్ని పరీక్షించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి హెచ్చరించారు. మంగళవారం వద్దూరి కిషోర్ అధ్యక్షతన జమ్మికుంట మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ 2017-18లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం ప్రారంభించిందని, 80% ఇండ్లు పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా పేదలకు కేటాయించకుండా ప్రభుత్వ కాలయాపన చేస్తోందన్నారు. ఎవరికి పంపిణీ చేయకపోవడం మూలంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందన్నారు. నాటి బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా ఇండ్లు కట్టించి వదిలేసిందన్నారు. నేటి కాంగ్రెస్ పాలనలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేసి పేదలకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు, వాటర్, డ్రైనేజ్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గతంలో అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారని గుర్తు చేశారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టించి అనేక వ్యయప్రయాసలకు ఓర్చి పంటలు పండిస్తే అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజులైనా కొనుగోలు సెంటర్లలో పడిగాపులు కాస్తున్నారని తేమ పేర్లతో, తాలు పేరుతో రైస్ మిల్లర్లు రైతుల రక్తం తాగుతున్నారని, క్వింటాల్‌కు 6 నుంచి 10 కిలోలు కోత విధిస్తున్నారని అన్నారు. ఇంత పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్న అధికారులు అంటి ముట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు గండి సతీష్, జక్కుల రమేష్, బసిర సంపత్ రావు, వద్లూరి కిషోర్, మధునయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన సమావేశం



**కరీంనగర్ టౌన్, మే 26, (జనం సాక్షి) :** గులాబీ బాస్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెచంద్ర శేఖర్ రావు ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదులో కరీంనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈసారి సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.కరీంనగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమంలో పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ కొండూరు రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ స్థాయి నుంచి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలను సభ్యత్వ నమోదులో భాగస్వాములను చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు వాటి అమలుకు దూరంగా పారిపోతోందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# లారీలు లేక వరి కొనుగోళ్లలో జాప్యం

**వరిధాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళనలో అన్నదాతలు**

**ముత్తారం మే 26(జనంసాక్షి) :** ముత్తారం మండలం హరిపురం వరి కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల వద్ద వరి బస్తాలు పేరుకుపోతున్నాయి. దీంతో రైతులు ఎండలోనే తమ ధాన్యాన్ని కాపాడుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు దానితోపాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలకు గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున వరిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తుండగా, తరలింపు వ్యవస్థ సక్రమంగా లేక కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కొన్నిచోట్ల 4 నుంచి 5 రోజులుగా ధాన్యం కేంద్రాల వద్దే ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణం మారడంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని త్వరగా తరలించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి వరి తరలింపును వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మెప్మా ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభం..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 26 (జనంసాక్షి) :** వేములవాడలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారము శ్రీ రాజరాజేశ్వరీ దేవి మహిళా స్వశక్తి సంఘం క్యాంటీన్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటేశ్వరాలుగా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యులు క్యాంటీన్ నిర్వహణకు ముందుకు రావడంతో వారిని అభినందించారు.మహిళలు ఆర్థికంగా బలోపేతము కావడానికి ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందజేస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ అద్దె బస్సులు,పెట్రోల్ బంకులు నిర్వహణ చేస్తున్నారన్నారు. క్యాంటీన్ నిర్వహకులకు కూడ ప్రభుత్వ రుణాలు అందజేస్తామన్నారు. అనంతరం క్యాంటీన్ నిర్వహకులు మాట్లాడుతూ పదిమంది మహిళా సభ్యులు కలిసి క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మా క్యాంటీన్ ద్వారా రుచి,శుచికరమైన భోజనాలను అందజేస్తామన్నారు.చిన్నచిన్న ఫంక్షన్లకు కేటరింగ్ కూడా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ సంపత్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్,మెప్మా ఎడిఎంసి భూలక్ష్మి,సిఎల్ఆర్పి లు,ఆర్పీలు పాల్గొన్నారు.

# లారీలు లేక వరి కొనుగోళ్లలో జాప్యం

**వరిధాన్యం తడిసిపోతుందేమోనని ఆందోళనలో అన్నదాతలు....**

**ముత్తారం మే 26(జనంసాక్షి) :** ముత్తారం మండలం హరిపురం వరి కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో కేంద్రాల వద్ద వరి బస్తాలు పేరుకుపోతున్నాయి. దీంతో రైతులు ఎండలోనే తమ ధాన్యాన్ని కాపాడుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు దానితోపాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలకు గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున వరిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తుండగా, తరలింపు వ్యవస్థ సక్రమంగా లేక కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కొన్నిచోట్ల 4 నుంచి 5 రోజులుగా ధాన్యం కేంద్రాల వద్దే ఉండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వాతావరణం మారడంతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని త్వరగా తరలించాలని రైతులు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి వరి తరలింపును వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం

- జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో పోలీసుల సోదాలు
- అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు
- 6 కేసులు నమోదు.. లక్షల విలువైన డాక్యుమెంట్లు, ఆభరణాలు స్వాధీనం
- ప్రజలను వేధిస్తే తప్పించుకోలేని శిక్షలు



**సిరిసిల్ల టౌన్, మే 26 (జనంసాక్షి):** నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తూ అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై మంగళవారం ఉదయం పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై 6 కేసులు నమోదు చేసి రూ.1,39,65,000/- విలువైన వివిధ డాక్యుమెంట్లు, రూ.1,77,000/- విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆ తర్వాత అప్పులు, అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడే విధంగా కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని జిల్లా ఎస్పీ కోరారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని, ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వాలని, అలాగే స్థానిక పోలీసు వారికి ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**బి డబ్ల్యు ఓ లక్ష్యం రాజం డీఎస్పీ నాగేంద్ర చారి**



**గంభీరావుపేట మే 26( జనం సాక్షి);**
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండల కేంద్రంలోని దత్త సాయి ఫంక్షన్ హాల్లో డీడబ్ల్యూఓ లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథులుగా డీడబ్ల్యూఓ లక్ష్మీరాజ్యం, డీఎస్పీ నాగేంద్ర చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయిలు 18 సంవత్సరాలు వచ్చాక మాత్రమే వివాహం చేసుకోవాలన్నా రు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో జన్యు పరమైన సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు.బాలికలకు యుక్త వయస్సు వచ్చిన వెంటనే వివాహాలు చేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకుంటున్నట్లు తెలిపారు. అలా చేయడం వల్ల భవిష్యత్లో వారు అనేక కుటుంబ సమస్యలతో పాటు ఆరోగ్య, మానసిక సమస్యలను ఎదుర్కొంటారన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పిల్లల దత్తత చాలా సులభం అని, ప్రభుత్వమే ఆ అవకాశం కల్పించినందున ప్రతి ఈ ఒక్కరు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దత్తత తీసుకోవాలని, అలాగే చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, ఎమ్మార్వో మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, మెడికల్ ఆఫీసర్ అభినయ్, షీ టీం ప్రమీల, సీడీపీఓ ఉమారాణి, సూపర్ వైజర్ రేణుక, ఏపీఎం సుధా, ఎస్సై అనిల్ కుమార్ పాల్గొన్నారు.


# రైతాంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి

- వేములవాడలో రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభం
- నాణ్యమైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి
- 40 ఎకరాల్లో కేంద్రం.. రైతులకు బలమైన అండ
- సీఎం రేవంత్ రెడ్డికి రైతుల తరపున కృతజ్ఞతలు

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (జనంసాక్షి):** రైతాంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వేములవాడలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రాజశ్రీ గార్డెన్స్‌లో వేములవాడ, సిరిసిల్ల డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు నూతన పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయం, నాణ్యమైన విత్తనాలు, పంటలలో సలహాలు సూచనలు ఇస్తూ శాస్త్రవేత్తలు నిరంతరం రైతు క్షేమం కోసం పాటుపడాలని కోరారు. వేములవాడ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే రైతు విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు, సాంకేతిక సలహాలు ఒకే చోట అందేలా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతు విజ్ఞాన కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు ఒకటే కేంద్రం మంజూరు కాగా అది వేములవాడకు రావడం అదృష్టకరమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనుకబడిన వేములవాడకు ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయన్నారు. ధార్మిక, కార్మిక, వ్యవసాయ రంగాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. నేతన్నల కోసం యార్న్ డిపోను తీసుకువచ్చామని, మహిళా సంఘాల బలోపేతం కోసం 8 వేల వీఓ బిల్డింగ్‌లను వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభించారన్నారు. నాకు రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యమని వారు స్పష్టం చేశారు. రైతుల సంక్షేమంపై నిజమైన హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. గతంతో పోలిస్తే ఈసారి వరి దిగుబడులు పెరిగాయని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. తడిసిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే రైతులు వరి కొయ్యాలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో వేములవాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందరెడ్డి, డైరెక్టర్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, రైతులు పాల్గొన్నారు.

# ప్రాచీన కళా వైభవం.. సూర్య చంద్రుల నాటకం ఆకట్టుకుంది


- సంస్కార భారతి సన్మానంతో కళాకారులు సంతోషం
- అంతరించిపోతున్న జానపద కళలను ఆదరించాలి
- భారతీయ సంస్కృతి పరిరక్షణలో సంస్కార భారతి కృషి
- డిజిటల్ యుగంలోనూ గ్రామాల్లో కళా ఉత్సాహం



**సదాశివనగర్, మే 25 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో ప్రదర్శిస్తున్న "సూర్య చంద్రుల" నాటకం గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. మూడు రోజుల పాటు నాటకంలో 24వ తేదీ ప్రదర్శనకు గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై కళాప్రేమను చాటుకున్నారు. సంస్కార భారతి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డా. జి. సమ్మిరెడ్డి సూచన మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ పాతూరి సత్యప్రసాద్, జిల్లా సంయుక్త ప్రధాన కార్యదర్శి డా. ఎన్. రాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నాటక కళాకారులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పాతూరి సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక యుగంలో అంతరించిపోతున్న జానపద కళారూపాలను కాపాడుతూ సమాజానికి అందిస్తున్న కళాకారులు అభినందనీయులని పేర్కొన్నారు. అలాంటి కళలను ఆదరిస్తూ, ఆస్వాదిస్తూ వాటి పరిరక్షణకు తోడ్పడుతున్న గ్రామ ప్రజలను ప్రత్యేకంగా అభినందించారు. సంస్కార భారతి లక్ష్యాలు, భారతీయ సంస్కృతి పరిరక్షణలో సంస్థ చేస్తున్న సేవలను ప్రజలకు వివరించారు.
దాదాపు 1500 నుంచి 2000 మంది వరకు అన్ని వయసుల వారు హాజరై నాటకాన్ని తిలకించారు. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లకు దూరంగా పిల్లలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4:30 గంటల వరకు నాటకం కొనసాగినా ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షించడం కళాపట్ల గ్రామస్తులకున్న అభిమానం, అనుబంధాన్ని తెలియజేసింది. స్వయంగా చాపలు, తాగునీటి సీసాలు తెచ్చుకొని కుటుంబ సమేతంగా నాటకాన్ని ఆస్వాదించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ సందర్భంగా సంస్కార భారతి తరఫున కళాకారులకు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే సంస్కార భారతి సేవలను వివరించే కరపత్రాలను కళాకారులు, గ్రామ పెద్దలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక విభాగ్ సహ సంయోజక్, అధ్యక్షులు బాలరాజు గౌడ్, అమృత రాజేందర్, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రామ అధ్యక్షులు రెడ్డి రాజయ్య, అమృత సంతోష్, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు టేక్రియాల రమేష్, పంతులు మిద్దెల గంగారెడ్డి, కళాబృందం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం

- గుండెపోటు, స్ట్రోక్, హీట్ స్ట్రోక్ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు
- మెడికవర్ ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ



**కరీంనగర్ బ్యూరో, మే 26 (జనవరిసాక్షి) :**
గుండెపోటు, స్ట్రోక్, ప్రమాదాలు, హీట్ స్ట్రోక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో మొదటి గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని, ఆ సమయంలో అందించే వైద్యం రోగి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ ఎమర్జెన్సీ దేను పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో సమయానికి చికిత్స అందకపోతే పరిస్థితి విషమించే ప్రమాదం ఉందన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత లేదా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు. ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మాట తడబడ టం, అకస్మాత్తుగా శరీరం ఒకవైపు పనిచేయకపోవడం, అపస్మారక స్థితి, తీవ్రమైన తలనొప్పి, అధిక రక్తస్రావం వంటి లక్షణాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. చాలామంది ఈ లక్షణాల ను సాధారణ సమస్యలుగా భావించి ఇంటి చిట్కాలు లేదా స్వయంగా మందులు వాడటం వల్ల ఆసుపత్రికి చేరుకునే సమయం ఆలస్యమై ప్రాణాపాయం పెరిగే అవకాశముందని హెచ్చరించారు. ప్రస్తుతం నమోదవు తున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. హీట్ స్ట్రోక్ లక్షణాలైన అధిక శరీర ఉష్ణోగ్రత, తలనొప్పి, మూర్ఛ, బలహీనత, తల తిరగడం, వాంతులు, అధిక అలసట, అయోమయం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవడం, లక్షణాలను ముందుగానే గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా ఆసుపత్రిని సంప్రదించడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ పునరు ద్ఘాటించారు. ప్రపంచ ఎమర్జెన్సీ డే సందర్భంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతను వివరించారు.

# దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

- డీజీపీని కలిసి కోరిన నాగేశ్వర్



**హైదరాబాద్, మే26 (జనంసాక్షి) :** తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏపీలో పలు చోట్ల కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు చేరుకున్నారంటూ ప్రచారం జరిగింది. దాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇదంతా అసత్య ప్రచారమని స్పష్టం చేసింది.

### ప్రొపెసర్ నాగేశ్వర రావు అరెస్ట్‌కు రంగం సిద్ధం

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులు అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆంధ్రా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో నాగేశ్వర్ రావు ఇంటి వద్ద తెలంగాణ పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వర్ రావు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని డీజీపీని కోరారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో అరెస్ట్ చేయాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి ఉండాలని, లేకపోతే అది అక్రమ అరెస్టుగా పరిగణించాల్సి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అరెస్టుకు అనుమతి ఇస్తారా లేక అరెస్టును అడ్డుకుంటారా అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అరెస్ట్ చేసేందుకు వస్తే హైకోర్టులో అరెస్ట్ కాన్సిల్ చేసేందుకు రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు ఉన్నట్లు సమాచారం.

# వర్కింగ్ ఉమెన్ భద్రత సంరక్షణ ప్రభుత్వ బాధ్యత

**బంజారాహిల్స్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్, సఖి కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్, మే 26 (జనంసాక్షి) :** మహిళా వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ "సఖి నివాస్", వన్ స్టాప్ సెంటర్ "సఖి కేంద్రం"ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి,చైల్డ్స్ రైట్స్ కమిషన్ సభ్యులు బండి అపర్ణ, వందన గౌడ్ మరిపల్లి చందన, సరిత, ప్రేమ్ లత అగర్వాల్, ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చే మహిళలకు సురక్షిత వసతి కల్పించేందుకు ప్రభుత్వం వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ హాస్టల్‌లో సుమారు 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లులు కూడా ఇక్కడే బస చేసే విధంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఎదుగుతుంటే కొందరు సహించలేక విమర్శలు చేస్తున్నారని, కానీ మహిళల శక్తి ముందు అలాంటి విమర్శలు నిలవవని అన్నారు. మహిళా అభ్యున్నతిని ఓర్చుకోలేని విపక్షాలకు మహిళలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాల పరిమితిని పెంచిందని తెలిపారు. మహిళా సంఘాలకు రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, మహిళా సూపర్ మార్కెట్లు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు ఖర్చులకోసం కోసం ఇతరులను ఆశ్రయించే స్థితి నుంచి.. ఇంటి ఖర్చులు భరించే స్థాయికి, పిల్లల చదువు బాధ్యతలు చూసుకునే స్థాయికి, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి మహిళలను తీసుకెళుతున్నామని అన్నారు. సంపద సృష్టించే శక్తిగా మహిళలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని, రాష్ట్రం సంపన్నమవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్లను బుధవారం నాడు ప్రారంభించనున్నామని, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభిస్తామని జూన్ 5న మహిళలకు ఆర్టీసీ బస్సులను సీఎం రేవంత్ రెడ్డి అందజేస్తారని మంత్రి సీతక్క వెల్లడించారు. మహిళా ఉన్నతే తెలంగాణ ప్రగతి అని, గ్రామ గ్రామాన మహిళలు సాధిస్తున్న విజయాలను సమాజానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

# మంత్రి జూపల్లి ఆదేశాలతో అన్‌లోడింగ్ సమస్య

- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

**నాగర్ కర్నూల్, మే26 (జనంసాక్షి) :** మంత్రి జూపల్లి ఆదేశాలకు భయపడి అధికారులు నాగర్ కర్నూల్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడూర్ మండలం పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులోని మణికంఠ కాటన్ మిల్లు గోదాం దగ్గర మొక్కజొన్న, ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్,పరిస్థితిని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్‌లోడింగ్ సమస్యను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నేరుగా గోదాంకు వెళ్లి రైతుల ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కేవలం మంత్రి జూపల్లి ఆదేశాలతో కొల్లాపూర్‌కు చెందిన దళారుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొల్లాపూర్‌కు చెందిన 30 లారీల ధాన్యం అన్‌లోడ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థకు మద్దతిస్తుందని తెలిపారు. రైతుల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల వివక్షత చూపితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గోదాం వద్ద ఉన్న రైతులకు, డ్రైవర్స్‌కు స్వయంగా భోజనం తెప్పించి పెట్టారు. ఆయన వెంట పలువురు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

- ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ
- వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు




**న్యూఢిల్లీ, మే 26 (జనంసాక్షి) :** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

# డబ్బుల కోసం డ్రగ్స్ సరఫరా

- పంజాబీ సింగ్ సోహల్ అరెస్ట్

**చండీఘడ్, మే26 (జనంసాక్షి) :** డ్రగ్స్ కేసులో పంజాబీ సింగర్ హర్బీర్ సింగ్ సోహాల్ అరెస్టయ్యాడు. కారులో హెరాయిన్ తరలిస్తుండగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. కారు నుంచి 5.1 కేజీల హెరాయిన్, 1.50 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఖన్నా ఎస్ఎస్‌పీ దర్పన్ అహ్లువాలియా తెలిపిన వివరాల మేరకు డ్రగ్స్ సప్లై రాకెట్‌లో హర్బీర్ కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడు. హ్యాండ్లర్‌ల ద్వారా ఆస్ట్రేలియా, కెనడా నుంచి వచ్చిన డ్రగ్స్‌ను లోకల్ సప్లయర్స్‌కు చేరవేస్తున్నాడు. మే 7వ తేదీన 22 ఏళ్ల అక్షయ్ కుమార్ అనే వ్యక్తి డ్రగ్ ట్రాఫికింగ్ కేసులో అరెస్టయ్యాడు. పోలీసులు అతడి ఇంట్లో పెద్ద మొత్తంలో డ్రగ్స్ గుర్తించారు. 301 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా.. లుథియానాలోని షిమ్లపురికి చెంన విశాల్, సంజీవ్ కుమార్‌ల నుంచి తాను డ్రగ్స్ కొనుగోలు చేశానని చెప్పాడు. పోలీసులు సంజీవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హర్బీర్ సోహాల్ పేరు బయటకు వచ్చింది. హర్బీర్‌పై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయి. 2022లో అతడు ఎక్స్‌టార్షన్ రాకెట్ కేసులో అరెస్ట్ అయ్యాడు. కొన్ని నెలల పాటు జైలులో ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇప్పుడు డ్రగ్స్ రాకెట్ కేసులో అరెస్ట్ అయ్యాడు.

# నేడు ఢిల్లీకి తమిళనాడు సిఎం విజయ్

- ప్రధాని మోడీతే భేటీకి అవకాశం



**చెన్నై, మే26 (జనంసాక్షి) :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీ పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బుధవారం ఉదయం సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సహా విజయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే ఈ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఆయన కలవనున్నారు. విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తొలి పర్యటన కావడం గమనార్హం.

# డిజిటల్ యుగంలో ప్రజలకు వైఫై ముఖ్యం

- అందుబాటులో టెక్నాలజీ అవసరం
- పిఎం వాణిపై సమీక్షించిన మంత్రి పెమ్మసాని



**న్యూఢిల్లీ, మే26 (జనంసాక్షి) :** పీఎం వాణి ద్వారా ప్రతి పౌరుడికీ సులభమైన పబ్లిక్ వైఫై అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో పీఎం వాణి అమలుపై ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు, ప్రయాణికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరికీ ప్రజా వైఫై కీలక ప్రజా సేవగా మారుతోందన్నారు. వినియోగదారులకు మరింత సులభతరం చేసేలా ల్యాప్ టాప్‌లు, ఇతర సెకండరీ పరికరాలకు క్యూఆర్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మొబైల్ ద్వారా క్యూఆర్ స్కాన్ చేసి సులభంగా ల్యాప్‌టాప్‌ను కనెక్ట్ చేసుకునే విధంగా వ్యవస్థను రూపొం దిస్తున్నామని చెప్పారు. తక్కువ సమయం ఇంటర్నెట్ అవసరమయ్యే వినియోగదారుల కోసం 15, 30, 60 నిమిషాల స్వల్ప కాల వినియోగ ప్లాన్లు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, మాల్స్, ప్రజా ప్రదేశాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత సులభతరం చేయడమే లక్ష్యమన్నారు. పీఎం వాణి హాట్‌స్పాట్‌ల గుర్తింపును మరింత సులభతరం చేసేలా స్టాండర్డ్ నేమింగ్ విధానాన్ని తీసుకు వస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మరింత వేగవంతమైన, సురక్షితమైన, నమ్మకమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు పీఎం వాణి వ్యవస్థలో సమగ్ర మార్పులు చేపడుతున్నామని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా లక్ష్యాలను అనుగుణంగా దేశంలో ప్రతి పౌరుడికి సులభమైన డిజిటల్ కనెక్టివిటీ అందుబాటులోకి తీసుకురావడమే తమ సంకల్పమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో పీఎం వాణి అమలు వేగవంతం, వినియోగదారుల అనుభవం మెరుగుదల, డిజిటల్ కనెక్టివిటీ విస్తరణ తదితర అంశాలపై అధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు.



# ఎంజీబీఎస్‌లో బస్సులో మంటలు

**హైదరాబాద్,మే 26 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహబూబ్‌నగర్, గద్వాల వైపు వెళ్లే బస్సులు ఆగే ప్రాంతంలోని ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భయంతో బస్సు దిగి ప్రయాణికులు పరుగులు తీశారు. అనంతరం ప్రయాణికులు బస్సు దిగి మంటలార్పే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న ఆర్టీసీ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నీళ్లతో ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

# డ్రైవర్ అశోక్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను కొనుగోలు చేయాలని మంత్రికి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించిన జగిత్యాల డిపో ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను విధుల నుంచి తప్పించడం దుర్మార్గమైన చర్య అని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం గురించి పెద్ద పెద్ద లెక్చర్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ... అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా పాతర వేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అంటూ ఏడో గ్యారంటీగా ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్.. నేడు ప్రజా సమస్యలపై ప్రశ్నించే సామాన్యుల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. ఒక సామాన్య డ్రైవర్‌పై ఇంత కక్షసాధింపు చర్యలకు దిగడం చూస్తుంటే ఇది ప్రజా ప్రభుత్వం కాదు, ఒక కర్కోటక ప్రభుత్వం అని స్పష్టమవుతోందన్నారు. విధుల నుంచి అన్యాయంగా తప్పించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే టీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# ఏపీలో 'ఫార్మ్ టు హోమ్' విధానం

- రైతుల నుంచి నేరుగా ప్రజలకు ఉత్పత్తులు
- అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, మే26 (జనంసాక్షి) :** రాష్ట్రంలో 'ఫార్మ్ టు హోమ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా కొత్త మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా, పశు సంవర్ధక రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యడవోలు సమీపంలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు జులై నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కడప జిల్లా పులివెందులలో నిర్మాణంలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహంగా కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమం కోసం 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మాయమవుతున్న చెరువును కాపాడిన హైడ్రా

- మాధాపూర్‌లో 6.05 ఎకరాల ఈదులకుంట కబ్జాలకు కట్టడి
- చెరువుకు ఆనుకుని 5.16 ప్రభుత్వ భూమికి కూడా హైడ్రా ఫెన్సింగ్
- కోకాపేట కొత్త చెరువులో 22 ఎకరాల ఆక్రమణల తొలగింపు
- ఒకే రోజు దాదాపు 34 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా
- మొత్తం రూ. 4వేల కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్



**హైదరాబాద్, మే 26 (జనంసాక్షి) :** చెరువుల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. మంగళవారం ఒకే రోజు రెండు చెరువులను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో కబ్జాదారులు మాయం చేసిన 6.05 ఎకరాల ఈదులకుంట జాడను కనిపెట్టింది. ఆ పక్కనే ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జాల చెరనుంచి విముక్తి కల్పించింది. అలాగే గండిపేట మండలంలోని కోకాపేట గ్రామంలోని కొత్త చెరువు మధ్యలోంచి బండ్ నిర్మించి ఎగువ ప్రాంతాన్ని కబ్జా చేయాలనే రియల్టర్ల ప్రయత్నాలకు బ్రేకులు వేసింది. కొత్త చెరువులో మొత్తం 22 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. రెండు చోట్ల హైడ్రా ఫెన్సింగ్ వేసి దాదాపు రూ. 4 వేల కోట్ల విలువైన భూమి కబ్జాల పాలవ్వకుండా హైడ్రా రక్షించింది. స్థానికుల ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖలతో పరిశీలించి చెరువుల కబ్జాలను హైడ్రా అధికారులు నిర్ధారించుకున్నారు. ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేయాలనే కబ్జాదదారుల ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట నిండితే వరద కాలువ ద్వారా ఈదుల కుంటకు నీరు చేరేది. ఆ కాలువను డైవర్ట్ చేయడంతో ఈదుల కుంటకు వరద నీరు చేరకుండా చేశారు. చెరువు రూపురేఖలు మార్చేసి.. హద్దులు చెరిపేసి... ఇక భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట - ఈదులకుంట- సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వాటిలో ఈదుల కుంట మాయమౌతోందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదయ్యింది. స్థానికుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రాకు అక్కడ చెరువు ఆనవాళ్లు కనిపించాయి. గ్రామ, రెవెన్యూ రికార్డుల మేరకు 6.05 ఎకరాల చెరువున్నట్టు నిర్ధారించుకుంది. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు కూడా నిర్ధారించాయి. దీంతో మంగళవారం చెరువు హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేసింది. 6.05 ఎకరాల ఈదులకుంటకు తోడు.. ఆ పక్కనే సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడినట్టు అయ్యింది. ఇలా మొత్తం మాధాపూర్‌లోనే దాదాపు రూ. 1800 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. ఈ భూమి చుట్టూ హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370